

జోడు రమేష్ కుమార్
చీఫ్ బ్యూరో
+91 99592 92159

KADILIMCHE VAARTHA Telugu daily

# కదిలించే వార్త

తెలుగు దినపత్రిక

NATIONAL NEWS CHANNEL TV6

సంపుటి : 05 సంచిక : 348 పేజీలు : 08, వెల రూ. 5రూ/ శుక్రవారం - 23 - మే - 2025

Ananthapuramu. Vijayawada. Tirupati. Visakhapatnam. tadepalligudem. Guntur. Kurnool. Nellore. Srikakulam. Rajamahendravaram. Kadapa. Ongole. Chittoor. Hyderabad. mahabubnagar. Warangal. Khammam. Nalgonda. Nizamaba


## కేవలం 500 కోట్లతో

# రాజధాని నిర్మించవచ్చు


2 లో

- కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందన్న వైఎస్ జగన్
- అమరావతి నిర్మాణం స్కాములకు పరాకాష్ఠగా మారిందని ఆరోపణ
- సంక్షేమం మాటే లేదని, స్కాములు చేస్తూ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ అప్పులమయం చేశారని ఆక్షేపించారు.
- 51 వేల కోట్లు అప్పులు తీసుకువచ్చి అమరావతిని నిర్మిస్తూ, నిర్మాణ అంచనాలు భారీఎత్తున
- ప్రశ్నించే గళాన్ని అడ్డుకునేందుకే వైఎస్సార్సీపీ నేతలు, అధికారులపై కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు.

## తెలుగు రాష్ట్రాలకు

# వర్ష సూచన...


2 లో

- అరేబియా సముద్రంలో అల్పపీడనం, 36 గంటల్లో వాయుగుండంగా మార్పు
- 27న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పాటుకు అవకాశం
- తెలంగాణలో నేడు భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఈదురుగాలులు
- ఏపీలో మే 26, 27 తేదీల్లో విస్తారంగా వర్షాలు కురిసే సూచన
- హైదరాబాద్‌లో మోస్తరు వర్షాలు, గంటకు 40-50 కి.మీ. వేగంతో గాలులు
- రానున్న మూడు రోజులు తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం

అమరావతి :తెలుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ విభాగం (ఐఎండీ), హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లటి వార్త అందించాయి. రానున్న కొద్ది రోజుల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశాలున్నాయని స్పష్టం చేశాయి. అరేబియా సముద్రం, బంగాళాఖాతంలో ఏర్పడుతున్న అల్పపీడనాలు, నైరుతి రుతుపవనాల కదలికలే ఈ వర్షాలకు ప్రధాన కారణమని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

## ఉగ్రవాదులు పాక్‌లో

# ఎక్కడున్నా వేటాడుతాం


2లో..

- ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది ఉగ్రవాదులు పాక్‌లో ఎక్కడున్నా వేటాడుతాం
- మరో ఉగ్రదాడి జరిగితే ఊరుకోం
- అమెరికా సంప్రదిస్తే నేరుగా పాక్‌తోనే చర్చలని తేల్చి చెప్పాం-విదేశాంగ మంత్రి జైశంకర్ వార్నింగ్
- పహల్గాం తరహాలో మరో ఉగ్రదాడి జరిగితే భారతదేశం తప్పకుండా స్పందిస్తుందని,

ఢిల్లీ: 'ఆపరేషన్ సిందూర్' ఇంకా కొనసాగుతోందని భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పష్టం చేశారు. పహల్గాం తరహాలో మరో ఉగ్రదాడి జరిగితే భారతదేశం తప్పకుండా స్పందిస్తుందని, ఉగ్రవాదులు పాకిస్తాన్‌లో ఎక్కడున్నా వేటాడి మరీ దాడి చేస్తుందని ఆయన తేల్చి చెప్పారు. ఆమ్‌స్టర్‌డామ్‌లో ఎన్‌ఓఎస్ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఆపరేషన్ సిందూర్‌ను భారత్ కొనసాగించడం వెనుక ఒక సందేశం ఉంది. ఉగ్రవాదంపై పోరాటంలో రాజీపడని భారతీయ తత్వానికి ఇది నిదర్శనం. ఆపరేషన్‌ను కొనసాగించడం అంటే ఒకరిపై ఒకరు కాల్పులు జరుపుకోవడం కాదు.

## అమరావతిపై విషం

# చిమ్ముతున్నారు..

### జగన్‌పై మంత్రి పయ్యావుల ఫైర్


2

- మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై మంత్రి పయ్యావుల కేశవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.
- జగన్ పాలనలో గ్రామస్థాయి నుంచి తాడేపల్లి ప్యాలెస్ వరకు కప్పం కట్టారని ఆరోపించారు.
- ల్యాండ్, మైన్స్, సాండ్, వైన్స్ అన్ని స్కాములు జరిగింది జగన్ హయాంలోనేనని విమర్శలు

అనంతపురం: మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమరావతిపై విషం చిమ్ముతున్నారని

## ఢిల్లీకి బయలుదేరిన

# సీఎం చంద్రబాబు

## కేంద్ర మంత్రులతో వరుస భేటీలు


- రాష్ట్రానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చలు
- ఎల్లుండి నీతి ఆయోగ్ భేటీలో పాల్గొననున్న సీఎం
- 24న రాత్రి కుప్పం పయనం
- ఇవాళ రాత్రి 9 గంటలకు అమిత్ షాతో భేటీ
- రేపు పలువురు కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు


మిగతాది 2లో

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించేందుకు హస్తిన బాట పట్టారు. గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో

## దేశంలో మళ్లీ కరోనా అలజడి..

## పలు రాష్ట్రాల్లో పెరుగుతున్న కేసులు!


2

- ముంబై, చెన్నై, అహ్మదాబాద్ నగరాల్లో అధిక వ్యాప్తి
- మహారాష్ట్రలో మే నెలలో 95 కొత్త కేసులు నమోదు
- తమిళనాడులోనూ పెరుగుతున్న కోవిడ్ బాధితులు
- ప్రస్తుతానికి కేసులన్నీ స్వల్ప లక్షణాలతోనే ఉన్నట్లు వెల్లడి

అమరావతి : దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో కరోనా వైరస్ కేసులు మళ్లీ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో కోవిడ్-19 బాధితుల సంఖ్య క్రమంగా అధికమవుతుండటంతో ఆరోగ్య శాఖ అధికారులు నిఘా పెంచి, ముందుజాగ్రత్త చర్యలు ముమ్మరం చేశారు. అయితే, ప్రస్తుతానికి నమోదవుతున్న కేసులన్నీ స్వల్ప లక్షణాలతోనే ఉన్నాయని, ఎటువంటి మరణాలు సంభవించలేదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయినప్పటికీ, ముంబై, చెన్నై, అహ్మదాబాద్ వంటి ప్రధాన నగరాల్లో కేసుల పెరుగుదల స్పష్టంగా కనిపిస్తోంది. మహారాష్ట్ర ఆరోగ్య శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, ఒక్క ముంబై నగరంలోనే మే నెలలో 95 కొత్త కోవిడ్ కేసులు నమోదయ్యాయి.

## కాళేశ్వరంపై నిజం నిలకడగా

# తేలుతుందన్న కేటీఆర్


2 లో

- బ్యారేజీలో రెండు పగుళ్లకే అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం
- కమీషన్ల నుంచి డైవర్షన్ కోసమే కాళేశ్వరం డ్రామా అని ఆరోపణ
- సీఎం రేవంత్ రెడ్డి ఓ అపరిచితుడు అని ఎద్దేవా

హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన వాస్తవాలు నిలకడగా వెలుగులోకి వస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీ రామారావు పేర్కొన్నారు.

## సీఎం హెూదాలో నాంపల్లి

# కోర్టుకు రేవంత్ రెడ్డి

- నాంపల్లి మనోరంజన్ కోర్టులో హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి
- ముఖ్యమంత్రి హెూదాలో రెండోసారి కోర్టుకు
- ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని బేగంబజార్, నల్గొండ, మెదక్ పీఎస్‌లలో గతంలో కేసులు నమోదు


మిగతాది 2లో

హైదరాబాద్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించారంటూ నమోదైన కేసుల్లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి నాంపల్లి మనోరంజన్ కోర్టుకు హాజరయ్యారు.



2 లో

## హైదరాబాద్‌కు 2,000 ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపు

- పీఎం ఈ-డ్రైవ్ పథకంలో భాగంగా కేంద్రం నిర్ణయం
- కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి వెల్లడి
- దేశవ్యాప్తంగా ఐదు నగరాలకు మొత్తం 14,028 బస్సులు
- రెండేళ్లలో రూ.10,900 కోట్ల ఆర్థిక కేటాయింపు

## ప్రధాని మోదీ మౌనాన్ని ప్రశ్నించిన

# జైరాం రమేశ్


2

- భారత్-పాక్ మధ్యవర్తిత్వంపై ట్రంప్ వ్యాఖ్యలు
- గత 11 రోజుల్లో ట్రంప్ 8 సార్లు ఇదే ప్రస్తావన
- 'ఆపరేషన్ సిందూర్'ను తానే ఆపించానన్న ట్రంప్
- ట్రంప్ వాదనలను ఖండించిన భారత విదేశాంగ శాఖ
- మోదీ, జైశంకర్ ఎందుకు స్పందించడం లేదన్న జైరాం

ఢిల్లీ : భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గించడంలో తాను కీలక పాత్ర పోషించానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పదేపదే చేస్తున్న ప్రకటనలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనం వహించడాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ తప్పుబట్టారు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత పరిణామాలపై ట్రంప్ చేస్తున్న వాదనలను ప్రధాని ఎందుకు ఖండించడం లేదని ఆయన నేడు ప్రశ్నించారు. ఏఎన్ఐ వార్తా సంస్థతో జైరాం రమేశ్ మాట్లాడుతూ, "అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాను భారత్‌ను ఒప్పించి కాల్పుల విరమణకు మార్గం సుగమం చేశానని గత 11 రోజుల్లో దాదాపు 8 సార్లు చెప్పారు. అయినా, ఆయన మిత్రుడైన ప్రధాని మోదీ దీనిపై పెదవి విప్పడం లేదు.

# దేశంలో మళ్లీ కరోనా అలజడి..

జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా నమోదైన 106 కేసుల్లో ఇది అత్యధికం కావడం గమనార్హం. ప్రస్తుతం 16 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా, వీరిలో చాలామందిని వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు కేఈఎం ఆసుపత్రి నుంచి సెవెన్ హిల్స్ ఆసుపత్రికి తరలించారు. ఇన్ ఫ్లుయెంజా లేదా తీవ్రమైన శ్వాసకోశ ఇన్ఫెక్షన్ లక్షణాలున్న వారందరికీ కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరోవైపు, పుణె నగరంలో ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో యాక్టివ్ కేసులు లేనప్పటికీ, ముందుజాగ్రత్త చర్యగా నాయుడు ఆసుపత్రిలో 50 పడకలను సిద్ధం చేశారు. మే నెలలో మంజరీ ప్రాంతానికి చెందిన 87 ఏళ్ల వృద్ధురాలు మాత్రమే కోవిడ్ బారిన పడి, పూర్తిగా కోలుకున్నారని పుణె మున్సిపల్ కార్పొరేషన్ ఆరోగ్య విభాగం చీఫ్ డాక్టర్ నీనా బోరాడే తెలిపారు. నగరంలోని ససూన్ ఆసుపత్రుల్లో ప్రస్తుతం పరీక్షలు నిర్వహించడం లేదని, కేంద్రం నుంచి కొత్త మార్గదర్శకాల కోసం ఎదురుచూస్తున్నామని ఆమె పేర్కొన్నారు. తమిళనాడులోనూ కరోనా కేసులు పెరుగుతున్నాయి. పుదుచ్చేరిలో 12 కొత్త కేసులు వెలుగుచూశాయి. చెన్నై నగరంలో గతంలో ఇన్ ఫ్లుయెంజాగా భావించిన జ్వరాలు ఇప్పుడు ఎక్కువగా కోవిడ్-19గా నిర్ధారణ అవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. కొన్ని ఆసుపత్రుల్లో ఇన్ఫెక్షన్ ముప్పు కారణంగా అవయవ మార్పిడులు, గుండె శస్త్రచికిత్సలు వంటి కీలకమైన ఆపరేషన్లను కూడా వాయిదా వేస్తున్నారు. కర్ణాటకలో 16 యాక్టివ్ కోవిడ్ కేసులు ఉన్నాయని ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దినేష్ గుండూరావు ధృవీకరించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలో ఒక్కరోజే ఏకంగా ఏడు కొత్త కేసులు బయటపడ్డాయి. గత ఏడాది కాలంగా నెలకు సగటున ఒక కేసు మాత్రమే నమోదైన ఈ నగరంలో ఇది ఆకస్మికంగా పెరుగుదలగా అధికారులు గుర్తించారు. బాధితులందరూ హోం ఐసోలేషన్‌లో ఉన్నారని, వారి నమూనాలను జన్యు పరీక్షల కోసం పంపించామని తెలిపారు.

## కేవలం 500 కోట్లతో

## రాజధాని నిర్మించవచ్చు

అమరావతి : కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందని వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆరోపించారు. రెడ్ బుక్ రాజ్యాంగం నడుపుతూ వైఎస్సార్సీపీ నేతలు, ఐఏఎస్, ఐపీఎస్‌లపై తప్పుడు కేసులు పెట్టి అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు హయాంలో మేనిఫెస్టోలో ఇచ్చిన 143 హామీలు సహా అభివృద్ధి, సంక్షేమం మాటే లేదని, స్కాములు చేస్తూ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ అప్పులమయం చేశారని ఆక్షేపించారు. రాజధాని అమరావతి నిర్మాణం స్కాములకు పరాకాష్ఠగా మారిందన్న జగన్, నిర్మాణ అంచనాలను భారీగా పెంచి విపరీతంగా దోపిడీ చేస్తున్నారన్నారు. 51 వేల కోట్ల అప్పులు తీసుకువచ్చి అమరావతిని నిర్వీర్య, నిర్మాణ అంచనాలు భారీవెత్తున పెంచి కూటమి నేతలు దోపిడీ చేస్తున్నారని ఆక్షేపించారు. అవసరం లేకపోయినా సచివాలయం టవర్లు, విభాగాధిపతుల భవనాల నిర్మాణం చేపట్టి పెద్దఎత్తున దోచుకుంటున్నారన్నారు. హైదరాబాద్‌లో కేవలం 8.58 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 616 కోట్లతో కేసీఆర్ సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు నిర్మించారని గుర్తు చేశారు. 2018లో 5 ఐకానిక్ టవర్ల నిర్మాణానికి 2271 కోట్లకు చంద్రబాబు ప్రభుత్వం టెండర్లు పిలవగా, ఇప్పుడు అవే బిల్డింగ్‌లకు మిగిలిపోయిన పనులకు 4 వేల 668 కోట్ల రూపాయల చొప్పున టెండర్లు ఖరారు చేశారన్నారు. విజయవాడ - గుంటూరు మధ్యలో రాజధాని: అంటేనే పనులను ఏకంగా 105 శాతం పెంచి ఎక్కడా లేని విధంగా చదరపు అడుగుకు 8931 రూపాయలు ఖర్చు చేస్తూ దోపిడీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటి వరకు కట్టిన భవనాల నిర్మాణాలకు వెచ్చించిన 600 కోట్ల రూపాయలు గంగపాలు చేస్తున్నారన్న జగన్, విజయవాడ - గుంటూరు మధ్యలో నాగార్జున యూనివర్సిటీ వద్ద కేవలం 500 కోట్లతో రాజధాని నిర్మించవచ్చని అన్నారు. ప్రశ్నించే గళాన్ని అణచివేసేందుకే వైఎస్సార్సీపీ నేతలు, అధికారులపై కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో లిక్కర్ కేసులో ఎక్కడా స్కాం జరగలేదన్న జగన్, తప్పుడు సాక్ష్యాలు, వాంగ్మూలాలు సృష్టించి అరాచకం చేస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రలోభాలకు విజయసాయిరెడ్డి లొంగిపోయారన్న జగన్, మూడున్నర ఏళ్ల పదవీ కాలం ఉండగానే రాజీనామా చేసి కూటమి ప్రభుత్వానికి సాయిరెడ్డి మేలు చేశారని ఆరోపించారు. ప్రలోభాలకు లొంగి రాజీనామా చేసిన విజయసాయిరెడ్డి స్టేట్‌మెంట్లకు విలువ ఏముంటుందన్నారు. లిక్కర్ కేసులో అరెస్టైన నేతలు, అఖిలభారత సర్వీసు అధికారులు ఎవరూ అక్రమాలు చేయలేదని వెనకేసుకొచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఎన్నికల ఫలితాలు వచ్చిన జూన్ 4న వెన్నుపోటు దినంగా పాటిస్తామన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం నడుపుతూ వైఎస్సార్సీపీ నేతలు, అధికారులపై కేసులు, అరెస్టులకు నిరసన తెలుపుతూ, ప్రజలతో కలిసి నిరసన తెలిపి కలెక్టర్లకు డిమాండ్ పత్రాలిస్తామన్నారు.

## ఢిల్లీకి బయలుదేరిన సీఎం చంద్రబాబు

కొద్దిసేపటి క్రితమే ఆయన ఢిల్లీకి బయలుదేరారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన విషయాలపై చర్చించనున్నారు. ఈ రోజు రాత్రి 8 గంటల ప్రాంతంలో ఢిల్లీకి చేరుకోనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, రాత్రి 9 గంటలకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో సమావేశం కానున్నారు. ఈ భేటీలో రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలు, ముఖ్యంగా నూతన క్రిమినల్ చట్టాల అమలు తీరుపై కేంద్ర హోంమంత్రి నిర్వహించే సమీక్షలో కూడా చంద్రబాబు పాల్గొంటారని సమాచారం. రేపటి షెడ్యూల్ కూడా బిజీగా ఉండనుంది. ఉదయం 10 గంటలకు పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో సమావేశమై, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు రాష్ట్రానికి అవసరమైన సహకారంపై చర్చిస్తారు. అనంతరం 11 గంటలకు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో, మధ్యాహ్నం 12 గంటలకు జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్‌తో భేటీ అవుతారు. ఆ తర్వాత, మధ్యాహ్నం 1 గంటకు సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్‌తో, సాయంత్రం 3 గంటలకు ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశం కానున్నారు. ఈ సమావేశాల్లో మౌలిక సదుపాయాలు, విద్యుత్తు, నీటి వనరుల నిర్వహణ వంటి అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంపై దృష్టి సారించనున్నారు. రేపు రాత్రి 9 గంటలకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో కూడా చంద్రబాబు భేటీ కానున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 24వ తేదీన (ఎల్లుండి) ముఖ్యమంత్రి చంద్రబాబు నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొంటారు. ఆ రోజు రాత్రికి ఢిల్లీ నుంచి బయలుదేరి, నేరుగా బెంగళూరు చేరుకుంటారు. బెంగళూరు నుంచి కుప్పం వెళ్లి, ఆ రోజు రాత్రి అక్కడే బస చేస్తారు. మరుసటి రోజు, అనగా 25వ తేదీన ఆయన అమరావతికి తిరిగి వచ్చే అవకాశాలున్నాయి.

## ప్రధాని మోదీ మౌనాన్ని

## ప్రశ్నించిన జైరాం రమేశ్

మన విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా మౌనంగానే ఉన్నారు. అమెరికా జోక్యం వల్లే కాల్పుల విరమణ సాధ్యమైందని అమెరికా విదేశాంగ మంత్రి చెబుతుంటే, ప్రధాని మోదీ గానీ, జాతీయ భద్రతా సలహాదారు గానీ, విదేశాంగ మంత్రి గానీ ఎవరూ దీని ఖండించడం లేదు. అందరూ నిశ్శబ్దంగా ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోంది" అని అన్నారు. "డొనాల్డ్ ట్రంప్ ఒకేసారి ప్రధాని మోదీని, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను పొగడటం చూస్తుంటే, భారత్, పాకిస్థాన్‌లను ఒకే గాటన కడుతున్నట్లుంది. ఇది మాకు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. ప్రధాని మోదీ ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉంటున్నారు?" అని జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఇతర దేశాలకు ప్రతినిధి బృందాలను పంపడం ద్వారా అసలు సమస్య నుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని, దానికి బదులుగా ట్రంప్ చేస్తున్న ఆరోపణలకు ప్రధాని మోదీ స్పష్టమైన సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. "ప్రధాని మోదీ తరచూ ట్రంప్‌ను 'నా మిత్రుడు' అని సంబోధిస్తారు. ఇప్పుడు ఆ మిత్రుడే 'ఆపరేషన్ సిందూర్' తన వల్లే ఆగిపోయిందని చెబుతున్నారు. అసలు 'ఆపరేషన్ సిందూర్' ఎందుకు ఆగిపోయిందో తెలియక దేశ ప్రజలు అయోమయంలో ఉన్నారు. ఈ ప్రశ్నలకు ప్రధాని మోదీ తప్పక జవాబివ్వాలి" అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఇటీవల దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసాతో జరిగిన ఒక సమావేశంలో డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, "పాకిస్థాన్, భారత్‌తో మేం ఎం చేశామో గమనించండి. మేం ఆ సమస్యను పరిష్కరించాం. బహుశా వాణిజ్య చర్చల ద్వారానే దాన్ని చక్కదిద్దినట్లు నేను భావిస్తున్నా. మేం భారత్‌తో ఒక పెద్ద ఒప్పందం చేసుకుంటున్నాం. పాకిస్థాన్‌తో కూడా ఒక పెద్ద ఒప్పందం చేస్తున్నాం. కాల్పులు తీవ్రతరమవుతున్న సమయంలో మేం వారితో మాట్లాడి పరిస్థితిని చక్కదిద్దాం. ఆ తర్వాత రెండు రోజులకు ఏదో జరిగింది, అది ట్రంప్ తప్పన్నారు. కానీ పాకిస్థాన్‌లో కొందరు అద్భుతమైన వ్యక్తులు, మంచి నాయకులు ఉన్నారు. భారత్ నా మిత్రదేశం. మోదీ, గొప్ప వ్యక్తి" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## కాళేశ్వరంపై నిజం నిలకడగా

## తేలుతుందన్న కేటీఆర్



కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్ల వ్యవహారం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాళేశ్వరంపై నోటీసుల నాటకం ఆడుతోందని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఒక బ్యారేజీలో రెండు పిల్లర్లు పగుళ్లు కనిపిస్తే, ఏదో పెను ప్రమాదం జరిగిపోయినట్లుగా చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. ఘోష్ కమిటీ విచారణ పూర్తయిందని ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పుడు కొత్తగా నోటీసులు జారీ చేయడంలో అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఇది కేవలం ప్రజల దృష్టిని మళ్లించే వ్యూహంలో భాగమేనని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహారశైలి ఒక అపరిచితుడిలా ఉందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి అప్పు పుట్టడం లేదని ఒకప్పుడు 'రెమో'లా చెబుతూ... మరోవైపు రూ. లక్షా 60 వేల కోట్ల రుణాలు ఇప్పటికే చేశామని 'రాము'లా చెబుతారు అని ఎద్దేవా చేశారు. ఇటీవరకే ఇచ్చిన హామీలకే దిక్కులేని పరిస్థితుల్లో, ఇప్పుడు కొత్తగా నల్లమల డిక్లరేషన్ ప్రకటించాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆయన నిలదీశారు. గత నెల రోజులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు ప్రధాన సుందరీమణులు, మాజీ సీఎం కేసీఆర్‌కు నోటీసులు ఇవ్వడం వంటి అంశాల చుట్టే తిరుగుతున్నాయని కేటీఆర్ ఎద్దేవా చేశారు. తాము నిర్మించిన కట్టడాల ముందే ఈ ప్రపంచ సుందరీమణులు ఫొటోలు దిగుతున్నారని ఆయన అన్నారు.

# తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన...

మొదటి పేజీ తరువాయి

తెలంగాణలో వర్షాలు, హైదరాబాద్‌కు ఊరట

తూర్పు మధ్య అరేబియా సముద్రంలో, దక్షిణ కొంకణ్–గోవా తీరానికి దగ్గరగా కొనసాగుతున్న అల్పపీడనం రాబోయే 36 గంటల్లో మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ అల్పపీడనం నుంచి ఉత్తర తెలంగాణ వరకు ఒక ద్రోణి విస్తరించి ఉండటంతో, రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురుస్తాయని అంచనా వేశారు. ముఖ్యంగా మే 26వ తేదీ వరకు తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కొనసాగే సూచనలున్నాయి. కొమరం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని, ఈ సమయంలో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు. హైదరాబాద్ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో గురువారం ఆకాశం సాధారణంగా మేఘాలతో కప్పబడి ఉంటుందని, తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేసింది. నగరంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలున్నాయి. గురువారం నాడు హైదరాబాద్‌లో గరిష్ఠంగా 32.6 డిగ్రీలు, కనిష్ఠంగా 23.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న మూడు రోజుల పాటు తెలంగాణ వ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ సహా అనేక జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ఏడు రోజుల వాతావరణ సూచనలో పేర్కొన్నారు.



### ఆంధ్రప్రదేశ్‌లోనూ వర్ష సూచన

మరోవైపు, మే 27న తేదీన పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతం ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఇది ఏర్పడిన తర్వాత రెండు రోజుల్లో మరింత బలపడే సూచనలున్నాయని అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో కోస్తాంధ్ర, యానాం ప్రాంతాల్లో మే 26, 27 తేదీల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాయలసీమలో కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు, గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని అంచనా. మే 26వ తేదీన కోస్తాంధ్రలో గంటకు 50–60 కిలోమీటర్ల వేగంతో, ఒక్కోసారి 70 కిలోమీటర్ల వేగం వరకు గాలులతో కూడిన వడగళ్ల వానలు (థండర్‌స్క్వాల్స్) సంభవించే అవకాశం ఉందని ఐఎండీ జాతీయ బులెటిన్‌లో వెల్లడించింది.

త్వరలో నైరుతి రుతుపవనాల రాక

నైరుతి రుతుపవనాలు రానున్న రెండు, మూడు రోజుల్లో కేరళ తీరాన్ని తాకేందుకు పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని, ఆ తర్వాత దేశంలోని దక్షిణ ప్రాంతాల్లోకి ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ అల్పపీడనాలు, రుతుపవనాల కదలికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు

# ఉగ్రవాదులు పాక్‌లో ఎక్కడున్నా వేటాడుతాం

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతానికైతే భారత్ -పాక్ మధ్య కాల్పుల విరమణ కొనసాగుతోంది. సైనిక చర్యలు ఆగిపోయాయి" అని ఆయన పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన జాబితాలో ప్రస్తావించిన ఉగ్రవాద స్థావరాలపైనే భారతదళాలు దాడి చేసిందన్నారు. "ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి క్రమం తప్పకుండా ఉగ్రవాద స్థావరాల జాబితాను విడుదల చేస్తుంటుంది. అందులో ప్రధాన ఉగ్రవాదులు, వారి నివాస స్థలాలు, ఎక్కడి నుంచి పనిచేస్తున్నారనే వివరాలను పొందుపరుస్తారు. మే 7న మేం వాటిపైనే దాడి చేశాం" అని జైశంకర్ వివరించారు.

**'మతపరమైన విభేదాలను సృష్టించేందుకు కుట్ర పన్నారు'**

"ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంపై పాశవిక ఉగ్రదాడి జరిగింది. 26 మంది పర్యాటకులను వారి కుటుంబ సభ్యుల ఎదుటే హత్య చేశారు. మత వివరాలను అడిగి మరీ ఆ టూరిస్టులను చంపారు. కశ్మీర్ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారమైన పర్యాటక రంగాన్ని దెబ్బతీసేందుకే ఇలా చేశారు. భారత్‌లో మతపరమైన విభేదాలను సృష్టించాలని పాక్ ఉగ్రవాదులు కుట్ర పన్నారు" అని జైశంకర్ తెలిపారు. "పాక్ ఆర్మీ చీఫ్ తీవ్రమైన మతతత్వంతో ముందుకు సాగుతున్నారు. పహల్గాం ఉగ్రవాద దాడికి పాకిస్థాన్? ఉగ్రవాద సంస్థ లష్కరే తయిబాకు చెందిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) బాధ్యత వహించింది. ఈ ఉగ్రదాడికి పాల్పడిన వారిని భారత్ గుర్తించింది. వారికి లష్కరే తయిబాతో సంబంధాలు ఉన్నాయి" అని ఆయన వెల్లడించారు. "2023, 2024 సంవత్సరాల్లో ఉగ్రవాద సంస్థ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) గురించి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి చెందిన 1267 ఆంక్షల కమిటీకి భారత్ తెలియజేసింది" అని జైశంకర్ గుర్తు చేశారు.



**'పాక్ దిగి రావడం వల్లే కాల్పుల విరమణ'**

భారత్ - పాక్ కాల్పుల విరమణకు తానే మధ్యవర్తిత్వం వహించానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసుకుంటున్న ప్రచారంపైనా జైశంకర్ స్పందించారు. ఈ అంశంపై భారత్‌ను అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్, విదేశాంగ మంత్రి రూబియో సంప్రదించగా– నేరుగా పాకిస్థాన్ తమతో మాట్లాడాలని తేల్చి చెప్పామని ఆయన వెల్లడించారు. ఆ తర్వాత భారత్, పాక్‌ల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ)ల స్థాయిలో చర్చలు జరిపి, కాల్పుల విరమణను అమల్లోకి తెచ్చాయన్నారు. సరిహద్దుల్లో కాల్పులు, సైనిక చర్యలను ఆపడానికి తాము సిద్ధమని పాకిస్థాన్? ప్రతిపాదించగా, అందుకు భారత్ అంగీకారం తెలిపిందని జైశంకర్ తెలిపారు. "అమెరికా విదేశాంగ శాఖ మంత్రి రూబియో నాకు ఫోన్ చేశారు. అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ భారత ప్రధానమంత్రి మోదీతో మాట్లాడారు. ఇదే విధంగా గల్ఫ్‌లోని కొన్ని దేశాలు కూడా భారత్‌ను సంప్రదించాయి. రెండు దేశాలు ఘర్షణలో ఉన్నప్పుడు, ప్రపంచ దేశాలు ఫోన్ చేసి తమ ఆందోళనను తెలియజేయడం సహజం. కానీ కాల్పుల విరమణ అనేది భారతదేశం, పాకిస్థాన్? మధ్య నేరుగా జరిగిన ఒప్పందం" అని ఆయన స్పష్టం చేశారు. "మే 10న ఉదయం భారత్‌పై పాక్ దాడి చేసింది. మేం వెంటనే పాకిస్థాన్‌లోని ఎనిమిది వైమానిక స్థావరాలను ధ్వంసం చేశాం. వాటి రన్‌వేలను కూడా ఉనాతులకు చేశాం. కమాండ్ సెంటర్లను కూలగొట్టాం. ఇందువల్లే పాకిస్థాన్? ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రతిపాదనతో మా వద్దకు వచ్చింది" అని ఆయన వివరించారు.

# అమరావతిపై విషం చిమ్ముతున్నారు.. జగన్‌పై మంత్రి పయ్యావుల ఫైర్

మొదటి పేజీ తరువాయి

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ అభివృద్ధిని అడ్డుకోవడానికి ఆయన ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జగన్ తన అస్తిత్వం కాపాడుకోవడానికి ఉన్నవి, లేనివి చెబుతున్నారని ధ్వజమెత్తారు. ఆయన మాటలు వింటుంటే ఏపీకి పరిశ్రమలు రాకూడదన్నట్లుగా ఉందని మండిపడ్డారు. జగన్ మీడియా సమావేశం పెడుతున్నారంటే నాలుగు సలహాలు ఇస్తారని తాము అనుకున్నామని చెప్పారు. ఇవాళ(గురువారం) అనంతపురం జిల్లాలో మంత్రి పయ్యావుల కేశవ్ పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడారు. లిక్కర్ పాలసీ అక్రమమని ఆయన అంటున్నారని%? ఇవాళ ఉన్నది మీ నాన్న హయాంలో ఉన్నది ఒక్కటే పాలసీ అని.. అప్పుడు స్కాం కనిపించలేదా అని ప్రశ్నించారు మంత్రి పయ్యావుల కేశవ్. జగన్ పాలనలో గ్రామస్థాయి నుంచి తాడేపల్లి ప్యాలెస్ వరకు కప్పం కట్టారని ఆరోపించారు. ల్యాండ్, మైన్స్, సాండ్, వైన్ అన్ని స్కాములు జరిగింది జగన్ హయాంలోనేనని విమర్శలు చేశారు. రివర్స్ టెండరింగ్ పేరుతో పోలవరం ఖర్చు మూడింతలు అయిందని అన్నారు. జగన్‌కి ఎక్కడో భయం కలిగి ఈ మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. 3.5 లక్షల ఎకరాలకు ఏ ఆధారం లేకుండా ఫ్రీ హోల్డ్ చేశారని మంత్రి పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. విశాఖపట్నాన్ని నాశనం చేశారు, పరిశ్రమలను తరిమేశారని ఫైర్ అయ్యారు మంత్రి పయ్యావుల కేశవ్. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే రూ.2 లక్షల కోట్లు పెట్టుబడులు ఏపీకి వచ్చాయని అన్నారు. అనంతపురంలో రూ. 22 వేల కోట్లతో పరిశ్రమలు వచ్చిందని ప్రకటించారు. ఐదేళ్ల పాలనలో రూ.10లక్షల కోట్లకు పైగా అప్పు చేశారని ఆరోపించారు. రూ.3.5 లక్షల కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో 94 కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రానికి రాకుండా ఆపారని చెప్పుకొచ్చారు. జగన్ చేసిన అప్పులకు వడ్డీ కోసం తాము అప్పులు చేయాల్సి వస్తోందని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి రూపాయకు ఎకరా భూమిని పరిశ్రమలకు కట్టబెట్టారని ఇదొక పాలసీనా అని ప్రశ్నించారు.. మీ లాగా మూడు లక్షల ఎకరాలను తమ ప్రభుత్వం ఫ్రీహోల్డ్ చేయలేదని స్పష్టం చేశారు మంత్రి పయ్యావుల కేశవ్. రూ.9,600 కోట్లు పలు పరిశ్రమలకు బకాయిలు వెల్లించలేదని చెప్పారు. పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహకాలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ మీడియా ముందుకు వస్తే అక్రమాలు, దోపిడీలు, దౌర్జన్యాలు గుర్తుకు వస్తాయని సెటైర్లు గుప్పించారు. జగన్ హయాంలో లక్షకు పైగా పిల్లలు డ్రాపౌట్ అయ్యారని చెప్పుకొచ్చారు. వైసీపీ పాలన రాష్ట్రానికి హానికరమని మంత్రి పయ్యావుల కేశవ్ తీవ్ర విమర్శలు చేశారు.



**ఏపీని దోచుకునే పార్టీ జగన్‌దే.: మంత్రి గొట్టిపాటి రవికుమార్**

మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఐదేళ్ల అధికారం ఇస్తే రాష్ట్రాన్ని 20 ఏళ్ల వెనక్కు తీసుకెళ్లారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం సంపద సృష్టిస్తుందని అన్నారు. ఇవాళ(గురువారం) బాపట్ల జిల్లాలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడారు. ఎప్పుడు అధికారంలోకి వచ్చినా రాష్ట్రాన్ని దోచుకునే పార్టీ జగన్‌దేనని విమర్శించారు. సంక్షేమం, అభివృద్ధి టీడీపీకి రెండు కళ్లు అని ఉద్ఘాటించారు. దేశంలో నదుల అనుసంధానం చేసిన ముఖ్యమంత్రి ఎవరైనా ఉన్నారంటే అది చంద్రబాబు ఒక్కరేనని గుర్తుచేశారు. దేశంలో కోటి సభ్యత్వాలు ఉన్న ఘనత టీడీపీకే దక్కుతుందని తెలిపారు. రూ.33 వేల కోట్ల పెన్షన్లను తమ ప్రభుత్వంలో అందిస్తున్నామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

## హైదరాబాద్‌కు 2,000

## ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపు



హైదరాబాద్ నగర ప్రజలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. పర్యావరణ హితమైన ప్రజారవాణాను ప్రోత్సహించే దిశగా చేపట్టిన పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద నగరానికి 2,000 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించినట్లు కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. ఈ నిర్ణయంతో హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థ మరింత బలోపేతం కావడంతో పాటు, కాలుష్య నియంత్రణకు కూడా దోహదపడనుంది. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎలక్ట్రిక్ బస్సుల కేటాయింపుపై ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో తెలంగాణ, కర్నాటక, ఢిల్లీ, గుజరాత్ రాష్ట్రాలపై ప్రధానంగా దృష్టి సారించారు. పథకం ప్రస్తుత దశలో బెంగళూరుకు సుమారు 4,500, ఢిల్లీకి 2,800, అహ్మదాబాద్‌కు 1,000, సూరత్‌కు 600 బస్సులతో పాటు హైదరాబాద్‌కు 2,000 ఎలక్ట్రిక్ బస్సులను అందజేయనున్నట్లు మంత్రిత్వ శాఖ ఒక అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ సందర్భంగా మంత్రి కుమారస్వామి మాట్లాడుతూ, "ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ఇప్పుడు సుస్థిర పట్టణ రవాణా దిశగా దృఢమైన అడుగులు వేస్తోంది. బెంగళూరు నుంచి ఢిల్లీ వరకు, నగరాలు ప్రజారవాణాను మరింత పరిశుభ్రంగా, సమర్థవంతంగా మార్చేందుకు ఎలక్ట్రిక్ బస్సులను చురుకుగా స్వీకరిస్తున్నాయి." అని తెలిపారు. "మేము కేవలం ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించడమే కాకుండా, నూతన ఆవిష్కరణలు మరియు పర్యావరణ స్పృహతో భారతదేశ రవాణా వ్యవస్థ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నాం" అని ఆయన వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పీఎం ఈ-డ్రైవ్ పథకం విజయవంతం అవుతుందని కుమారస్వామి ధీమా వ్యక్తం చేశారు. పీఎం ఈ-డ్రైవ్ కార్యక్రమం ద్వారా ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2026 వరకు రెండేళ్ల కాలంలో రూ.10,900 కోట్ల మొత్తం ఆర్థిక వ్యయంతో 14,028 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పథకం ప్రపంచంలోనే అతిపెద్ద జాతీయ ప్రభుత్వాల్లో ఒకటిగా నిలుస్తుందని, సకాలంలో బస్సుల పంపిణీ, కార్యాచరణ సంసిద్ధత, మరియు ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య రాష్ట్రాలతో పూర్తిస్థాయి భాగస్వామ్యాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ఈ పథకం కింద డిమాండ్ ఇన్సెంటివ్‌ను పొందేందుకు ఈవీ కొనుగోలుదారులకు ఈ-వోచర్లను కూడా భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టింది. అంతేకాకుండా, పీఎం ఈ-డ్రైవ్ పథకంలో భాగంగా ఈ-అంబులెన్సులు, ఈ-ట్రక్కుల కోసం కూడా వేర్వేరుగా రూ.500 కోట్లు కేటాయించారు. రోగుల సౌకర్యవంతమైన రవాణా కోసం ఈ-అంబులెన్సుల వినియోగాన్ని ప్రోత్సహించడం ఈ పథకం యొక్క ఉద్దేశ్యం. అదేవిధంగా, వాయు కాలుష్యానికి ప్రధాన కారణమవుతున్న ట్రక్కుల స్థానంలో ఈ-ట్రక్కులను కూడా పథకంలో చేర్చారు.

## సీఎం హోదాలో నాంపల్లి కోర్టుకు రేవంత్ రెడ్డి

బీసీసీ చీఫ్‌గా ఉన్న టైంలో ఆయన చేసిన వ్యాఖ్యలు, నిబంధనల ఉల్లంఘనలపై అప్పట్లో నల్గొండ టూటౌన్, మెదక్ జిల్లాలోని కొడంగల్, బేగంబజార్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయి. విచారణలో భాగంగా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో రెండోసారి కోర్టుకు హాజరయ్యారు. సంబంధం లేని కేసుల్లో ఇరికించారని... మూడు కేసుల్లో వ్యక్తిగతంగా హాజరు కావాలని గతంలో కోర్టు ఆదేశించడంతో ఫిబ్రవరి 20వ సీఎం హోదాలో మొదటిసారి కోర్టుకు హాజరయ్యారు. న్యాయస్థానం అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ తాను ఎలాంటి నేరం చేయలేదని, సంబంధం లేని కేసుల్లో ఇరికించారని రేవంత్ చెప్పారు. ఈ మేరకు న్యాయస్థానం సీఎం రేవంత్‌రెడ్డి వాంగ్మూలం నమోదు చేసింది. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా కేసులు నమోదు చేసిందని పీసీసీ లీగల్‌సెల్ వైస్ చైర్మన్ తిరుపతివర్మ పేర్కొన్నారు.

## గ్రామాలు అభివృద్ధిలో

## ఆదర్శంగా నిలవాలి

అమరావతి : రావివలస ప్రజలు తమ ఆందోళనలు, ఆశలను వ్యక్తపరచడానికి ముందుకు వచ్చిన ఉత్సాహం తనను చాలా కదిలించిందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. తన క్యాంప్ ఆఫీస్ నుంచి ప్రత్యక్ష వీడియో కాన్ఫరెన్స్ ద్వారా, వారి ఆందోళనలు, సూచనలు, అభివృద్ధి అవసరాలను వినడానికి వారితో వ్యక్తిగతంగా సంభాషించే అవకాశం తనకు లభించిందని పవన్ కల్యాణ్ తెలిపారు. అమరావతి: గ్రామాలు అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు. మాలమంది, భాగస్వామ్య గ్రామీణాభివృద్ధిలో ఒక నూతన యుగమని తెలిపారు. సాంకేతిక ప్రపంచాన్ని ఒక ప్రపంచ గ్రామంగా ఏకం చేసిందని, ఇక్కడ క్షణాల్లో మైళ్ల దూరం చేరుకోవచ్చని అన్నారు. గ్రామ అభివృద్ధిలో పౌరులను ప్రత్యక్షంగా పాల్గొనేలా చేయడం, వారి సమస్యలను ప్రత్యక్షంగా అర్థం చేసుకునేలా ఏపీ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మాలమంది అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిందని గుర్తుచేశారు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ఓ ట్వీట్ చేశారు. ఈ చొరవలో భాగంగా, ఈరోజు(మే22) తెల్లవారుజామున, శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గంలోని రావివలస గ్రామ నివాసితులను టెక్కలిలోని స్థానిక థియేటర్‌కు తీసుకువచ్చారని పవన్ కల్యాణ్ చెప్పారు. తన క్యాంప్ ఆఫీస్ నుంచి ప్రత్యక్ష వీడియో కాన్ఫరెన్స్ ద్వారా, వారి ఆందోళనలు, సూచనలు, అభివృద్ధి అవసరాలను వినడానికి వారితో వ్యక్తిగతంగా సంభాషించే అవకాశం తనకు లభించిందని అన్నారు. తక్షణమే పరిష్కరించగల సమస్యలను పౌరాణిక అధికారులతో సమన్వయంతో పరిష్కరించాలని చెప్పుకొచ్చారు. ఎక్కువ సమయం అవసరమయ్యే విషయాల కోసం, సమయపాలనలతో సంబంధిత విభాగాలను చేపట్టాలని ఆదేశించారు. రావివలస ప్రజలు తమ ఆందోళనలు, ఆశలను వ్యక్తపరచడానికి ముందుకు వచ్చిన ఉత్సాహం తనను చాలా కదిలించిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వారు కేవలం మాట్లాడలేదు, వారి గ్రామ భవిష్యత్తును తమ చేతుల్లోకి తీసుకున్నారు, ఇది నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రతిబింబిస్తుందని చెప్పుకొచ్చారు. ఈ చొరవ కేవలం ఒక కార్యక్రమం కాదని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఊహించిన గ్రామీణ భారత్ మహోత్సవ్ 2025 దార్శనికతను సాకారం చేయడంలో ఇది ఒక ముందడుగు అని ఉద్ఘాటించారు. మంత్రి అచ్చెన్నాయుడు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు రావివలస గ్రామ ప్రజలకు మద్దతుగా నిలిచారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# సంపాదకీయం

## ఇందిర, మోదీ... ఇద్దరూ ఇద్దరే

భారతదేశం పాకిస్థాన్ మధ్య 1971 యుద్ధం, బంగ్లాదేశ్ ఆవిర్భావంబీ 2025లో ఆపరేషన్ సిందూర్‌బీ ఈ రెండు సందర్భాల్లోనూ భారత్%-%అమెరికా మధ్య నెలకొన్న దౌత్య సంబంధాలు ప్రపంచ రాజకీయాల మీద ప్రభావం చూపాయి. భారత ప్రధానమంత్రులు ఇందిరాగాంధీ నుంచి నరేంద్ర మోదీ దాకా, అమెరికా అధ్యక్షులు రిచర్డ్ నిక్సన్ నుంచి డొనాల్డ్ ట్రంప్ దాకా ఈ రెండు సందర్భాల్లోనూ నేతృత్వ శైలుల మధ్య తేడాలు, దౌత్య నైపుణ్యాలు, రాజకీయ వ్యూహాలు, పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలను అరికట్టే దిశగా భారతదేశం ఎదుర్కొన్న సవాళ్ళను విశ్లేషించడం ఒక సవాలే. 1971లో అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ అనుసరించిన పాకిస్థాన్ పక్షపాత దౌత్యతంత్రంబీ 2025లో ట్రంప్ అహంభావ, అనిర్ణయాత్మక రాజకీయ వైరుధ్యం... ఇవి రాజకీయ దౌత్య అధ్యయనాల్లో చర్చకు రావాల్సిన అంశాలు. నిక్సన్‌కు యాహ్యాఖాన్ మీద ప్రేమ లేకపోయినా, అమెరికా ప్రయోజనాల కోణంలో పాకిస్థాన్‌ను వెనకేసుకొచ్చి సహాయం అందించాడు. ట్రంప్ ప్రతిస్పందన వ్యక్తిగత ఆడంబరం. భారతదేశం%-%పాకిస్థాన్ ఉద్రిక్తతల మధ్య కాల్పుల విరమణకు తానే కారకుడన్నట్లు, అదేపనిగా ఆర్భాటంగా చెప్పుకున్నాడు. డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలేని నేత. అణ్వాయుధ ఉద్వేగాలకు ఆస్కారమున్న భారత ఉపఖండం విషయంలో, అగ్రరాజ్యాధినేతగా ప్రదర్శించాల్సిన గంభీరత, వ్యూహాత్మకత చతురత ట్రంప్ మాటలోను, నడతలోను ఇసుమంతైనా లేదు. ఇది దౌత్యనీతికి విరుద్ధం. ఇందిరా గాంధీ నేతృత్వంలోని వ్యూహాత్మక, యుద్ధ%-%దౌత్యనీతి నిర్ణయాలు భారతదేశాన్ని శక్తివంతమైన దేశంగా నిలిపాయి. నరేంద్రమోదీ నేతృత్వంలో జాగరూకతతో, ఒక్కొక్క అడుగు ముందుకు వేయాల్సి వచ్చింది. అమెరికా విదేశీ విధానంలో సంభవించిన మార్పులు, అంతర్జాతీయ స్థితిగతులే దీనికి కారణం. నిక్సన్‌ను ధీరోదాత్తంగా ఎదుర్కొన్న ఇందిరా గాంధీ భారత్‌కు చరిత్రాత్మక విజయాన్ని అలవోకగా సమకూర్చారు. వర్తమాన వాతావరణానికి అనుగుణంగా, ట్రంప్ అనిశ్చితి నేపథ్యంలో, నరేంద్ర మోదీ అత్యంత జాగ్రత్తగా, స్వల్ప స్పందనతో సమయానుకూలంగా వ్యవహరించాల్సి వచ్చింది. అంతిమంగా, ఇందిర, మోదీలు ఇరువురూ, వారివారి పరిస్థితులకు అనుగుణంగా విజయాన్నే సాధించారు. నిక్సన్ వ్యూహాత్మక అమెరికాకు ప్రతినిధి. ట్రంప్ చరిత్రతో సంబంధం లేకుండా, ప్రాదేశిక సమస్యల సంక్లిష్టతను పట్టించుకోకుండా, అవగాహనా రాహిత్యంతో వ్యవహరించారు. నిక్సన్ వైఖరి చర్చనీయాంశమే అయినప్పటికీ, అది సంస్థాగత పాలనాచట్రానికి అనుగుణంగా ఉన్నది. ట్రంప్ వ్యాఖ్యలు అమెరికా స్థాయికి ఏమాత్రం తగనివి. అవి విదేశాంగ విధానాన్ని వ్యక్తిగత ఆకాంక్షలుగా మలిచే ఆందోళనకర దృక్పథాన్ని ప్రతిబింబించాయి. భారత్, అమెరికాలు కాలక్రమంలో పరిస్థితులకు అనుగుణంగా మార్పునకు గురయ్యాయి. భారత్ ఇనుమడించిన ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకుపోతుంటే, అమెరికా దౌత్యం గణాంకాల చట్రంలో ఇరుక్కుపోయింది. లాభనష్టాలు బేరీజు వేసుకుంటూ, అసందర్భ ప్రదర్శనల దిశగా జారిపోయింది. 1971 యుద్ధం ద్వారా ఉపఖండంలో తన ప్రాదేశిక ఆధిపత్యాన్ని దృఢపరచుకున్నది భారత్. 2025 పాక్%-%భారత్ సంఘర్షణ 'ప్రదర్శనాత్మక దౌత్యానికి' ఉన్న పరిమితులను బహిర్గతం చేసింది. నిక్సన్%-%ట్రంప్, ఇందిర%-%మోదీల మధ్య తారతమ్యాన్ని, 1971%-%2025 మధ్యన చోటుచేసుకున్న విభిన్న భౌగోళిక%-%రాజకీయ ఘట్టాలను విశ్లేషణ చేయడం అవసరం. నిక్సన్, ట్రంప్‌లు భారత్%-%పాకిస్థాన్ సంక్షోభాలకు ఎలా స్పందించారు? ఇందిర, మోదీల ప్రతిస్పందనలు ఎలా భిన్నంగా అభివ్యక్తమయ్యాయి? అనేవి పరిశోధనకు అనువైన అంశాలు. వ్యూహాత్మక దౌత్యం, ప్రదర్శనాత్మక దౌత్యం మధ్య తేడాను విశ్లేషించడం, దేశవాళీ స్థాయిలో ఇందిర, మోదీల నాయకత్వ బలాన్ని, అంతర్జాతీయ వ్యవహారాలకు ఎలా అన్వయించారో గమనించడం, భారత వ్యూహాత్మక ప్రయోజనాల కోణంలో అమెరికా నాయకత్వాన్ని విశ్లేషణతో చూపడం లాంటి అంశాలన్నీ పరిశోధనకు తగినవే. బంగ్లాదేశ్ ఆవిర్భావాన్ని మిగతా ప్రపంచం ఆశ్చర్యంతో వీక్షిస్తుండగా, ప్రధాని ఇందిరాగాంధీ అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్‌కు ఆవేదనతో, ఆవేశంతో రాసిన ఉత్తరాన్ని 1971 డిసెంబర్ 17న న్యూయార్క్ టైమ్స్ 'మిసెస్ గాంధీ రైట్స్ టు ప్రెసిడెంట్: యూఎస్ కుడ్ హావ్ అవర్టెడ్ వార్' శీర్షికతో ప్రచురించింది. దశాబ్దాలపాటు గుర్తుంచుకునే అపూర్వమైన 'దౌత్యపూరిత సంభాషణగా' భావించాల్సిన ఆ ఉత్తరంలో ఇందిరాగాంధీ%-% "మేము తప్పెక్కడ చేశామో మీరు చెప్పగలరా నిక్సన్?" అని అమెరికాను ధీటుగా, సూటిగా ప్రశ్నించారు. పక్షపాతంపై వ్యంగ్య స్పందనగా కాకుండా, సహేతుకమైన విమర్శగా నిలిచిందది. ఇందిరా గాంధీ ఆవేశానికి చాలా కారణాలు ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు నిక్సన్ పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరించడం, తూర్పు పాకిస్థాన్‌లో రాజకీయ పరిష్కారాన్ని సాధించడానికి ఇందిరాగాంధీ హెన్రీ కిసింజర్‌కు ఇచ్చిన సూచనలు విఫలం కావడం, అమెరికా అణ్వస్త్ర నౌక బంగాళాఖాతంలోకి ప్రవేశించడం, అమెరికా నుంచి వెలువడిన వ్యాఖ్యలన్నీ భారతదేశంపై అది కక్షపూరితంగా ఉన్నదన్న భావనను కలిగించడం... ఇవన్నీ కలిసి ఇందిరాగాంధీ నిక్సన్‌కు ఉత్తరం రాయడానికి దారితీశాయి. ఈ లేఖను ఆమె నేరుగా నిక్సన్‌కు పంపారు. అంతర్జాతీయంగా ఒంటరిదైనా, ఇందిరాగాంధీ నాయకత్వంలో భారతదేశం 1971 యుద్ధంలో గెలిచింది. సోవియెట్ యూనియన్‌తో స్నేహ ఒప్పందం, స్వదేశీ ఆయుధ బలం ఆధారంగా బంగ్లాదేశ్‌ను స్థాపించగలిగింది. గెలుపు తరువాత కూడా ఇందిరాగాంధీ ఓర్పుతో, సంయమనంతో, రాజనీతిజ్ఞతతో వ్యవహరించారు. "మాకు ఎటువంటి పాకిస్థాన్ భూభాగం అవసరం లేదు.తూర్పు పాకిస్థాన్‌గా ఉండి, ఇప్పుడు బంగ్లాదేశ్‌గా మారిన భూభాగం పట్లా, పశ్చిమ పాకిస్థాన్ భూభాగం పట్లా మాకు ఎలాంటి ఆకాంక్షా లేదు" అని ఆమె స్పష్టం చేశారు.

# గూఢచర్యం జాడలివిగో!



గూఢచర్యానికి నిర్దిష్టమైన రూపురేఖలుండవు. దాన్ని సకాలంలో గుర్తించటం, కట్టడి చేయటం ఆషామాషీ కాదు. మన వేషభాషలతోనేవుంటూ, నిత్యం మనతో సన్నిహితంగా మెలగుతూ ప్రాణ ప్రదమైన మన రహస్యాలను బయటికి చేరేసేవారిని ఆనవాలు కట్టడం అంత సులభం కూడా కాదు. పహల్‌గామ్‌లో గత నెల 22న అమాయక పౌరులు 26 మందిని ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నాక మన త్రివిధ దళాలు పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో దాడులు నిర్వ హించి దాదాపు వందమందిని మట్టుబెట్టాయి. సింధూ నదీజలాల ఒప్పందంనుంచి వెనక్కి రాదల్చుకున్నట్టు ప్రకటించటంతోసహా అనేక అంశాల్లో పాకిస్తాన్‌కు ఇన్ని దశాబ్దాలుగా అందుతున్న ప్రయోజనాలను మన దేశం నిలుపుచేసింది. దానికి అనుబంధంగా దేశంలో అధికార, విపక్షాల మధ్య వాగ్యుద్ధాలు సాగటం, పహల్‌గామ్‌లో భద్రతాలోపాలపై ప్రశ్నించినవారినీ, జవాబుదారీ తనాన్ని కోరినవారినీ ఉగ్రవాద సమర్థకులుగా ముద్రేయటం మొదలైంది. ఇది అవాంఛనీయమైన పరిణామం. ఈ నేపథ్యంలో నిఘానేత్రాల కళ్లుగప్పి కీలకమైన సమాచారాన్ని పాకిస్తాన్‌కు చేరేస్తున్న 11 మందిని గుర్తించి అరెస్టు చేయటం కీలక మలుపు. అరెస్టయినవారిలో చాలామంది మధ్యతరగతి యువత. వారిలో జ్యోతి మల్హోత్రా అనే యువతి పాకిస్తాన్ గూఢచారి సంస్థలకు కీలకమైన సమా చారం అందించిందన్నది పోలీసుల అభియోగం. సామాజిక మాధ్యమాల సందడి పెరిగాక ఒక కొత్త తరం బయల్దేరింది. విచక్షణా జ్ఞానం లోపించటం, లోతైన సమాచారం లేకుండానే దేనిపైన అయినా అభిప్రాయాలు ఏర్పర్చుకోవటం, ఆధారాలున్నాయా లేదా అనేదాంతో నిమిత్తం లేకుండా సమాచారాన్ని వ్యాప్తిచేయటం, సామాజిక మాధ్యమాలపై మోజున్న యువతరానికి అలవాటుగా మారింది. సెల్‌ఫోన్‌తో దేన్నయినా చిత్రించటం, వెనకా ముందూ ఆలోచించకుండా అందరికీ చేరేయటం రివాజైంది. మనం కూడా ఏదో ఒకటి చేయాలన్న కుతూహలంతో మొదలై, అందరికన్నా ఎక్కువమంది వీక్షకుల్ని ఆకట్టుకోవటం లక్ష్యంగా మారటం, ప్రముఖ వ్యక్తిగా గుర్తింపు పొందటం, ప్రశంసలు, వాటి వెంబడే ఆదాయం మొదలవుతుంది. ఇక ఆ వ్యామోహం నుంచి వెనక్కిరావటం వాళ్లవల్ల కాదు. తాము చేసే పని ఏ మంచికి హాని చేస్తుందో, ఏ చెడును ప్రోత్సహిస్తుందో గ్రహించేంత సామర్థ్యం లేకపోవటం సామాజిక మాధ్యమాల్లో పాపులర్ అయిన అత్యధిక యువతలో కనబడే ప్రాథమిక లక్షణం. ఇలాంటివారిని ఆకట్టుకుని, వీరితో సంబంధ బాంధవ్యాలు నెరపి దగ్గరకావటం పొరుగు దేశ గూఢచార సంస్థలకు సులభం. జ్యోతి మల్హోత్రా విషయంలో జరిగింది అదే. ఆమె తగిన పత్రాలను సమర్పించి ప్రభుత్వానికి తెలిసే విధంగానే పాకిస్తాన్ వెళ్లింది. అక్కడ వేర్వేరు వ్యక్తుల్ని కలిసింది. పాకిస్తాన్ జాతీయ దినోత్సవంలో పాల్గొన్నది. అక్కడున్నవారిని పరిచయం చేసింది. వారితో మాట్లాడించింది. విదేశాలకు పోవటం, అక్కడి ప్రాంతాలను సందర్శించటం, వారితో సంభాషించటం వగైరాలు సహజంగానే సాధారణ వీక్షకులకు ఎంతో ఆసక్తి అనిపిస్తాయి. జ్యోతి నిర్వహించే యూట్యూబ్ చానెల్‌కు దాదాపు 4 లక్షలమంది చందాదార్లుండటం, ఫేస్‌బుక్‌లో 3 లక్షలమందిపైగా ఆమె ఎప్పటికప్పుడు పెట్టే వీడియోలను వీక్షించటం, ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపు లక్షన్నరమంది చూడటం ఇందువల్లే. తమ అరకొర పరిజ్ఞానంతో గంటల తరబడి దేనిపైన అయినా అనర్గళంగా మాట్లాడటం నచ్చటంవల్లే ఇన్నేసి లక్షలమంది వారిని అనుసరిస్తుంటారు. శత్రు దేశాల మధ్య యుద్ధాలు సరిహద్దుల్లోనే జరగవు. అవి కేవలం సైనికుల మధ్యే సాగవు. అనేక రూపాల్లో నిరంతరం కొనసాగుతుంటాయి. కనీసం జ్యోతి ప్రభుత్వానికి తెలిసేవిధంగా పాకిస్తాన్ వెళ్లింది. కానీ చడీచప్పుడూ లేకుండానే శత్రుదేశానికి అత్యంత కీలకమైన సమాచారాన్ని చేరేసేవారుంటారు. పాకిస్తాన్ హైకమిషన్‌లో ఇటీవల వరకూ పనిచేసి బహిష్కరణకు గురైన డానిష్ అనే ఉద్యోగి అడిగిన సమాచారమంతా ఆమె అందించిందని నిఘా వర్గాలంటున్నాయి. ఆ పని చేయటం పర్యవసానంగా తోటి పౌరులే ప్రమాదాల్లో చిక్కుకుంటారని, అది దేశద్రోహమని వారికి అనిపించదు. డబ్బుకు ఆశపడటం ఒక్కటే ఇలాంటి కార్యకలాపాలకు కారణం అనుకోవటానికి లేదు. వేరే దేశానికి చెందినవారు వీడియోలను చూడటం, పొగడ్తలు గుప్పించటం, తమ ప్రాంతాలకొచ్చి అక్కడి విశేషాలను కూడా చూపాలని అడగటం వగైరాలు వారిని ఆకర్షిస్తాయి. తమ ఘనత అంతర్జాతీయ స్థాయికి చేరుకుందన్న భ్రమ వారిని నిలకడగా ఆలోచించనీయదు. గూఢచర్యం కేవలం అవతలి దేశాన్ని నష్టపరచటానికో, చికాకుపరచటానికో పరిమితం కాదు. వారి ఆయుధాగారాల్లో వచ్చి చేరుతున్న రక్షణ సామగ్రి సామర్థ్యం ఏమిటో, ఎక్కడెక్కడ వారి సైనిక స్థావరాలు పనిచేస్తున్నాయో తెలుసుకోవటంతోపాటు పారిశ్రామిక, ఆర్థిక, పరిశోధనారంగాల్లో ఆ దేశం ఏం చేస్తున్నదో సమాచారాన్ని సేకరిస్తుండటం గూఢచారుల పని. పహల్‌గామ్‌లో ఉగ్రదాడి తర్వాత ఎక్కడ మన వైఫల్యం వున్నదో, అందుకు కారణమేమిటో తెలుసుకునే పనిలో ప్రభుత్వం తలమునకలై వుండగా దేశభక్తి పేరిట కొందరు మత విద్వేషాలను రెచ్చగొట్ట జూశారు. ఇప్పుడు పట్టుబడినవారి నేపథ్యం గమనిస్తే ఫలానా మతంవారే దేశద్రోహానికి పాల్పడతారన్నది ఎంత బూటకమో తెలుస్తుంది. శత్రువు కీలకమైన సమాచారాన్ని ఒడుపుగా తస్కరించగలుగుతున్నాడంటే నిస్సందేహంగా అది మన వైఫల్యం. దాన్ని కప్పిపుచ్చి అసత్యాలు ప్రచారం చేయటానికి బదులు, లోపాలను సరిదిద్దుకుని పటిష్టమైన వ్యవస్థలు రూపొందించటం వర్తమాన అవసరం.

# గెలిచింది సైన్యమే..



పాక్‌తో జరిగిన యుద్ధంలో ఎవరు, ఎంత మేరకు నష్టపోయారనే చర్చ జరుగుతున్న వేళ దాయాదిని భారత్ తీవ్రంగా నష్టపరిచినట్టు స్పష్టమైంది. భారత దళాలు సాంకేతికతలో, వైమానిక శక్తిలో ఆధిక్యతను చాటాయి. భవిష్యత్తులో తమపై ఉగ్రదాడి జరిగితే భారీ మూల్యం చెల్లించేలా చేస్తామన్న ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పాన్ని మన దళాలు నిరూపించాయి. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరులో భారత్‌కు అంతర్జాతీయంగా ఎందుకు మద్దతు లభించలేదు? పహల్గాం ఉగ్రదాడి తర్వాత వచ్చిన సింపతీ అతి తక్కువ సమయంలోనే ఎందుకు సన్నగిల్లింది? పాక్‌కు చైనా, టర్కీ, అజర్‌బైజాన్‌లు తోడుగా నిలిచినట్టు.. కీలకమైన ఆ నాలుగు రోజుల పాటు ఏ దేశమూ మనకు ఎందుకు మద్దతుగా నిలవలేదు? అణ్వాయుధాలతో పాక్ బెదిరింపులకు దిగినప్పటికీ ఐఎంఎఫ్ మరోసారి బిలియన్ డాలర్ల రుణం ఎందుకు ప్రకటించింది? ఇలాంటి ప్రశ్నలెన్నో ఇప్పుడు దేశవ్యాప్తంగా ఉత్పన్నమవుతున్నాయి. మే 13న కరణ్‌థాపర్‌తో జరిగిన ఇంటర్వ్యూలో మాజీ మంత్రి, సీనియర్ జర్నలిస్టు అరుణ్ శౌరి చెప్పినట్టుగా.. అంతర్జాతీయంగా మన విశ్వసనీయతను భారతీయ మీడియా తీవ్రంగా దెబ్బతీసింది. తత్ఫలితంగా అంతర్జాతీయంగా జరిగిన అభిప్రాయ యుద్ధం (పర్సెప్షన్ వార్)లో మనం ఓడిపోయాం. అరుణ్ శౌరి అభిప్రాయపడినట్టు.. ఓ వర్గం మీడియా (ప్రత్యేకించి న్యూస్ చానళ్లు) 'ఒక దేశానికి వ్యతిరేకంగా నేరం' అన్నట్టుగా రిపోర్టింగ్ చేశాయి. ఉగ్రవాదులు, పాక్, ముస్లింలను ఒకే గాటన కట్టి నాలుగైదు చానళ్లు వాస్తవాన్ని వక్రీకరించి కథనాలను వండివార్చాయి. తద్వారా దేశంలోని రెండు అతిపెద్ద సమాజాల మధ్య సంఘర్షణను మరింతగా పెంచాయి. ఆయా చానళ్ల యాంకర్లు ఉపయోగించిన భాష కూడా అసభ్యకరంగా ఉంది. ఓ చానల్‌లో ఒక వీడియో క్లిప్ ప్రసారమైంది. అందులో తనను తాను రిటైర్డ్ మేజర్‌గా చెప్పుకొన్న ఓ వ్యక్తి.. మన దేశానికి వ్యూహాత్మకంగా ఎంతో కీలకమైన ఓ ఇస్లామిక్ దేశ విదేశాంగ మంత్రిని తీవ్ర పదజాలంతో దూషించారు. ఆయన వాడిన అభ్యంతరకరమైన మాటను సదరు టీవీ స్క్రీన్‌పై చాలాసేపు చూపించారు. ఇది ముమ్మాటికీ విదేశాలతో శత్రుత్వాన్ని సృష్టించడమే. తీవ్ర నేరం కూడా. కానీ, ఆ యాంకర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీని పర్యవసానంగా రెండుమూడు రోజుల తర్వాత సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈ లాంటి దేశాలు పాక్‌కు ఐఎంఎఫ్ రుణం మంజూరుకు మద్దతిచ్చాయి. యుద్ధ సమయంలో మీడియా అన్ని పరిమితులను దాటివేసింది. యుద్ధ రిపోర్టింగ్ అబద్ధాలు, యుద్ధోన్మాదంతో నిండిపోయింది. టీవీ చానళ్ల స్టూడియోలు తప్పుడు కథనాల వార్ రూమ్‌లుగా మారిపోయాయి. కల్పిత కథనాలను మీడియా ప్రసారం చేశాయి. గంటగంటకూ తప్పుడు కథనాలను ప్రసారం చేసి గందరగోళం, భయాందోళనలు సృష్టించాయి. వాస్తవాలను ప్రసారం చేసి దేశంలో నెలకొన్న పరిస్థితులను చల్లార్చకుండా.. శాంతి ఒప్పందం జరిగిన వారం తర్వాత కూడా యుద్ధోన్మాదాన్ని కొనసాగించాయి. భారత్‌కు దౌత్యపరంగా ఇబ్బందులు ఎదురవడానికి, అంతర్జాతీయంగా ఒంటరిగా మారడానికి విదేశాంగ శాఖ మంత్రిగా జైశంకర్ విఫలమవడమే ప్రధాన కారణం. అతని దూకుడు, మన కంటే ఉన్నత స్థాయిలోని దేశాలతో మాట్లాడే విధానం, విశ్వగురు ఆశయాలు అంతర్జాతీయ అంశాల్లో మన స్థాయికి సరిపోలవని గుర్తించేందుకు నిరాకరించడం, ప్రజాస్వామ్యాన్ని గుర్తించడంలో అసమర్థత, అవకాశవాదం కలగలిసి.. ప్రపంచ దేశాలు మన రాజకీయాలను, మన విధానాలను అనుమానించడానికి, మన నుంచి దూరం కావడానికి దారితీశాయి. మన పొరుగు దేశాల్లోనూ మనకు మిత్రులు లేరని పాకిస్థాన్ యుద్ధం స్పష్టం చేసింది. ప్రపంచం ఇలాంటి ఘటనలను గమనించి భారతదేశం నుంచి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నది. ఈ నేపథ్యంలోనే ఉగ్రవాదం అనే ప్రధాన కారణం వెనక్కి వెళ్లిపోయి.. హిందూ భారత్ వర్సెస్ ఇస్లామిక్ పాకిస్థాన్ అనే నెరేటివ్ తెరపైకి వచ్చింది. రాజకీయ, మీడియా వైఫల్యాల వల్ల యుద్ధభూమిలో మన సైనికులు సాధించిన విజయాలు వృథా అయ్యాయి. అవకాశవాదం, మానవ హక్కుల అణచివేత, విద్వేషం, మత జాతీయవాదంలో కూరుకుపోయిన దేశం.. నైతికంగా ఉన్నత స్థానాన్ని, అంతర్జాతీయ మద్దతును ఆశించడం కుదరదు. దీని కోసం కాదు మన సైనికులు పోరాడింది. మన సైనికులు గెలిచారు, కానీ ఒక దేశంగా మనం వారిని తీవ్రంగా నిరాశపరిచాం.

# కాళేశ్వరంపై ఇంత కంటగింపా?



కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవధార. దేశంలో ఏ ప్రాజెక్టు తీసుకున్నా లోపాలు తలెత్తడం సహజం. వాటిని సరిదిద్దుతూ ముందుకువెళ్లాలి. తద్వారా సాగు, తాగునీటి ఫలాలు అందుతాయి. ప్రపంచంలో అనేక నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో ఇలాగే జరుగుతున్నది. ప్రాజెక్టులు ప్రారంభించిన పదేండ్లలోపు మరమ్మతులకు గురవడం సాధారణ విషయం. చిన్న సర్దుబాట్ల నుంచి గణనీయమైన మరమ్మతులు రావడం సహజమే. నేల కోత, నిర్మాణ, కాలక్రమేణా తలెత్తే సమస్యల కారణంగా ఈ మరమ్మతులు అవసరమవుతాయి. తెలంగాణకు ఎత్తిపోతల పథకాలు తప్ప మరో మార్గం లేదు. అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకులో ఒక పియర్ (పిల్లర్) కుంగిన విషయాన్ని నాటి ప్రభుత్వాన్ని రాజకీయంగా దెబ్బతీసేందుకు అప్పటి ప్రతిపక్షాలు వాడుకున్నాయి. ఏ ప్రభుత్వమైనా ప్రజల ప్రయోజనాల కోసమే పనిచేయాలి. కానీ, కొత్తగా ఏర్పడ్డ రాష్ట్ర ప్రభుత్వం ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకుండా తాత్సారం చేస్తూ ప్రజల ప్రయోజనాలతో ఆటలాడుతున్నది. మేడిగడ్డ పిల్లర్ కుంగింది. కానీ సుందిళ్ల, అన్నారం, బాగానే ఉన్నాయి కదా, వాటిని నింపి రైతులకు నీళ్లు ఎందుకు ఇవ్వడం లేదని సాగునీటిరంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. మేడిగడ్డ లోపాన్ని కారణంగా చూపెట్టి నీటిని ఎత్తిపోయకుండా 18 నెలలుగా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో ఈ ఏడాది ఎండాకాలంలో తాగు, సాగునీటి కష్టాలు తలెత్తాయి. చేతికొచ్చిన పంటలు ఎండిపోయాయి. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పిల్లర్ కుంగుబాటుకు సరైన కారణాలు తెలుసుకోకుండానే మధ్యంతర నివేదిక ఇచ్చిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) పూర్తి నివేదిక ఇవ్వడానికి తీవ్ర కాలయాపన చేసింది. ఇటీవల ఎన్డీఎస్ఏ నివేదికలోనూ ఎక్కడా బ్యారేజీలు పనికిరావని లేదు. కానీ, ప్రభుత్వమే అలా ప్రచారం చేస్తున్నదనే ఆరోపణలు వినవస్తున్నాయి. కాళేశ్వరంపై ఎన్నికల వేళ ఒక వర్గం చేసిన విష ప్రచారాన్నే ఇప్పటికీ కొనసాగిస్తున్నది. కాళేశ్వరం విషయంలో ఒక రకంగా, ఇతర ప్రాజెక్టుల విషయంలో మరో రకంగా వ్యవహరిస్తూ జాతీయ పార్టీలు ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నాయనే విమర్శ ఉన్నది. ఎందుకంటే ఎస్ఎల్‌బీసీ ప్రమాదం జరిగినప్పుడు, సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని చూస్తే ఇది స్పష్టమవుతుంది. మేడిగడ్డ నిర్మాణం లోపభూయిష్టమని, డిజైన్లు సరిగ్గా లేవని, అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ ఎంక్వైరీకి ఆదేశించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై జ్యుడీషియల్ ఎంక్వైరీ కూడా కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో ఎస్‌ఎల్‌బీసీ, సుంకిశాల రిటైనింగ్ వాల్ ప్రమాదాలపై ఎందుకు ఎంక్వైరీకి ఆదేశించడం లేదని పౌర సమాజం ప్రశ్నిస్తున్నది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయాలను కమిషన్ కోరినప్పుడు.. ఎన్డీఎస్ఏ నివేదిక త్వరగా వచ్చేలా, ఈ లోగా దెబ్బతిన్న పియర్‌కు మరమ్మతులు చేసి, రైతులకు సాగు నీరు ఇవ్వాలని తెలంగాణ వికాస సమితితోపాటు మరికొంత మంది జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు విన్నవించారు. ఆ అభ్యర్థనలను పరిశీలించినట్టే కనిపించడం లేదు. 2020-2023 వరకు ప్రతి యాసంగి సీజన్‌లో లోయర్ మానేరు డ్యాం దిగువన ఉన్న శ్రీరాం సాగర్ ప్రాజెక్టు స్టేజీ-1, స్టేజీ- 2 ఆయకట్టు 10 లక్షలకు పైగా ఎకరాలకు సాగునీటి భరోసానిచ్చింది కాళేశ్వరం ప్రాజెక్టు. డిసెంబర్ నుంచి మార్చి నెలాఖరు వరకు కాకతీయ కాలువ నిండుకుండలా కనిపించడం రైతుల అనుభవంలో ఉన్నది. మేడిగడ్డ నుంచి అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి, మిడ్ మానేరు మీదుగా కాళేశ్వరం నీళ్లు లోయర్ మానేరును దాటుకొని వందలాది కిలోమీటర్లు పరుగులు పెట్టాయి. దాని ఫలితంగానే వరి ఉత్పత్తిలో గత రికార్డులను తెలంగాణ అధిగమించింది. కానీ, కాళేశ్వరంపై ఆరోపణలు చేస్తున్న రేవంత్ సర్కార్ ఆ ప్రాజెక్టుతో పని లేకుండానే ఎస్సారెస్పీ స్టేజీ- 1, స్టేజీ- 2 ఆయ కట్టుకు పూర్తిస్థాయిలో నీళ్లు ఇస్తామని చెప్పి పంటలు చేతికొచ్చే ముందు చేతు లెత్తేసింది. ప్రభుత్వమే ప్రజల పక్షాన చొరవ తీసుకొని సత్వరమే మరమ్మతులు పూర్తిచేసి రాబోయే సీజన్‌లోనైనా పంట పొలాలకు నీళ్లు ఇవ్వాలి. ఎన్డీఎస్ఏ నివేదిక ప్రకారం భూ సాంకేతిక, భూ భౌతిక పరిశోధనలు చేసేందుకు కనీసం రెండేండ్ల సమయం పడుతుంది. ఆ తర్వాత నివేదిక రూపొందించేందుకు ఆరు నెలలు, అనంతరం మరమ్మతులు చేసేందుకు మరికొంత సమయం పడుతుంది. ఈ లెక్కన రాబోయే మూడేండ్ల పాటు కాళేశ్వరం నీటిని వినియోగించుకునే అవకాశం లేదు. పరిశోధనలు, నివేదిక, మరమ్మతులకు ఎంత సమయం పడుతుందనే విషయమై ప్రభుత్వానికి ఒక అంచనా ఉన్నదా? ఉద్దేశపూర్వకంగానే మూడేండ్ల పాటు తెలంగాణను ఎండబెట్టాలని సర్కారు నిర్ణయించిందా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఆరున్నర దశాబ్దాల పాటు గోదావరి జలాలను సముద్రంపాలు, ఆంధ్రాపాలు చేసినట్టుగానే.. ఈ ప్రభుత్వం ఉన్నంతకాలం గోదావరి నీటిని వారికే మలపదలుచుకున్నట్టు కనిపిస్తున్నది. కాళేశ్వ రంలోని మూడు బ్యారేజీల నిర్మాణ పనులు 2016లో ప్రారంభమై 2019లో పూర్తయ్యా యి. అంటే బ్యారేజీల నిర్మాణానికి పట్టిన కాలం మూడేండ్లు. కానీ, మూడు పిల్లర్లను పునరుద్ధరించడానికి ప్రభుత్వం ఐదేండ్ల సమయం తీసుకుంటుండటం హాస్యాస్పదం.

## ధర్మవరం లో హాకీ టర్ఫ్ ఏర్పాటు మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో అభివృద్ధికి మరో మెట్టు.

సత్యకుమార్ యాదవ్ సంకల్పంతో ధర్మవరంలో హాకీకి పునర్జన్మ.



ధర్మవరం (**కదిలించే వార్త**) **మే 22:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రత్యేక సహకారంతో ధర్మవరంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా హాకీ టర్ఫ్ ను ఏర్పాటు చేయనున్నట్లు ధర్మవరం బీజేపీ నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు, డిప్యూటీ తహసిల్దార్ సురేష్, హాకీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్య ప్రకాశ్ మరియు ఇతర అధికారులతో కలిసి హరీష్ బాబు ధర్మవరం పట్టణ పరిధిలోని ఎర్రగుంట్ల, పోతుకుంట కాలనీ, తారకరామాపురం, వంటి మూడు ప్రాధాన్యత గల ప్రాంతాల్లో స్థల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ %-% ఇది కేవలం ఒక క్రీడా మైదానం మాత్రమే కాదు. ఇది ధర్మవరం యువతకు అవకాశాల తలుపులు త్రాసే అరుదైన అవకాశంగా నిలవనుంది. మంత్రి సత్య కుమార్ యాదవ్ దూరదృష్టితో మరియు క్రీడల అభివృద్ధిపై ఉన్న నిబద్ధతతో, మన ప్రాంతంలో హాకీ వంటి ప్రాచీన మరియు ప్రతిష్ఠాత్మక క్రీడకు కొత్త ఊపునిచ్చే విధంగా ఈ టర్ఫ్ నిర్మాణం ఉంటుందని పేర్కొన్నారు. త్వరలోనే స్థలం ఖరారు చేసి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టనున్నారని తెలిపారు. ఈ కార్యచరణ ద్వారా ధర్మవరం యువతకు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకునే సదవకాశం లభించనుంది. అలాగే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం క్రీడలు, యువత అభివృద్ధికి ఎంతటి ప్రాధాన్యత ఇస్తుందో ఈ ప్రక్రియ దానికి మరో సాక్ష్యంగా నిలవనుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్, సర్వేర్, అధికారులు, మంత్రి కార్యాలయ సిబ్బంది, హాకీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సూర్య ప్రకాశ్, అరవింద్ గౌడ్, బి. గౌరీ ప్రసాద్, సీనియర్ కోచ్ హస్సేన్, బిల్లే శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.4.30 కోట్ల నిధుల మంజూరు.

సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో - ధర్మవరం మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.4.30 కోట్ల నిధుల మంజూరు.

ధర్మవరం ప్రజల ఆశల పరిరక్షకులు సత్యకుమార్ యాదవ్.



ధర్మవరం, (**కదిలించే వార్త**) **మే 22:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మరియు ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక చొరవతో ధర్మవరం మున్సిపాలిటీకి ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరయ్యాయి. 15వ ఆర్థిక సంఘం మార్గంలో రూ. 4.30 కోట్ల నిధులు కేటాయించబడ్డాయి. ఈ నిధుల రూ. 1.29 కోట్లు ఘన వ్యర్థాల (సాలిడ్ వేస్ట్ మానేజ్మెంట్) నిర్వహణకు,

రూ. 1.29 కోట్లు %-% తాగునీటి సరఫరా మెరుగుదలకు,

రూ. 1.72 కోట్లు %-% మునిసిపాలిటీ సాధారణ అభివృద్ధి పనులకు కేటాయించబడ్డాయి. ప్రజలకు మౌలిక వసతుల కల్పన, శుభ్రత, ఆరోగ్య భద్రత పరంగా నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా మంత్రి శ్రద్ధ వహిస్తున్న విషయం ప్రత్యేకంగా పేర్కొనదగ్గది. ఈ నిధుల ద్వారా పట్టణ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే ముఖ్య లక్ష్యం. ఈ సందర్భంలో ధర్మవరం ప్రజలు రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి దిశగా ఆయన చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ మద్దతు తెలుపుతున్నారు.

## వరదయ్యపాలెంలో విజయవంతంగా శోభాయాత్ర ర్యాలీ.. హనుమాన్ జెండాల ప్రదర్శన.. పేదలకు అన్నదానం.

వరదయ్యపాలెంలో గురువారం జై వీర హనుమాన్ జయంతినీ పురస్కరించుకుని శోభాయాత్ర కార్యక్రమం విజయవంతంగా జరిగింది..



వరదయ్యపాలెం (**కదిలించే వార్త**) **మే 22:** స్థానిక బస్టాండ్ వద్ద బీజేపీ నాయకుడు మురళి(శరవణ స్వీట్స్ బ్యాకరీ) ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగినది. భజరంగ్ దళ జిల్లా కన్వీనర్ ముత్తురాజు ఆధ్వర్యంలో హనుమాన్ జండాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ లోకి స్థానిక యువజన నాయకుడు నూతలపాటి హరిప్రసాద్ చౌదరిను ఆహ్వానించారు. వీహెచ్.పి లో చేరిన నూతలపాటి హరిప్రసాద్ చౌదరికు త్వరలోనే జిల్లా కార్యవర్గంలో స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ శోభా యాత్ర కార్యక్రమం జైశ్రీరామ్ జై హనుమాన్ భక్త బృందం, సమరత సేవా ఫౌండేషన్ ప్రతినిధి హనుమంతప్ప రెడ్డి విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు భరణికృష్ణ,రాజేంద్ర రెడ్డి, బజరంగ్ దళ్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రతినిధులు మరియు హిందూ బంధువులు అందరూ కలిసి భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

## పద్మభూషణ్ డాక్టర్. మెగాస్టార్ చిరంజీవి సీనియర్ అభిమానులకు సన్మానం.



వరదయ్యపాలెం (**కదిలించే వార్త**) **మే 22:** అఖిలభారత మెగాస్టార్ చిరంజీవి రాష్ట్ర యూత్ అధ్యక్షుడు స్వామి నాయుడు ఆదేశాల మేరకు వరదయ్యపాలెంలో సత్యవేడు నియోజకవర్గ మెగాస్టార్ చిరంజీవి యూత్ అధ్యక్షులు తడ శ్రీనివాసులు ఆధ్వర్యంలో మెగాస్టార్ చిరంజీవి సీనియర్ అభిమానులకు ఘనంగా సన్మాన కార్యక్రమం,సన్మాన కార్యక్రమం తర్వాత సీనియర్ అభిమానులు మాట్లాడుతూ తమ ప్రియతమ అభిమాన నాయకుడు పద్మ భూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి గారికి ఆయన తెరపై నటనకే కాకుండా ఆయన వ్యక్తిగత జీవితంలో ఆయన వ్యక్తిత్వానికి, ఆయన సేవ హృదయానికి, వీరాభిమానులం మనీ, విమర్శకులు సైతం వేలెత్తి చూపలేని గుణం తమ అభిమాన నటుడు కి మాత్రమే సొంతమని , ఆయన జీవితంలో ఆయన నడుచుకున్న తీరు ఆయన గుణగణాలు ప్రతి ఒక్కరికి ఆదర్శమని తెలిపారు ఆయన 100 సంవత్సరాలు చల్లగా ఉండాలని ఆయన అభిమానులకే కాకుండా రెండు రాష్ట్రాల్లోని పేదలకు సేవలు అందించాలని కోరుకున్నట్లు సీనియర్ అభిమాన తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ నిర్మల్ కుమార్, భారత్ గ్యాస్ అధినేత వెంకటేశ్వర్లు, వేలూరు, చిరంజీవి, పసుపులేటి విజయ్ కుమార్, శ్రీధర్, శిరీష, శేఖర్, రెడ్డి శేఖర్, సీనియర్ అభిమానులు, గౌరీ శంకర్ థియేటర్ అధినేత, శేఖర్ టీవీ నయీం భాయ్, టీవీ సురేష్,10టీవీ దొడ్డి శేఖర్, పురుషోత్తం, బలరామయ్య, త్యాగరాజు,నరేష్, అలీస్ బాయ్, సాయి, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజలను చల్లగా చూడు స్వామీ..

కీలపూడి లోని శ్రీ వీరాంజేయస్వామి సేవలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం.

వేడుకగా వీరాంజేయస్వామి ఆలయ 7వ వార్షికోత్సవం.



పిచ్చాటూరు (**కదిలించే వార్త**) **మే 22:** పిచ్చాటూరు మండలం కీలపూడి లో వెలసియున్న శ్రీ వీరాంజేయస్వామి వారిని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం దర్శించుకున్నారు.ఈ ఆలయ 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నదాన కార్యక్రమం,హనుమాన్ చాలీసా పారాయణము పాటించారు.ఈ క్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఉదయం 8.15 గంటలకు ఆలయానికి చేరుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తూ వేసవి తాపం నుండి ప్రజలకు ఉపశమనం కలుగుతుందని, ఈ ఏడాది కూడా వర్షాలు సమృద్ధిగా కురిసి అరణియార్ జలాశయం తో పాటు నియోజకవర్గంలోని అన్నీ చెరువులు నిండి అన్నదాతలు, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని స్వామి వారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.ఈ ఆలయం ఏర్పడ్డ అనతి కాలంలోనే ఇంత గొప్పగా అభివృద్ధి చెందడం స్వామి వారి దివ్య శక్తికి నిదర్శనం అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏ ఎం సీ మాజీ చైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు డిల్లీ బాబు, తెలుగు దేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# ఆశాల హామీలకు జీవోలు ఇవ్వండి.

రాష్ట్ర అధ్యక్షురాలు పి. సుభాషిణి డిమాండ్.

26న చలో కడప కలెక్టర్ ఆఫీస్ ధర్నాను జయప్రదం చేయండి.

జిల్లా గౌరవ అధ్యక్షులు గుంటి. వేణుగోపాల్ పిలుపు.




కడప (**కదిలించే వార్త**) **మే 22:** రాష్ట్ర ప్రభుత్వం ఆశాలకు ప్రకటించిన వాటికి జీవోలు తక్షణం జారీ చేయాలని కోరుతూ ఈనెల 26వ తేదీ సోమవారం చలో కలెక్టర్ ఆఫీసు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. సుభాషిణి తెలిపారు. గురువారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు సందర్భంగా మహిళా దినోత్సవం రోజున ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు ఆశా కార్యకర్తలకు గ్రాట్యుటీ లక్ష 50 వేల రూపాయలు, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరములకు పెంపు, 180 రోజులు చొప్పున రెండు కాన్పులకు వేతనంతో కూడిన మెటర్నటీ సెలవులు ఇస్తున్నట్లు ప్రకటించారు తప్ప ఇంతవరకు జీవోలు జారీ చేయలేదని తెలిపారు. జీవోలు జారీ చేయకపోవడంతో ఏప్రిల్, మే మాసాలలో చాలామంది ఆశా కార్యకర్తలను రిటైర్మెంట్ చేశారని ప్రకటించిన బెనిఫిట్స్ కూడా ఆశాలకు అందక పోవడం బాధాకరమన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులు గుంటి. వేణుగోపాల్ మాట్లాడుతూ పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడం దుర్మార్గమన్నారు. ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు ఆశాలకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీని తక్షణం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ నడ్డా రాజ్యసభలో వేతనాలు పెంచుతామని ప్రకటించి ఇంతవరకు జీవో జారీ చేయకపోవడం ఆశా కార్యకర్తల పట్ల కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనపడుతుందని అన్నారు. జిల్లా అధ్యక్షురాలు యు. మరియమ్మ మాట్లాడుతూ గడచిన ఐదు సంవత్సరాల నుండి లెప్రసీ మొత్తం పెండింగ్లో ఉన్నదని గత మాసంలో లెప్రసీ మొత్తం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వారికి ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ దానిని ఆశాలకు ఇవ్వకుండా తిరిగి ప్రభుత్వానికి వెనక్కి పంపామని అధికారులు చెప్పడం చాలా దుర్మార్గం అన్నారు. కరోనాకాలంలో కరోనా అలవెన్స్ కూడా ఇవ్వలేదని తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఆశా కార్యకర్తలకు రేషన్ కార్డులు,సంక్షేమ పథకాలు ఇవ్వాలని, సెలవులు లేకపోవడంతో ఆశాలు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆదివారాలు, ప్రభుత్వ సెలవులతో పాటు ఆశాడే మినహాయించి మిగిలిన మంగళవారాలన్నీ సెలవు దినాలుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన హామీలకు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26వ తేదీ కడప కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ ధర్నా కార్యక్రమానికి జిల్లాలో ఉన్న ఆశా కార్యకర్తలు అందరూ పెద్దఎత్తున తరలివచ్చి ధర్నాను జయప్రదం చేయాలని ఆశాలకు పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో కోశాధికారి సి. అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

## దళితుడి పై దాడి చేసిన నిందితుడిని అరెస్టు చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి





నల్లబెల్లి (**కదిలించే వార్త**) **మే 22:** దళితుడుపై దాడి చేసిన నిందితుని అరెస్టు చేసి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా.అనంతరం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బొట్ల ప్రతాప్,దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య, జిల్లా కార్యదర్శి బోట్ల నరేష్ మాట్లాడుతూ నల్లబెల్లి మండలం రామతీర్థం గ్రామానికి చెందిన కలకోటి స్వామి, సాంబయ్య వృత్తి ట్రాక్టర్ డ్రైవర్, ఆదివారం రోజున రేలకుంట గ్రామ శివారులోని సిద్దూరి ప్రభాకర్ రావు భూమినీ దున్నేందుకు వెళ్లగా రేలకుంట గ్రామానికి చెందిన ఏల్లబోయిన అనిల్, ఏల్లబోయిన రవి, అనే వ్యక్తులు కులం పేరుతో దూషించి, దాడికి పాల్పడిన వారిపై ఏసిపి స్పందించి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుతో పాటు దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. లేని పక్షాన దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ధర్నా చేస్తున్న విషయం తెలియగానే స్థానిక ఎస్సై వి.గోవర్ధన్ ధర్నా స్థలానికి వచ్చి శాంతియుతంగా ధర్నా చేస్తున్న వ్యక్తులతో మాట్లాడి ధర్నాను సద్దుమణిగించారు.ఈ కార్యక్రమంలో బాధితుడు కలకోటి స్వామి, రవి, సుమన్, మాట్ల వంశి దామెర రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఈటల రాజేందర్ కు ఘనస్వాగతం పలికిన బిజెపి పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్




పరకాల (**కదిలించే వార్త**) **మే 22:** అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ?25.41 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసిన వరంగల్ రైల్వే స్టేషన్ ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ గా ప్రారంభించనున్న సందర్భంగా వరంగల్ రైల్వే స్టేషన్ లో బిజెపి జాతీయ నాయకుడు మల్కాజ్ గిరి నియోజకవర్గ పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్, బిజెపి పరకాల కాంటెస్ట్ ఎమ్మెల్యే పగడాల కాళీ ప్రసాద్ రావు పాల్గొన్న అనంతరం పరకాల పట్టణం మీదుగా సరస్వతీ పుష్కరాలకు కాళేశ్వరం వెళుతున్న నేపథ్యంలో పరకాల పట్టణ శాఖ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ వద్ద ఘనంగా స్వాగత తెలిపి శాలువాతో సన్మానించారు. ఇట్టి కార్యక్రమములో పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్పీ జయంతి లాల్ , పరకాల రూరల్ మండలం అధ్యక్షుడు కాసగాని రాజ్ కుమార్, ఎర్రం రామన్న, చందుపట్ల రాజేందర్ రెడ్డి, కుక్కల విజయ్ కుమార్, సంగా పురుషోత్తం, చిర్ర సారంగపాణి, భాసానీ సోమరాజు, ముత్యాల దేవేందర్, కుంటమల్ల గణేష్, ఆకుల రాంబాబు, దార్నా సునీల్, కందుకూరి గిరిప్రసాద్, గాజుల రంజిత్, సారంగా నరేష్, పల్లెబోయిన భద్రయ్య, చంద్రిక అశోక్, ఆర్ పి సంగీత బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



పరకాల (**కదిలించే వార్త**) **మే 22:** హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం గీసుగోండ మండల కేంద్రంలోని కొనయమాకుల రైతు వేదికలో గీసుగోండ, సంగెం మండలాల, 15,16,17 డివిజన్ల కు చెందిన 74 మంది లబ్ధిదారులకు 74లక్షల 8వేల 584 రూ విలువ గల కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్నామని, పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత సంక్షేమ పథకాలకి ఇస్తుందని, ప్రభుత్వం సంక్షేమ పథకాల పేరుతో గత బిఆర్ఎస్ ప్రభుత్వం దోచుకుందని అన్నారు. నిరుద్యోగులు రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రెండు లక్షల లోపు రైతు రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత కరెంట్, 500రూ గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయ, రేషన్ కార్డులు పంపిణీ,భరోసా తదితర సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా మన్నారు. పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఇచ్చిన హామీలను అమలుపరిచే దిశగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాలను ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, పరకాల నియోజకవర్గ ప్రజల తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శ్రీ హనుమాన్ జన్మ దినోత్సవం సందర్భంగా గీసుగోండ మండలం కోనాయమాకుల గ్రామంలోని శ్రీ శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

## వై.ఎస్. షర్మిల రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండించిన డీసీసీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి



కడప (**కదిలించే వార్త**) **మే 22:** విశాఖపట్నంలో వై.ఎస్. షర్మిల రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసిన తీరును జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎన్.డి. విజయ జ్యోతి తీవ్రంగా ఖండించారు. గురువారం కడప నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగార కార్మికుల పక్షంగా శాంతియుతంగా నిరాహార దీక్ష చేపట్టిన సమయంలో షర్మిల రెడ్డి దీక్షను భంగపరచడం, ఆమెను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య, రాజ్యాంగ విరుద్ధమని ఆమె పేర్కొన్నారు. “భారతదేశం వంటి ప్రజాస్వామ్య రాజ్యంలో ప్రతి పౌరునికి ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించింది. అలాంటి సమయంలో శర్మిల రెడ్డిని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధం,” అని విజయ జ్యోతి గారు అన్నారు. విశాఖ ఉక్కు కర్మాగార కార్మికులు తమ జీవిత మరియు భవిష్యత్తు కోసం పోరాడుతున్న సమయంలో, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం గౌరవించి, ప్రజాస్వామ్య హక్కులను రక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.

## మెగా జాబ్ మేళా కు మంచి స్పందన




రణస్థలం (**కదిలించే వార్త**) **మే 22:** ఎచ్చర్ల నియోజకవర్గం రణస్థలం మండల కేంద్రంలో ఎన్ ఈ ఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సెన్స్ వద్ద ఎచ్చర్ల శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు గారి ఆధ్వర్యంలో (లిఎన్ ఈ ఆర్లి ) నిర్వహించే మెగా జాబ్ మేళాకు మంచి స్పందన వచ్చింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించాలని ఇచ్చిన ఆదేశాలమేరకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి రణస్థలం లోని ఎన్ఈఆర్ స్కూల్ అఫ్ ఎక్సెన్స్ ఆవరణంలో మెగా జాబ్ మేళా నిర్వహించటం జరిగింది. ఈ మెగా జాబ్ మేళాకి 21 ప్రైవేటు సంస్థల ప్రతినిధులు హాజరయ్యి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగింది. దీనిలో 781 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 302 మంది వివిధ కంపెనీలలో ఎంపిక అవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథి గా విచ్చేసిన గౌరవ శాసన సభ్యులు శ్రీ ఎన్ ఈశ్వరరావు గారు లిఎన్ ఈ ఆర్లి మాట్లాడుతూ జాబ్ మేళా కి హాజరైన ప్రతి నిరుద్యోగ యువత ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని సూచించారు, గతంలో అభ్యర్థులు కంపెనీల చుట్టూ తిరుగుతూ ఉద్యోగాల కోసం నిరీక్షణ చేయాల్సి వచ్చేదని కానీ ఇప్పుడు నైపుణ్యాభివృద్ధి సంస్థవారి ఆధ్వర్యం లో కంపెనీలే మనవద్దకు వచ్చి వారికి కావాల్సిన అభ్యర్థులను ఎంపిక చేసుకునే విధంగా పరిస్థితులు మెరుగుపడ్డాయని తెలిపారు. అదేవిధంగా జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు. సాయి కుమార్ మాట్లాడుతూ ఏ రంగంలో ఉద్యోగ అవకాశం వచ్చినా సరే దూరం తో సంబంధం లేకుండా అభ్యర్థులు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరచుకావాలని కోరారు, ముందు ఉద్యోగంలో చేరి తర్వాత ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాది అధికారి శ్రీమతి సుధ, సెట్ శ్రీ సీఈవో ప్రసాదరావు, ఎడి డిసెబుల్డ్ కవిత, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయి కుమార్, ఎన్ఈఆర్ సంస్థల డైరెక్టర్ ఎన్ తేజబాబు, ఇతర ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, మరియు ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సెన్సె సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహానాడు విజయవంతం కావాలని ఆంజనేయ స్వామి టెంపుల్ లో ప్రార్థనలు

కొండా సుబ్బయ్య



కడప (**కదిలించే వార్త**) **మే 22:** కడప జిల్లాలోని కమలాపురం నియోజవర్గంలోనీ పబ్బా పురం లో జరగనున్న మహానాడు ఉత్సవాలు విజయవంతం కావాలని గురువారం శ్రీ ఆంజనేయ స్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా ఓల్డ్ బస్టాండ్ లో ఉన్న ఆయన దేవాలయం ముందు తెలుగుదేశం పార్టీ నగర టిడిపి ఉపాధ్యక్షుడు కొండా సుబ్బయ్య ప్రత్యేకంగా ప్రార్థన లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 43 సంవత్సరాల తర్వాత తెలుగుదేశం పార్టీ యొక్క మహానాడు కార్యక్రమం కడప జిల్లాలోని కమలాపురం నియోజకవర్గంలోనీ పబ్బాపురంలో జరుగుతున్న మహానాడుకు ఎటువంటి ఆటంకాలు జరగకుండా విజయవంతం కావాలని కొండ సుబ్బయ్య ఆంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు కావున తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు విరివిరిగా పాల్గొని ఈ మహానాడు ను ఎన్నడు జరగని విధంగా విజయవంతం చేసి కడప జిల్లా తెలుగుదేశం అడ్డ అని నలుమూలల వ్యాపించే విధంగా చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్వామి రంగనాయకులు, రాఘవ, శీను తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసుల రెడ్డి పై చేసిన ఆరోపణలు తగదు

టిడిపి నాయకులు పాలంపల్లి రాజు వెంకట సుబ్బారెడ్డి



కడప (**కదిలించే వార్త**) **మే 22:** టీడీపీ నేతగా చెప్పుకుంటున్న ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి తప్పులు రాజకీయాలు చేస్తూ తమ పార్టీ టిడిపి అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి పై ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామని కడప నగర 49 వ డివిజన్ టీడీపీ నాయకులు రాజు వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. గురువారం కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ నేతలతో కలిసి మెలిసి తిరిగి గత ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేయించిన లక్ష్మిరెడ్డికి తమ పార్టీ నేతలను విమర్శించే అర్హత లేదన్నారు. తాను సీనియర్ అని చెప్పుకునే లక్ష్మిరెడ్డి గత చరిత్ర ఏమిటో తెలుసుకోవాలన్నారు. తన తీరు కారణంగా ఆయన 1999లోనే సస్పెండ్ అయ్యారని, 2009లో ఎన్నికల్లో మాజీమంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి వద్దకు తీసుకెళ్లిన పార్టీకి అన్యాయం చేసిన విషయం గుర్తించుకోవాలన్నారు. తాను ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీకి మోసం, బ్లాక్ మెయిల్ చేయడం ఆయనకు అలవాటన్నారు. వైసీపీ హయాంలో తాము అనేక కేసులు ఎదుర్కొగా, లక్ష్మిరెడ్డిపై ఒక్క కేసు నమోదు చేసి దాఖలాలు లేవన్నారు. వైసీపీ నేతలతోలాలూచీ పడటమే కాకుండా టీడీపీ నేతలపైఆరోపణలుచేయడం లక్ష్మిరెడ్డికి తగదన్నారు. 2024లో కడప అసెంబ్లీ టిక్కెట్ మాధవీరెడ్డికి ఇచ్చాక టీడీపీ పట్ల వ్యతిరేక ప్రచారం నిర్వహించి వైసీపీకి ఓట్లు వేయాలని కోరిన చరిత్ర కలిగిన వ్యక్తి లక్ష్మిరెడ్డి అన్నారు. గత ఎన్నికల్లో నీ కుమారుడు ఒకరోజు తిరిగి తర్వాత కనిపించలేని విషయం అందరికీ తెలిసిందనన్నారు. అంతేకాకుండా తనపై తాలూకా పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టిన చరిత్ర లక్ష్మిరెడ్డిది అన్నారు. తాను చెప్పిన అంశాలపై ఆలంఖాన్‌పల్లెలోని మారెమ్మ ఆలయానికి వచ్చి ప్రమాణం చేద్దామని, ఇందుకు నీవు సిద్ధమా అని ప్రశ్నించారు. ఈ విషయంగా మహానాడుకు వచ్చే ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు లక్ష్మిరెడ్డితోపాటు ఇలాంటి వారి వ్యవహారశైలిపై వినతిపత్రం సమర్పించాలని భావిస్తున్నామన్నారు. ఇలాంటి వారి వ్యవహారంపై విచారణ జరిపి తగిన చర్యలు చేపడితే పార్టీ భవిష్యత్తు బాగుంటుందని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాత కడప కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విత్తన దుకాణాలను తనిఖీ చేసిన టాస్క్ ఫోర్స్




నల్లబెల్లి (కదిలించే వార్త) మే 22: నల్లబెల్లి మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను టాస్క్ ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు.దీనిలో భాగంగా విత్తన ప్యాకెట్, రిజిస్టర్లు,విత్తన లైసెన్సులు,బిల్లు బుక్స్,స్టాక్ బోర్డు ను తనిఖీ చేశారు.టాస్క్ ఫోర్స్ అధికారి నర్సంపేట సహాయ సంచాలకులు కె.దామోదర్ రెడ్డి మాట్లాడుతూ విత్తనాలు అధిక ధరలకు అమ్మొద్దు అని ,విక్రయించినప్పుడు కచ్చితంగా రశీదు ఇవ్వాలని, అందరూ విత్తన చట్టాలని పాటించాలి.విడిగా విత్తనాలు అమ్మొద్దు అని,నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు .రైతు వారిగా విత్తన విక్రయాలను రిజిస్టర్ లో రాయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ సభ్యులు అయిన వ్యవసాయ అధికారులు కృష్ణ, గోపాల్ రెడ్డి,స్థానిక ఎస్సై వి.గోవర్ధన్ పోలీస్ సిబ్బంది ,స్థానిక వ్యవసాయ అధికారి రజిత,డీలర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

## భావన టౌన్షిప్ లోని ప్రభుత్వ భూములను తక్షణమే స్వాధీనం చేసుకోవాలి.

### కుంభకోణంలో భాగస్వాములైన వారిపై కలెక్టర్ నివేదిక ఆధారంగా క్రిమినల్ చర్యలు తీసుకోవాలి.

### ఆర్ సి పి రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి.



కడప (కదిలించే వార్త) మే 22: బుద్ధ రియల్ ఎస్టేట్ మాఫియా తమ అనుబంధ వెంచరైన భావన టౌన్షిప్ లోని ప్రభుత్వ భూములను కలెక్టర్ నివేదిక ఆధారంగా తక్షణమే స్వాధీనం చేసుకోవాలని ఇందులో పాత్రధారులైన అందరిపై అధికారులు, అనధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం నాడు కడప ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతకొమ్మదిన్నె మండలం ఊటుకూరు గ్రామ పొలంలోని భావన టౌన్షిప్ ను ప్రభుత్వ భూములలో అక్రమంగా నిర్మించారని,ఈ విషయంపై గత వైసిపి ప్రభుత్వం లోను ఇప్పుడు ఆర్సిపి స్వతంత్రంగాను, కాంగ్రెస్ టిడిపి, సీపీఐ, ఇతర ప్రజా సంఘాలతో కలిసి అనేక పోరాటాలు చేసిందని తెలిపారు. మాతో పాటు ఉద్యమంలో ఉన్న ఆనాటి ప్రతిపక్ష, నేటి అధికార పార్టీ నాయకులైన పుత్తా నరసింహారెడ్డి, పుత్తా చైతన్య రెడ్డి కూడా ఇవి ప్రభుత్వ భూములని, స్వాధీనం చేసుకోవాలని జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులకు దృష్టికి తీసుకువచ్చారు. దీనికి స్పందించిన ప్రభుత్వం కలెక్టర్ ఆధ్వర్యంలో పూర్తిస్థాయి విచారణ చేశారని తెలిపారు. ఈ విచారణ పూర్తయి నెలరోజులు కావస్తుందన్నారు. ఈ విచారణలో భావన టౌన్షిప్ లో 18:30 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉన్నట్టు నిర్ధారించారు. ఈ విషయాన్ని స్వయంగా కలెక్టర్, జెసి మా దృష్టికి, అట్లాగే ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకువచ్చారు. కానీ స్వాధీనం చేసుకోవడంలో ఆలస్యం జరుగుతుండడాన్ని రవిశంకర్ రెడ్డి ఆక్షేపించారు. బుద్ధ రియల్ ఎస్టేట్ మాఫియా సామాన్యమైన మాఫియా కాదన్నారు. గతంలో గూడూరు పొలంలో సర్వేనెంబర్1లో ఇలానే ప్రభుత్వ భూమి ఎకరా ఆక్రమించుకొని ఇల్లు నిర్మించారని అప్పటి కలెక్టర్ అనిల్ కుమార్ అది ప్రభుత్వమే నిర్ధారించి స్వయంగా దగ్గరుండి తొలగించిన తర్వాత మళ్లీ దానిని వాళ్ళు స్వాధీనం చేసుకున్నారని ఆయన అన్నారు. కాబట్టి తక్షణమే ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని ఆన్లైన్ లో ప్రభుత్వ భూమి అని నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా పిఓబి రికార్డ్స్ లో వీటిని నమోదు చేసి ఎవరు కబ్జా చేయకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. రెండు మూడు రోజుల్లో స్వాధీనం చేసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో సభ్యులు మక్బుల్ భాష, నాయకులు లక్ష్మీదేవి, ప్రసాద్, బాల చెన్నయ్య, శంకరయ్య, వెంకటేష్, ఓబులేష్ పాల్గొన్నారు.

## హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించిన తులసి రెడ్డి దంపతులు



వేంపల్లి, (కదిలించే వార్త) మే 22: హనుమజ్జయంతిని గురువారం వేంపల్లి లో తులసి రెడ్డి దంపతులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి మాట్లాడుతూ హనుమజ్జయంతి హిందువులకు అతి పవిత్రమైన, ముఖ్యమైన పండుగ అన్నారుఅతి ప్రాచీన కాలం లో వైశాఖ మాసం, బహుళ దశమి నాడు,పూర్వ భాద్రా నక్షత్రం లో తిరుమల ఏడు కొండల్లో ఒకటైన అంజనాద్రి కొండమీద వాయుదేవుని వరప్రసాదం తో అంజనా దేవి,కేసరి అనబడు వానర పుణ్య దంపతులకు హనుమంతుడు జన్మించాడని పరాశర సంహిత,శివ మహాపురాణం చెబుతున్నాయి. హనుమంతుడిని ఆంజనేయుడని,అంజనీ పుత్రుడని, వాయుసుతుడని, పవన కుమారుడని కూడా పిలుస్తారు. ప్రసన్నాంజనేయుడుగా, వీరాంజనేయుడుగా, అభయాంజనేయుడుగా,పంచ ముఖ ఆంజనేయుడుగా వివిధ రూపాలలో దర్శనమిస్తాడు. హనుమంతుడు కార్య సాధకుడు,కార్య దక్షుడు,కార్య శూరుడు. అచంచల భక్తి, విశ్వాసాలకు మారుపేరు. అతులిత బలశాలి.సాహస వంతుడు.మహా పండితుడు, బుద్ధిశాలి.సమయ స్ఫూర్తికి ప్రతిరూపం.హనుమంతుడు లేకపోతే రామాయణ మే లేదని తులసి రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో తులసి రెడ్డి సతీమణి శ్రీమతి నరెడ్డి అలిమేలమ్మ,పులివెందుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధ్రువ కుమార్ రెడ్డి,వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామ కృష్ణ, రామాంజనేయ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్. సుబ్రమణ్యం, అమర్ నాథ్ రెడ్డి, ఉత్తన్న,వేమయ్య, రమణ, నాగరాజు, వినయ్, అశ్విత్,సాయి తదితరులు పాల్గొన్నారు.

## జీ తెలుగు అప్సర అవార్డ్స్, 20 సంవత్సరాల వేడుక..




కడప (కదిలించే వార్త) మే 22: ప్రారంభించిన రోజునుంచీ ప్రతిభావంతులైన కళాకారులు, దర్శకులు, రచయితలు, నిర్మాతలు, చిత్రబృందం అచంచలమైన అంకితభావంతో ప్రేక్షకుల హృదయాలను కొల్లగొడుతూ తిరుగులేని ఛానల్గా ఎదిగింది జీ తెలుగు. మే 18, 2025కి విజయవంతంగా ఇరవై సంవత్సరాల మైలురాయిని చేరుకున్న సందర్భంగా వివిధ రంగాలలో రాణిస్తున్న మహిళలకు ప్రతిష్ఠాత్మక జీ తెలుగు అప్సర అవార్డులను ప్రదానం చేసింది. వెండితెర, బుల్లితెర తారల సందడితో వైభవంగా జరిగిన జీ తెలుగు అప్సర అవార్డ్స్ ఈ శనివారం, మే 24, 2025 సాయంత్రం 5:30 గంటలకు మీ జీ తెలుగులో ప్రసారం కానుంది! అంగరంగ వైభవంగా జరిగిన ఈ కార్యక్రమానికి ఎనర్జిటిక్ యాంకర్స్ సుధీర్, రవి వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ కార్యక్రమంలో డ్రామా జూనియర్స్ పిల్లలు చిరంజీవి, బాలకృష్ణ గెటప్‌లో వేదికపైకి వచ్చి ప్రముఖ నటి రోజాకు అవార్డు అందించారు. జయప్రద, ఐశ్వర్య రాజేష్, అనిల్ రావిపూడితో కలిసి సంక్రాంతికి వస్తున్నాం సినిమాలోని సీన్స్ని రీక్రియేట్ చేశారు. అమల అక్కినేని రవి, రోజాతో కలిసి డాన్స్ చేయడమే కాకుండా, జంతు సంరక్షణ, నాగార్జున, నాగచైతన్య, అఖిల్ గురించి పలు విషయాలు పంచుకున్నారు. జయసుధకు అభిమానులు ఆటోగ్రాఫ్‌లతో అలంకరించిన చీరను బహుమతిగా ఇచ్చారు. రమ్యకృష్ణ నటించిన ప్రముఖ పాత్రలతో ఓ చక్కని ప్రదర్శన ఇచ్చారు. మంచు లక్ష్మీ తన డాన్స్తో అలరించగా, కోర్ట్ సినిమా ఫేమ్ శ్రీదేవి తన తల్లి గురించి పంచుకున్న విషయాలు అందరినీ కంటతడి పెట్టించాయి. రవి, సుధీర్ కలిసి డైరెక్టర్ సుకుమార్‌ను పలు సరదా ప్రశ్నలతో ఆటపట్టించారు. వ్యాపారంలో విజయవంతంగా రాణిస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్న మార్గదర్శి చిట్ ఫండ్స్ ఎండీ శైలజా కిరణ్ ప్రతిష్ఠాత్మక మహిళా మార్గదర్శి అవార్డు అందుకున్నారు. హీరోయిన్ ఐశ్వర్య రాజేష్ తన తండ్రి %ూ×% చిత్రాన్ని చూసి భావోద్వేగానికి లోనయ్యారు. సమంత 15 ఏళ్ల సినీ ప్రయాణాన్ని అద్భుతమైన ప్రదర్శన, కేక్ కట్టింగ్‌తో ఈ వేదికపై ఘనంగా జరుపుకున్నారు. 114 ఏళ్ల పద్మశ్రీ తిమ్మక్క ఎనభై సంవత్సరాల్లో 8000 చెట్లు నాటినందుకుగానూ ఈ వేదికపై సన్మానించారు. జీ తెలుగు తారలు చేసి నవదుర్గ ప్రదర్శన అద్భుతంగా ఆకట్టుకుంది. మోనికా రెబా, హెబా పటేల్, శ్రీదేవి, రోషన్ నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఘనంగా జరిగిన ఈ వేడుకలో టాలీవుడ్ ప్రముఖులైన సంయుక్త మీనన్, మీనాక్షి చౌదరి, మురళీ మోహన్, అన్నపూర్ణ, స్వప్న దత్, ప్రియాంక దత్, జీవిత రాజశేఖర్, శివాని రాజశేఖర్, సుమ కనకాల, కోన వెంకట్, నిహారిక కొణిదెల, అనసూయ, డైరెక్టర్ నందిని రెడ్డి, రజిత, ప్రగతితో పాటు మరికొందరు నటీనటులు పాల్గొని సందడి చేశారు. హృదయాలను హత్తుకునే క్షణాలతో ఈ అవార్డుల ప్రదానోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. డాన్స్ ప్రదర్శనలు, అవార్డ్స్ అందుకున్న అనంతరం పలువురు ప్రముఖుల భావోద్వేగభరిత ప్రసంగాలు ప్రేక్షకుల మనస్సులను గెలుచుకుంటాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

## దివ్యాంగ చిన్నారుల కొరకు సర్వే



వేంపల్లి, (కదిలించే వార్త) మే 22: సమగ్ర శిక్ష ,కడప జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మండల విద్యా శాఖ అధికారులు ఆదేశాలతో ఈ నెల మే 13వ తేదీ నుండి జూన్ 10వ తేదీ వరకు దివ్యాంగుల సర్వే నిర్వహిస్తున్నట్లు డిస్టిక్ ఎం ఐ ఎస్ మరియు ప్లానింగ్ కోఆర్డినేటర్ పి. లక్ష్మీనరసింహరాజు తెలియజేశారు. వేంపల్లి మండలంలో దివ్యాంగుల సర్వే ని ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఇఆర్పి లు యశోద, సుజాత లు మండలంలో 18 సంవత్సరాలలోపు దివ్యాంగ చిన్నారులు పాఠశాలలో ఇంకా నమోదు కాని వారు, బడి బయట ఉన్న చిన్నారులు, ఐదు సంవత్సరముల లోపు దివ్యాంగ చిన్నారులు కొరకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. వేంపల్లి మండలంలో ఎనిమిది మంది కొత్తగా గుర్తించినట్లు తెలిపారు. అదేవిధంగా అన్ని భవిత కేంద్రాలలో దివ్యాంగుల నమోదు శాతాన్ని పెంచాలని లక్ష్మీనరసింహారాజు తెలియజేశారు. ఇంకా మండలంలో ఎవరైనా దివ్యాంగ చిన్నారులు పాఠశాలలో నమోదు కాని వాళ్ళు ఉంటే వాళ్ళు భవిత కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. భవిత కేంద్రం ద్వారా వీరికి కావలసినటువంటి అలవెన్స్ లు, ఆపరేషన్లు, ఉపకరణాలు అందజేస్తున్నట్లు తెలియచేశారు. కార్యక్రమంలో ఐఈఆర్పి లు యశోద, సుజాత, ఎం ఐ ఎస్ కోఆర్డినేటర్ అబ్దుల్ ఖాదర్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కొర్రకోడులో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

### మార్మోగిన ఆంజనేయ స్వామి నామస్మరణ





కూడేరు (కదిలించే వార్త) మే 22: కూడేరు మండలం కొర్రకోడులో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు . తొలుత ఆంజనేయస్వామి మూల విరాట్ కు పాలాభిషేకం చేశారు .తర్వాత వివిధ రకాల పట్టు వస్త్రాలు ,పుష్పాలతో విశేషంగా అలంకరణ చేశారు. 108 మంది చిన్న పిల్లలు హనుమాన్ చాలీసా ను సామూహికంగా పఠనం చేశారు. సాయంత్రం ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు .ఈ సందర్భంగా ఆంజనేయస్వామి నామస్మరణ మార్మోగింది .ఈ వేడుకల్లో గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమాల్లో వైయస్ మనోహర్ రెడ్డి

### ప్రత్యేక పూజలు అందుకున్న పుర ప్రముఖులు



పులివెందుల అర్బన్:(కదిలించే వార్త) మే 22: పులివెందుల పట్టణ పరిధిలోని మార్కెట్ ఆంజనేయ స్వామి గుడిలో హనుమాన్ జయంతి సందర్భంగా పాత మార్కెట్ ఏరియాలో భక్తులందరికీ అందరికీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ ఇంచార్జ్ మనోహర్ రెడ్డి పులివెందుల పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి వైసీపీ నాయకుల ప్రతాపరెడ్డి చలమారెడ్డి చంద్రమౌళి బ్యాటరీల ప్రసాదు లు హాజరై యి అంజన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమం చేయడం జరిగినది. ఆలయ నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు

## సంప్రదాయంగా హనుమాన్ జయంతి వేడుకలు





సింహాద్రిపురం (కదిలించే వార్త) మే 22: హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీనిడి వెలగల ఆంజనేయ స్వామి దేవస్థానంలో విజయమైన పూజలు జరుగ బడ్డాయి ఉదయం స్వామివారికి మహా సంప్రోక్షణ గణపతి పూజ శ్రీ ఆంజనేయ స్వామి వారికి పంచామృతాభిషేకం నాగవల్లిక ఆకు పూజ సింధూర పూజ ఆలయ ప్రాకారోత్సవం మొదలైన పూజా కార్యక్రమాలు జరుగబడ్డాయి పూజా కార్యక్రమాలలో ఆలయ ధర్మకర్త లక్ష్మీనారాయణ రెడ్డి కమల్ నాథ్ రెడ్డి దంపతులు జోగి రెడ్డి దంపతుల పాల్గొన్నారు. హిమకుంట్ల గురిజాల కసుమూరు సింహాద్రిపురం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి పునీతులయ్యారు పై పూజా కార్యక్రమాలు అన్ని ఆలయ ప్రధాన అర్చకులు మధుసూదన్ శర్మ గారిచే జరుగబడ్డాయి . ఈ కార్యక్రమంలో భక్తులు ఆలయ నిర్వహకులు తదితరులు పాల్గొన్నారు

## కోటి రూపాయల నిధులతో నిర్మాణం చేసిన బీటీరోడ్డును ప్రారంభించిన మేయర్ సుధారాణి, ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు




వరంగల్ (కదిలించే వార్త) మే 22: వర్ధన్నపేట నియోజకవర్గ పరిధి లోని విలీన గ్రామాలలోని ప్రతి కాలనీ అభివృద్ధికి ప్రత్యేకంగా అభివృద్ధి చేపడుతానని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పరిధిలోని కెఎస్ఆర్ కాలనీలో నిర్మాణం చేసిన అంతర్గత రోడ్డును నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు రిబ్బన్ కట్ బీటీ రోడ్డును ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యే నాగరాజును కాలనీ వాసులు పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించి ఘన స్వాగతం పలికారు. అనంతరం గత 10సం బిఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలను కలిసిన కూడా ఎవరు పట్టించుకోలేదని ఎమ్మెల్యే నాగరాజు గెలుపొందిన తర్వాత మొదటి సారి వెళ్ళి కలిసి సమస్య వివరించ గానే సానుకూలంగా స్పందించి సుమారు 1 కోటి రూపాయలతో కాలనీ ప్రధాన రోడ్డు నిర్మాణం చేయించి నందుకు ఎమ్మెల్యే నాగరాజుకి ప్రత్యేకంగా కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విలీన గ్రామాల లోని ప్రతి బస్తీ/కాలనీలను రానున్న రోజుల్లో అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, సైడ్ డ్రైన్, అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం ప్రజలు కూడా అధికారులకు సహకరించ గలరని కోరారు. ఇట్టి కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ జన్ను శీభరాణి - అనిల్ కుమార్, స్థానిక కాలనీ అధ్యక్షుడు లాలునాయక్,ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కమిటీ సభ్యులు,డివిజన్ కాంగ్రెస్ నాయకులు బుద్దే పెద్దన్న, జన్ను సుధాకర్,జన్ను అరుణాకర్,మున్సిపల్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ముద్దలాపురంలో అంజన్నకు ప్రత్యేక పూజలు



కూడేరు (కదిలించే వార్త) మే 22: కూడేరు మండల పరిధిలోని ముద్దలాపురంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆలయ అర్చకుడు ఆంజనేయస్వామి మూలవిరాట్ కు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఈ పూజ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారినీ దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. ఆంజనేయ స్వామి నామాన్ని స్మరించారు.

## విశేష పూజలందుకున్న బసాపురం ఆంజనేయ స్వామి



కూడేరు (కదిలించే వార్త) మే 22: కూడేరుకు సమీపన ప్రసిద్ధ గాంచిన బసాపురం ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆంజనేయ స్వామికి విశేషమైన పూజలను ఆలయ అర్చకుడు దుర్గ చైతన్య నిర్వహించారు.. వివిధ రకాల పట్టు వస్త్రాలు పుష్పాలతో విశేషంగా అలంకరణ చేశారు .భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు .అలాగే భజన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు .ఈ వేడుకల్లో గ్రామస్తులు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## హనుమాన్ శోభాయాత్రలు ఎంపీ అవినాష్ రెడ్డి

### ప్రతి ఒక్కరికి హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపిన ఎంపి



పులివెందుల అర్బన్:(కదిలించే వార్త) మే 22: పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని నూతన ఆర్టిసి బస్టాండ్ వద్ద గల ఆంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయ స్వామి జయంతి వేడుకలు హనుమాన్ శోభాయాత్ర వేడుకలు ఘనంగా నిర్వహించగా ఎంపీ అవినాష్ రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమాల్లో భాగంగాహనుమాన్ జయంతి" సందర్భంగా ఆంజనేయ స్వామి గుడి కమిటీ ప్రత్యేక ఆహ్వానం మేరకు పూజలో పాల్గొన్న పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి, మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి , మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పులివెందుల పట్టణ వైకాపా కన్వీనర్ హాల్ గంగాధర్ రెడ్డి, వేల్పుల రాము, నాలుగవ వార్డు కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, హిందూ ఐక్యవేదిక సభ్యులు క నాయకులు,కార్యకర్తలు తదితరులు. అనంతరం పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు.

## టిడిపిలో అలంకాన్ పల్లి లక్ష్మిరెడ్డి ఆటలు సాగడం లేదని శ్రీనివాస్ రెడ్డి పై ఆరోపణలు చేయడం తగదు

### టిడిపి నాయకులు రాంప్రసాద్ రెడ్డి, సుబ్బారెడ్డి



కడప (కదిలించే వార్త) మే 22: ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి తొలి నుంచి టీడీపీలో పెత్తనం చెలాయిస్తూ ప్రస్తుతం తన ఆటల సాగడం లేదని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులురెడ్డి పై ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంప్రసాద్‌రెడ్డి మండిపడ్డారు .నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఇతర టీడీపీ నేతలు, కార్పొరేటర్లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసలు లక్ష్మిరెడ్డి ఉండేది ఏ పార్టీ అన్నది స్పష్టం చేయాలన్నారు. మొదటి నుంచి జిల్లా టీడీపీ పెత్తనం చెలాయిస్తున్న ఆయన తన మాటనే నెగ్గుకుంటూ వచ్చేలా చూసుకున్నారన్నారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే మాధవీరెడ్డి లక్ష్మిరెడ్డి మోసపు మాటలను గ్రహించి ప్రక్కన పెట్టాలని నిర్ణయించారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లోటిక్కెట్ ఒకరికే వస్తుందని, అంత మాత్రాన పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం తగదన్నారు. 50 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన ఆయన కడప నగర పరిధిలోని వివిధ దేవాలయాల చైర్మన్ తన వర్గీయులకు ఇప్పించుకుని నేడు పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించడం తగదన్నారు. గత ఎన్నికల్లో ఆయన, ఆయన కుమారుడు వ్యవహరించిన తీరు అందరికీ తెలిసిందేనన్నారు. తాను చేసిన నమ్మకద్రోహం విషయాన్ని విస్మరించి తమ పార్టీ నేత శ్రీనివాసులురెడ్డిపై నిరాధారణ ఆరోపణలు చేయడం లక్ష్మిరెడ్డికి తగదన్నారు. ఆయన కల్లిబొల్లి మాటలు నమ్మే స్థితిలో ఎవరూ లేరని, కడప నియోజకవర్గంలో టీడీపీకి ఆయన చేసిన నష్టాన్ని అందరూ గ్రహిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ సూర్యనారాయణరావు, టీడీపీ నేత చల్లా రాజశేఖర్, రాజశేఖర్ రెడ్డి, నాగేంద్ర, మణిభూషణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

### జైశ్రీరామ్ జై హనుమాన్ నినాదాలతో నినదించిన హిందూ సోదరులు

### కాషాయమయంగా మారిన ప్రధాన రహదారులు



పులివెందుల అర్బన్ (కదిలించే వార్త) మే 22: పులివెందుల పట్టణంలో గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హనుమాన్ శోభాయాత్ర వైభవంగా కొనసాగగా, జై హనుమాన్ జై శ్రీరామ్ నినాదాలతో హిందువులు నినదించగా, ప్రధాన రహదారులన్నీ కాషాయమయంగా మారాయి. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పులివెందుల నియోజకవర్గ పరిధిలో వేర్వేరు ప్రాంతాల నుండి తరలివచ్చిన హిందూ సోదరుల ఆధ్వర్యంలో నూతన ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల ఆంజనేయ స్వామి ఆలయం వద్ద నుండి పులివెందులలోని ప్రధాన రహదారుల గుండా జైశ్రీరామ్ జై హనుమాన్ నినాదాలతో, ఆంజనేయుడు వేషధారణలో భక్తి పాటలతో హిందుత్వాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమాలు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో వరప్రసాద్, హాల్ గంగాధర్ రెడ్డి, కిషోర్, రవి, చంద్రమౌళి, హరి, వాసు, శీను మరియు ఇతర హిందూ ఐక్యవేదిక సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఔదార్యం



పరకాల (కదిలించే వార్త) మే 22: హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గం దామెర మండలం లాదెళ్ల గ్రామం శివారులో ప్రమాదవశాత్తు బోల్తా పడిన ఆటోను అటుగా వెళ్తూ గమనించి హుటాహుటిన తన కారు ఆపి క్షతగాత్రులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అనంతరం క్షతగాత్రుల వివరాలను తెలుసుకోని స్వయంగా తన కారులోనే ఆసుపత్రికి తరలించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇట్టి సంఘటనను నేరుగా చూసిన గ్రామ ప్రజలు చల్లా ధర్మారెడ్డి చేసిన పనికి హర్షం వ్యక్తం చేశారు.

## గండి అంజన్నకు పట్టువస్త్రాలు
# సమర్పించిన ఆర్యవైశ్యులు...



చక్రాయపేట (కదిలించే వార్త) మే 22: చక్రాయపేట మండలంలోని గండిక్షేత్రంలో రామబాణంతో వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీ వాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం ఆధ్వర్యంలో స్వామివారికి పట్టువస్త్రాలు, తోమాలలు సమర్పించామని శ్రీ వాసవి ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుడు పచ్చిపులుసు మురళీకిషోర్ తెలిపారు. వేంపల్లె నూట ఇబ్బంద్రు నగర ఆర్యవైశ్యులు మరియు ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం కార్యవర్గ సభ్యులు సంప్రదాయ వస్త్రధారణతో మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించామన్నారు.అన్నదాన సత్రంలోని శ్రీ ఆంజనేయ స్వామి పట్టువస్త్రాలతో అలంకరించి ఆర్యవైశ్య మహిళలు ఆకుపూజ, కుంకుమార్చన హనుమాన్ చాలీసా పారాయణంతో పాటు తదితర పూజలు నిర్వహించామన్నారు. హనుమజ్జయంతి రోజున శాశ్వత నిత్యాన్నదాన పథకానికి విరాళాలు ఇచ్చిన దాతలను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ అన్నదానం, అనేది రెండు పదాలతో రూపొందిం చబడింది,అన్నం అంటే



ఆహారం,దానం అంటే ఇవ్వడం లేదా దానం చేయడమని తెలిపారు. అన్నదానాన్ని వివిధ రకాల దానంలో మహాదానం అంటారు.ప్రతి జీవికి ప్రశాంతమైన జీవితాన్ని గడపడానికి కొన్ని ప్రాథమిక అంశాలు అవసరమన్నారు. బట్టలు,ఆశ్రయం వంటి అంశాలు జీవన నాణ్యతను ప్రభావితం చేస్తున్నప్పటికీ, ఆహారం లేకపోతే జీవితమే లేదన్నారు.అందుకే అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారని,అన్నం లేదా ఆహారం లేకపోతే ఏ ప్రాణి జీవించలేదన్నారు.ఈ కార్యక్రమంలో దాతలు,వేంపల్లె నూట ఇబ్బంద్రు నగర ఆర్యవైశ్యులు,అన్నదాన సత్రం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# వైఎస్ షర్మిలా రెడ్డి అరెస్టు దుర్మార్గం చర్య
## పిసిసి డెలిగేట్ శ్రీనివాస్ రెడ్డి





పులివెందుల అర్బన్ (కదిలించే వార్త) మే 22: ఏపీ పిసిసి అధ్యక్షురాలు షర్మిలారెడ్డిని అరెస్టు చేయడం దుర్మార్గపు చేయ అని పిసిసి డెలిగేట్ శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. విశాఖలో కార్మికులకు మద్దతుగా షర్మిల రెడ్డి చేపట్టిన చేపట్టిన దీక్షను పోలీసులు భగ్నం చేయడానికి ఆయన ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో నిరసన చేసే హక్కు భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. ఆ హక్కును కాల రాయడం అప్రజాస్వామిక చర్య అన్నారు. కార్మికులకు అన్యాయం జరిగితే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదు అన్నారు. ఈ క్రమంలో విశాఖలో కార్మికులకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ దీక్ష చేపట్టడం తప్పా అని ప్రశ్నించారు. షర్మిల రెడ్డి చేపట్టిన ఉక్కు దీక్షను భగ్నం చేయడం సహేతుకం కాదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ వద్ద రాత్రి తొమ్మిది గంటల సమయంలో పోలీసులు ఒక్కసారిగా దీక్ష శిబిరం చుట్టు ముట్టి. తీవ్రవాదులకంటే గోరంగా ఆమె ను అరెస్టు చేసి గాజువాక పోలీస్ స్టేషన్ తరలించడం అప్రజాస్వామికమని వెల్లడించారు. శాంతియుతంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల ,కార్మికుల సమస్యల మీద ఆమరణ నిరాహార దీక్ష చేపడితే! ప్రభుత్వం పోలీసులు చేత దీక్షను భగ్నం చేసి షర్మిల రెడ్డిని అరెస్ట్ చేయడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. విశాఖ ఉద్యోగులు, కార్మికులకు మద్దతుగా చేపట్టిన షర్మిలా రెడ్డికి రాజకీయాలకతీతంగా ప్రజలందరూ సంఘీభావం తెలపాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి నియంత పాలనకు అడ్డుకట్ట వేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికైనా షర్మిలా రెడ్డిపై బనాయించిన అక్రమ కేసు ఎత్తివేయాలని, అందుకు బేషరుతుగా క్షమాపణ చెప్పాలని శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

## ఘనంగా అభయాంజనేయ స్వామి జయంతి వేడుకలు
### ఆహ్లాదకరమైన వాతావరణంలో అన్నదానం
### శాశ్విత అన్నదాత బి వి ఎస్ ఆర్ ట్రాన్స్పోర్ట్ అధినేత బివి సుబ్బారెడ్డి



పులివెందుల అర్బన్(కదిలించే వార్త) మే 22: పులివెందుల టు కదిరి మార్గాన కంకర మిషన్ వద్ద కొలువై ఉన్న శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఆలయ వ్యవస్థాపకులు షరీఫ్ మరియు భక్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఉదయమే స్వామివారికి పంచామృత అభిషేకం సహ స్రనామార్చన తదితర పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఈ పూజ కార్యక్రమాలకు షరీఫ్ ప్రత్యేక ఆహ్వానం మేరకు పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి సతీమణి శ్రీలత రెడ్డి, మరియు ప్రధ సంస్థల్లో అన్నదాతగా నిలిచిన బివిఎస్ ఆర్ ట్రాన్స్పోర్ట్ అధినేత బివి సుబ్బారెడ్డిలు హాజరయ్యి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు మాట్లాడుతూ శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తుల సహకారంతో వార్షికోత్సవం హనుమాన్ జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుందని, వాటిలో భాగంగా ప్రతి ఏటా శాశ్వత అన్నదాతగా బి వి ఎస్ ఆర్ ట్రాన్స్పోర్ట్ అధినేత బివి సుబ్బారెడ్డి స్వామివారి ప్రతి కార్యక్రమాలకు అన్నదానాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. బివి సుబ్బారెడ్డి చేతుల మీదుగా ఉత్తర మార్గాన ఆలయ ప్రాంగణంలో ఉగేంపు కార్యక్రమాలు నిర్వహించారు. రానున్న కాలంలో భక్తుల సహాయ సహకారాలతో ఆలయ ప్రాంగణ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు పెద్ద సంఖ్యలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి సేవా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# చెరువులకు మరమ్మత్తులు,
# పునరుద్ధరణ పనులు చేపట్టండి.
## జిల్లా కలెక్టర్ టి. ఎస్. చేతన్



పుట్టపర్తి, (కదిలించే వార్త) మే 22: జిల్లాలో ఉన్న చిన్ననీటిపారుదల చెరువులకు సంబంధించి మరమ్మతులు తదితర పునరుద్ధరణ పనులు వెంటనే చేపట్టేందుకు ప్రత్యేక దృష్టిని సారించాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఇరిగేషన్ మైనర్ ఇరిగేషన్, భూగర్భ జల శాఖ తదితరుల అధికారులతో రిపేర్,రెనోవేషన్, రిస్టోరేషన్, (ఆర్ ఆర్ ఆర్) స్కీం పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2022 లో ఆర్ఆర్ స్కీంను ప్రవేశపెట్టడం జరిగిందని ఇందులో చిన్న నీటి పారుదల చెరువులకు మరమ్మత్తులు, పునరుద్ధరణ పనులు చేపట్టడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. శ్రీ సత్య సాయి జిల్లాలో 11 86 చిన్న పెద్ద చెరువులు ఉన్నాయని, సుమారు 83 4 8 6 ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు గణాంక వివరాలు ఉన్నందున ముందుగా జిల్లాలో మరమత్తు, పునరుద్ధరణ చేయాల్సిన ట్యాంకులను గుర్తించి ఎకరాకు ఎంతవరకు అవసరమో ప్రభుత్వ నిబంధనల మేరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఆర్ఆర్ఆర్ స్కీం ద్వారా రాష్ట్ర నిధుల నుండి 40% అలాగే కేంద్రం నుండి 60 శాతం నిధులు మంజూరవుతాయన్నారు. ఇదివరకే జిల్లావ్యాప్తంగా మొదటి విడతలో గుర్తించిన 239 చెరువులకు సంబంధించి ట్యాంకుల మరమ్మత్తులు, పునరుద్ధరణ పనుల కొరకు ప్రతిపాదనల పై జిల్లా కలెక్టర్ పలు విషయాలపై చర్చించారు. ఈ సమావేశంలో మైనర్ ఇరిగేషన్ ఎస్. ఈ. విశ్వనాథరెడ్డి, పెనుగొండ ఈ ఈ గురుమూర్తి, ఈ ఈ సురేంద్ర రెడ్డి, పుట్టపర్తి డిఇ గంగాధర, సైంటిస్ట్ డా.ఎస్ కే యం డి. సర్ తాజ్ బాషా, కేంద్రీయ జల సంఘం ఏడి సిహెచ్ సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ జెండా మోసిన ఏ ఒక్కరికి అన్యాయం జరగదు

ఇది మిరిచ్చిన విజయం..
మీ కోసమే పని చేస్తాను
పరిటాల రవి స్ఫూర్తితో స్థానిక సంస్థల్ని
ఏకగ్రీవం చేసుకుందాం
మినీ మహానాడు వేదికగా
ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు
తిరుమల దేవర దేవస్థానం
వద్ద రాప్తాడు మినీ మహానాడు
వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు..
అంతటా పసుపుమయం
పలు కీలక తీర్మాణాలకు ఆమోదం..
సీఎం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయం






రాప్తాడు (కదిలించే వార్త) మే 22: పసుపు జెండా మోసి పార్టీ కోసం కష్టపడ్డ ఏ ఒక్క కార్యకర్తకు అన్యాయం జరగదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమం రామగిరి మండలం ననసకోట తిరుమల దేవర దేవస్థానం వద్ద ఒక పండుగ వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు పార్లమెంట్ అధ్యక్షుడు అంజినప్ప, అబ్జర్వర్ కృష్ణమ్మ, నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, వివిధ విభాగాల నాయకులు, వేలాదిగా కార్యకర్తలు పాల్గొన్నారు. ముందుగా తిరుమల దేవర, ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి సభకు హాజరయ్యారు. అక్కడ పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించిన తర్వాత మహానాడుని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ తాను ఈ విధంగా వేదిక మీద మాట్లాడుతున్నానంటే దానికి కారణం ఎన్టీఆర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడేనన్నారు. ఆరోజు పరిటాల రవీంద్రను ఎన్టీఆర్ పార్టీలోకి ఆహ్వానించారని.. ఆ తర్వాత ఆయన పార్టీని రవి ఎంతో బలంగా మార్చారన్నారు. ఆయనకు మంత్రి పదవి ఇవ్వకూడదని కొందరు అడ్డుపడినా ఎన్టీఆర్ పరిటాల రవికి మంత్రి పదవి ఇచ్చారన్నారు. ఆ తర్వాత నేను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా.. ఐదేళ్ల పాటు మంత్రిగా అవకాశం వచ్చింది ముఖ్యమంత్రి చంద్రబాబు వలనేనన్నారు. గత ఐదేళ్ల పాటు పార్టీ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని నిలబడ్డారన్నారు. వైసీపీ ఎన్ని కష్టాలకు గురి చేసినా, కేసులు పెట్టినా బెదరకుండా పార్టీలో పని చేశారన్నారు. వారి కష్టం ఫలించి నేడు భారీ మెజార్టీ వచ్చిందన్నారు. నా గెలుపు కోసం పని చేసిన ఏ ఒక్క నాయకుడు, కార్యకర్తలను మరవనన్నారు. ఇప్పటికే కొంత మందికి వివిధ రూపాల్లో న్యాయం జరిగిందని.. ఇంకా మిగిలిన వారికి కూడా ఈ నాలుగేళ్లలో కచ్చితంగా న్యాయం చేస్తానన్నారు. గ్రామాల్లో జరిగే చిన్న చిన్న విషయాల్ని మనసులో పెట్టుకోవద్దని.. అంతా సమిష్టిగా పని చేయాలన్నారు. ఇది మీరు ఇచ్చిన విజయం అని.. మీ కోసమే పని చేస్తానని స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన దుర్మార్గాలు అన్నీ ఇన్నీకావని.. మన అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేస్తే మహిళా కార్యకర్తలతో సహా అంతా రోడ్డెక్కారన్నారు. చివరకు ప్రాణ త్యాగాలకైనా సిద్ధంగా నిలిచారన్నారు. ఇటు తోపు బ్రదర్స్ వలన మన కార్యకర్తలతో పాటు ప్రజలు కూడా ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. వారు చేసిన దౌర్జన్యాలను ఎదుర్కొని నిలబడ్డామన్నారు. అయితే మరో ఏడాదిలోపు స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయని.. ఆ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ కష్టపడి చేయాలన్నారు. ఆరోజు పరిటాల రవీంద్ర జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో స్థానిక సంస్థల్ని ఏకగ్రీవం చేశారని.. అదే స్ఫూర్తితో మనం కూడా ఏకగ్రీవం దిశగా పని చేయాలని సూచించారు...

## రాప్తాడులో మళ్లీ అభివృద్ధి, సంక్షేమం కనిపిస్తోంది

గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో రాప్తాడు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం అన్నది మచ్చుకైనా కనిపించలేదన్నారు. పైగా వచ్చిన పరిశ్రమలు వెళ్లగొట్టి.. భూములు కాజేస్తూ.. పాలన సాగించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు వివరించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ ఒక నెలకు 47వేల 186మందికి, సుమారుగా 21 కోట్ల 9లక్ష రూపాయలు పంపిణీ ఇస్తున్నామన్నారు. ఎస్.ఆర్.ఈ.జీ.ఎస్ నిధులు ద్వారా 42 కిలోమీటర్లు సి.సి.రోడ్లు నిర్మాణం, 108 కిలోమీటర్లు బి.టి.రోడ్లు నిర్మాణాలు మొత్తం వంద కోట్ల వరకు ఖర్చు చేసినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి సహాయనిధి సీఎంఆర్ఎఫ్ కింద ఇంతవరకు 269 లబ్దిదారులకు గాను 2 కోట్ల 60 లక్షలు పంపిణీ చేశామని.. ఎల్ఓసీ కింద ముగ్గురికి 11 లక్షల 25 వేల మంజూరు చేసినట్టు తెలిపారు. కార్బన్ నీటీ, తోపుదుర్తి, గొరిదిండ్ల, ముత్తవకుంట్ల గ్రామాల్లో 4 కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ ల నిర్మాణం, వందల సంఖ్యలో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, డ్రిప్ స్ప్రింక్లర్లు 10ఎకరాల లోపు పొలం ఉన్న రైతులకు వచ్చేలా చేశామన్నారు. మరోవైపు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్నీ నెరవేరుస్తున్నట్టు చెప్పారు. మొదటి సంతకమే మెగా డీఎస్సీ పైన పెట్టారు.. 16 వేలకు పైగా టీచర్ పోస్టులు,రాష్ట్రంలో 200 అన్న క్యాంటీన్లు, ప్రజల ఆస్తిని కాజేసే విధంగా తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేశామన్నారు. వచ్చే నెలలో అన్నదాత సుఖీభవ కింద ప్రతి రైతుకు 20వేల రూపాయల ఆర్థిక సాయం, ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా.. అందరికీ అమ్మకు వందనం కింద 15 వేల రూపాయలు ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు. దీంతో పాటు నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలైన జీడిపల్లి - పేరూరు ప్రాజెక్టు, అనంతపురం రూరల్ పరిధిలోని నడిమివంకకు రక్షణ గోడ, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలలో ఈహసిల్దార్, హౌసింగ్ నిర్మాణంలో రాక్రీట్ సంస్థ పేరుతో మాజీ ఎమ్మెల్యే తోపు చేసిన అక్రమాలపై విచారణ వేగవంతం, కనగానపల్లి మండలంలో సోలార్ మరియు పవన విద్యుత్ పరిశ్రమలు రామగిరి బంగారు గనులను తెరిపించడం, జాకీ పరిశ్రమ వంటి 22అంశాలపై ప్రవేశపెట్టిన తీర్మానాలను ఆమోదించారు. వీటిని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు..

## పరిటాల రవి స్ఫూర్తితో పని చేయండి..
## అధ్యక్షుడు, అబ్జర్వర్

అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ పేరు చెబితే ఎక్కడైనా గుర్తొచ్చేది పరిటాల రవీంద్ర అని.. ఆయన ఒక బ్రాండ్ గా మారారని హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు అంజినప్ప, రాప్తాడు నియోజకవర్గ అబ్జర్వర్ కృష్ణమ్మ అన్నారు. ఆయన ఏవిధంగా ఆ రోజు కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొని నిలబడ్డారో.. మనం కూడా ఆయన స్ఫూర్తితో పని చేయాలన్నారు. ప్రభుత్వం ఇప్పటికే అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందని వాటిన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మినీ మహానాడు అంటేనే మనకు ఒక పండుగ లాంటిదని.. ఈ పండుగ వాతావరణంలోనే మనం తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్ లో అమలు చేసే విధంగా పని చేయాలని సూచించారు. భవిష్యత్ వైసీపీ నుంచి రాష్ట్రానికి శాశ్వతంగా విముక్తి కల్పించే దిశగా కార్యకర్తలు పని చేయాలన్నారు. పార్టీలో కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందని.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కార్యకర్తల సంక్షేమం గురించే ఆలోచిస్తున్నారని వారు స్పష్టం చేశారు.

# రాత్రిపూట/పగటి పూట దొంగతనాలకు పాల్పడిన పేరు మోసిన
# ముగ్గురు అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్ట్ చేసిన అన్నమయ్య జిల్లా పోలీసులు.

దాదాపు 1 కేజీ బంగారం, విలువ కోటి రూపాయలు.
3కేజీల వెండి, విలువ దాదాపు 3 లక్షల రూపాయలు.
1 లక్షా 40 వేల రూపాయల నగదు, 2 ద్విచక్ర వాహనాలు మరియు 1 ఆటో స్వాధీనం.
కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన పోలీసు అధికారులను, మరియు సిబ్బందిని అభినందించిన అన్నమయ్య జిల్లా ఎస్పీ



అన్నమయ్య జిల్లా (కదిలించే వార్త) మే 22: విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ శ్రీ.వి.విద్యాసాగర్ నాయుడు. క్రైమ్ నెంబర్: మున్ముందు ముద్దాయిల పేర్లు వివరాలు (1) తోట శివ కుమార్, అలియాస్ శివ భవాని, వయస్సు:33 సం॥, తండ్రి: లేట్ వెంకట సత్యనారాయణ, స్వగ్రామం: లక్ష్మవరం గ్రామం, గొరవరం పంచాయతీ, కోయలగూడెం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ప్రస్తుతం: ఎర్రగడ్డ కాలనీ, గాజువాక, విశాఖపట్టణం జిల్లా. (2) జెట్టి సుబ్రహ్మణ్యం ఏ సుబ్బు, వయస్సు:27 సం॥, తండ్రి: కుమారస్వామి, కులము: మాల, స్వగ్రామం: మొరవానిపల్లె గ్రామం, పులిచెర్ల మండలం, చిత్తూరు జిల్లా. ప్రస్తుతం: డో.నెం.1/179, భవాని నగర్, తిరుపతి సిటీ మరియు జిల్లా. (3) సూరేపల్లి వెంకటేష్ ఏ వెంకి, వయస్సు:21 సం॥, తండ్రి: గంగయ్య, కులము: మాల, స్వగ్రామం: మద్దవరంపోడు గ్రామం, రైల్వే కోడూరు మండలం, అన్నమయ్య జిల్లా. అరెస్ట్ తేదీ, సమయం, స్థలం వివరాలు: తేది: 21.05.2025 వ తేదీన సాయంత్రం 7 గంటలకు రాజంపేట మండలం ఊటుకూరు గ్రామం సంజీవరాయ స్వామి దేవాలయం ముందర, ఎన్ హెచ్ 716 రోడ్డుపై అరెస్ట్ చేయడం జరిగింది. రికవరీ చేసిన చోరీ సొత్తు మొత్తం విలువ సుమారు రూ. 1 కోటి రూపాయలు. ఇంకా మిగతా బంగారాన్ని ఫైనాన్స్ కంపెనీ వద్ద, మరియు ఇతర వ్యక్తుల వద్ద రికవరీ చేయాల్సి ఉంది. (1) సుమారు 961 గ్రాముల బంగారు ఆభరణాలు, విలువ సుమారు రూ. 1 కోటి రూపాయలు. (2) 3 కేజీల వెండి వస్తువులు, విలువ సుమారు రూ. 3 లక్షల రూపాయలు. (3) 1 లక్ష 40 వేల రూపాయల నగదు. (4) 2 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం. ముద్దాయిలు నేరాలకు పాల్పడిన కేసుల వివరాలు, మొత్తం చేసిన నేరాలు 17 నేరాల గురించి వివరములు:- గతంలో విజయవాడ, బందర్, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లిగూడెం, హనుమాన్ జంక్షన్, కోయలగూడెం, రాజమండ్రి, తుని, అనకాపల్లి, చీపురుపల్లి ప్రాంతాల్లో దొంగతనాలు చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం సుమారు 150 కేసుల్లో అరెస్ట్ అయి జైలు శిక్ష అనుభవించి, బెయిల్ పై విడుదల అయిన తోట శివ కుమార్ అను అతను, 2024 వ సంవత్సరం డిసెంబర్ 15 వ తేదీన గుంటూరు జైలు నుండి విడుదలయ్యి అనకాపల్లిలో ఉంటూ బొమ్మూరు, నక్కపల్లిలో దొంగతనాలు చేసి మరో ఇద్దరు అనుచరులు అయిన జెట్టి సుబ్రహ్మణ్యం ఏ సుబ్బు, సూరేపల్లి వెంకటేష్ ఏ వెంకి అను వారితో కలిసి తిరుపతి జిల్లాలోని తిరుపాలు, అన్నమయ్య జిల్లా లోని పీలేరు, రాయచోటి, రాజంపేట, మన్నూరు, ఒబులవారిపల్లె పోలీస్ స్టేషన్ల పరిధిలో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ గా చేసుకొని రాత్రి/పగలు కన్నపు నేరాలకు పాల్పడిన, తోట శివ కుమార్, అలియాస్ శివ భవాని మరియు అతని అనుచరులు జెట్టి సుబ్రహ్మణ్యం ఏ సుబ్బు, సూరేపల్లి వెంకటేష్ ఏ వెంకి అనువారిని ఈ దినం అనగా 21.05.2025 వ తేదీన 7 గంటలకు మన్నూరు 331(3), 305 కేసులో రాజంపేట మండలం, ఊటుకూరు గ్రామం, సంజీవరాయస్వామి దేవాలయం ముందర 716 రోడ్డుపై అరెస్టు చేయడమైనది.

## ముద్దాయిలు నేరము చేసిన విధానం.

1 ముద్దాయి తోట శివ కుమార్ అను అతను గుంటూరు జైలులో ఉండగా, గంజాయి కేసులో అరెస్టు అయి గుంటూరు జైలుకు వెళ్ళిన 2. ముద్దాయి జెట్టి సుబ్రహ్మణ్యం అతని భార్య దేవిలు 1 ముద్దాయి తోట శివ కుమార్ కి పరిచయం అయినారు. జైలులో ఉండగా 1 ముద్దాయి తోట శివ కుమార్ మరియు 2.ముద్దాయి జెట్టి సుబ్రహ్మణ్యం ఏ సుబ్బు ఒకరికొకరు వారి ఫోన్ నెంబర్లు ఇచ్చుకొన్నారు. అంతట 1 ముద్దాయి తోట శివ కుమార్ 2024 వ సంవత్సరం డిసెంబర్ నెలలో జైలు నుండి విడుదల అయిన తరువాత 2.ముద్దాయి జెట్టి సుబ్రహ్మణ్యం ఏ సుబ్బు అను అతను 1 ముద్దాయి తోట శివ కుమార్ ను తిరుపతికి పిలిపించగా, అక్కడ 2.ముద్దాయి జెట్టి సుబ్రహ్మణ్యం ఏ సుబ్బు యొక్క మొదటి భార్య దేవి అను ఆమె ద్వారా, దేవి యొక్క రెండవ భర్త సూరేపల్లి వెంకటేష్ 3 అను అతను 1 ముద్దాయి తోట శివ కుమార్ కి పరిచయం అయినారు. అంతట 3 ముద్దాయిలు తిరుపాలు, పీలేరు, రాయచోటి పోలీస్ స్టేషన్ల పరిధిలో కన్నపు నేరాలకు పాల్పడిన తరువాత అక్కడ వారిపై పోలీసుల నిఘా ఎక్కువ కావడంతో 2025 వ సంవత్సరం ఏప్రిల్ నెల చివరి వారంలో 3.ముద్దాయి సూరేపల్లి వెంకటేష్ అను అతను 1 ముద్దాయి తోట శివ కుమార్ మరియు అతని భార్య వరలక్ష్మిని రాజంపేటకి పిలిపించి వారికి రాజంపేట టౌన్ బంగ్లా వీధిలో ఒక ఇల్లు బాడుగకు తీయించినాడు. అంతట 3 ముద్దాయిలు కలిసి అన్నమయ్య జిల్లాలోని రాజంపేట టౌన్, ఒబులవారిపల్లె, మన్నూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రి/పగలు కన్నపు నేరాలకు పాల్పడినారు.

## అభినందనలు

ఈ కేసులో ఉత్తమ ప్రతిభ కనపరిచిన రాజంపేట సబ్ డివిజన్ పోలీస్ అధికారి, ఏఎస్పీ, శ్రీ.మనోజ్ రామనాథ్ హెగ్డే ఐపీఎస్ గారిని, మన్నూరు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ యస్.కులాయప్ప, సిసిఎస్ ఇన్స్పెక్టర్ యం.చంద్రశేఖర్, ఒబులవారిపల్లి ఎస్ఐ పి.మహేష్, సిసిఎస్ ఎస్ఐ రామకృష్ణారెడ్డి, పోలీసు సిబ్బందిని, అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ.వి. విద్యాసాగర్ నాయుడు అభినందించారు. దొంగతనాలపై జిల్లా ప్రజలకు ఎస్పీ గారు పలు సలహాలు, సూచనలు, జాగ్రత్తలు తెలిపారు గుర్తు తెలియని వ్యక్తులకు మీ ఇంటిని అద్దెకు ఇవ్వకండి – జిల్లా ఎస్పీ. ఇల్లు అద్దెకు ఇచ్చేటప్పుడు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేరాలు, ముఖ్యంగా మోసాలు, దొంగతనాలు లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలను నివారించవచ్చునని. మీరు ఎవరికైనా ఇల్లు అద్దెకు ఇచ్చే ముందు వారి నేపథ్యాన్ని సరిగ్గా ధృవీకరించుకోవాలన్నారు. వారి ప్రభుత్వ గుర్తింపు కార్డులు (ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్ మొదలైనవి) తనిఖీ చేయాలి. గతంలో వారు ఎక్కడ నివసించారు, అక్కడ వారి ప్రవర్తన ఎలా ఉందనే దానిపై తెలుసుకోవడం మంచిది. కొన్ని సందర్భాల్లో, అద్దెదారుల వివరాలను స్థానిక పోలీసు స్టేషన్లో నమోదు చేయమని లేదా పోలీసు వెరిఫికేషన్ చేయించుకోవాలని అధికారులు సిఫార్సు చేస్తారు. వారు ఏ పని చేస్తారో తెలుసుకోవడం వల్ల వారి ఆర్థిక స్థిరత్వం గురించి ఒక అవగాహన వస్తుంది. ఈ హెచ్చరిక ముఖ్యంగా గృహ యజమానులకు నేరాల బారిన పడకుండా వారి ఆస్తిని, భద్రతను కాపాడుకోవడానికి సహాయపడుతుంది. ఊర్లకు వెళ్లే ముందు స్థానిక పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

## తప్పుడు సమాచారాన్ని పోలీస్ స్టేషన్లలో నమోదు చేయకండి.

దొంగతనాలు జరిగినప్పుడు కొంతమంది ప్రజలు బంగారం, డబ్బులు పోయాయని తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని, అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు హెచ్చరించారు. ప్రజలు నిజాయితీగా ఉండాలని, తప్పుడు ఫిర్యాదులతో పోలీసుల సమయాన్ని వృథా చేయవద్దని ఆయన సూచించారు. ఇలాంటి చర్యలు నిజమైన బాధితులకు సహాయం చేయడంలో జాప్యానికి కారణమవుతాయని కూడా ఆయన అన్నారు. దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ గారు సూచించారు. దొంగల బారిన పడకుండా



ఉండటానికి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు దొంగతనాలు జరిగినప్పుడు పోలీసులకు సహకరించాల్సిన పద్ధతుల గురించి ఆయన వివరించారు. ఇల్లు వదిలి వెళ్ళే ముందు అన్ని తలుపులు, కిటికీలు సరిగ్గా మూసి, తాళాలు వేశారని నిర్ధారించుకోండి. మీరు ఇంట్లో లేనప్పుడు మీ ఆభరణాలు, నగదు వంటి విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా, బ్యాంక్ లాకర్లలో భద్రపరచడం ఉత్తమం. మీరు ఊరెళ్ళేటప్పుడు, మీ ఇంటిని చూసుకోమని మీ నమ్మకమైన బంధువులు లేదా స్నేహితులకు చెప్పండి. ఇంట్లో లైట్లు ఆన్ చేసి ఉంచడం లేదా టైమర్ పెట్టుకోవడం ద్వారా ఇంట్లో ఎవరైనా ఉన్నట్లు దొంగలకు అనిపిస్తుంది. అపరిచితులు మీ ఇంటి చుట్టూ తిరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. మీ ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించిన వెంటనే వస్తువులను కదపకుండా, వెంటనే డైల్ 100 కు ఫోన్ చేసి, దగ్గరలోని పోలీస్ స్టేషన్ కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వండి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్న తర్వాత వారికి పూర్తిగా సహకరించండి. దొంగతనం జరిగిన తీరు, ఏ వస్తువులు పోయాయి వంటి వివరాలను స్పష్టంగా తెలియజేయండి. దొంగతనం జరిగిన తర్వాత సాక్ష్యాలు చెరిపివేయకుండా జాగ్రత్తపడండి. మీ ఇంటి పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తుంటే లేదా కొత్తగా ఎవరైనా కనబడితే పోలీసులకు తెలియజేయండి. సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం దొంగతనాలను అరికట్టడంలో సహాయపడుతుంది. మీ పరిసరాల్లోని అందరూ కలిసి వాచ్ మెన్ ను పెట్టుకోవడం వల్ల దొంగతనాలను నివారించవచ్చు. సోషల్ మీడియాలో మీరు దూర ప్రయాణాలు చేస్తున్నారని లేదా మీ ఇల్లు ఖాళీగా ఉందని పోస్ట్ చేయవద్దు. ఎస్పీ ప్రజలకు ఇచ్చిన ఈ సూచనలను పాటించడం ద్వారా దొంగతనాల బారిన పడకుండా ఉండవచ్చని తెలియజేశారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించి, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు.

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి.

## జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్



(కదిలించే వార్త) మే 22: పుట్టపర్తి,మే 22 : జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పరిశ్రమల స్థాపన తోనే జిల్లా ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ టి.ఎస్. చేతన్ స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక మరియు ఎక్స్పోర్ట్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇప్పటివరకు పరిశ్రమల స్థాపనకు వచ్చిన సింగల్ డెస్క్ పోర్టల్ అనుమతులపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో జిల్లా ఆర్థిక అభివృద్ధికి ఆయు పట్టు అయినా పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. కొత్తగా పారిశ్రామిక రంగంలోనికి రావాలనుకునే వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లు పరిశ్రమల శాఖ సమన్వయ సహకారాలు అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో నూతనంగా పరిశ్రమల స్థాపనకు సంబంధించిన 21 యూనిట్లను నిర్దేశించిన గడువులోగా అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు. అలాగే పరిశ్రమ స్థాపనకు రాయితీలకు సంబంధించి పెట్టుబడి సబ్సిడీ, విద్యుత్ రాయితీ, వడ్డీ రాయితీలకు సంబంధించి 37 దరఖాస్తులకు రాయితీ మంజూరు చేశారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరెక్టర్ మొహమ్మద్ షఫీ విస్తరణ అధికారులు సంజీవరాజు,ఓబులేసు, దుర్గేష్, డిపిఓ సమత, జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విష్ణు స్వామి ఆధ్వర్యంలో హనుమజ్జయంతి పూజ, సుందరకాండ ప్రవచనం, హెూమం, భజన లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్న మాజీ ఆలయ చైర్మన్ బాణా నాగేశ్వర్ రెడ్డి





తాడిపత్రి (కదిలించే వార్త) మే 22:అనంతపురం జిల్లా తాడిపత్రి పటంలోని కడప రోడ్డు లో విష్ణు స్వామి పర్యవేక్షణలో వెలిచిన శ్రీ యోగి వేమన ఆశ్రమంలో హనుమజ్జయంతి పూజ, భజన మరియు సుందరకాండ ప్రవచనం హెూమము కార్యక్రమాల ఆహ్వాన మేరకు హాజరైన మాజీ ఆలయ చైర్మన్ బాణా నాగేశ్వర్ రెడ్డి ముందుగా ఆయన హనుమజ్జయంతి పూజలో స్వామివారిని దర్శించుకుని విష్ణు స్వామి సహస్ర హస్త్రాలతో కంకణం కట్టించుకుని స్వామివారి ఆశీస్సులు తీసుకుని తీర్థ ప్రసాదాలు అన్న ప్రసాదాలు స్వీకరించడం జరిగినది.

## హనుమాన్ జయంతి సందర్బంగా అన్నదాన కార్యక్రమం



శింగనమల (కదిలించే వార్త) మే 22: శింగనమల మండలం మరవకొమ్మ క్రాసులో వెలసిన అతి పురాతనమైన శ్రీ మరవ ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి మహెూత్సవంను భక్తబృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటల నుండి ఆంజనేయ స్వామి వారికీ ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు .పూజలలో ఏంపీడీ భాస్కర్ ,సీహెచ్ సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహిత్ ,డాక్టర్ ఆంజనేయులు నాయక్,మరియు వివిధశాఖల అధికారులు,మండల ప్రజలు,స్వామి వారి భక్తాదులు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.అనంతరం పూజలలో పాల్గొన్న భక్తాదులకు తీర్థ ప్రసాదాలు అందించిదంతో పాటు ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



## చెత్తను బయట వేసిన వారిపై శానిటేషన్ సెక్రటరీ ద్వారా అపరాధ రసమును విధించడమైనది.







అనంతపురం (కదిలించే వార్త) మే 22:అనంతపురం నగరపాలక సంస్థ పరిధి యందు నగరంలో వ్యర్థపదార్థాలను అనగా తడి చెత్త పొడి చెత్త వేరు చేసి డస్ట్ బిన్ నందు వేసి ఇంటి ముందుకు వచ్చిన నగరపాలక సంస్థ వాహనమనకు విడివిడిగా చేసి అందించవలెను అలా వేయకుండా బహిరంగ ప్రదేశాలలో వేసిన వారిపై ఆంధ్రప్రదేశ్ ప్రజారోగ్య చట్టం ప్రకారం ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్స్ రూల్స్-2016 ప్రకారం అపరాధ రుసుము విధించబడును. నగరంలో నివాసముంటున్న ప్రజలు అలాగే కమర్షియల్ ఏరియాస్ లో ఉన్న షాప్ యజమానులు కూడా నగరపాల సంస్థకు సహకరించవలసినదిగా కోరడమైనది. సదరు విషయము పై నగరపాలక సంస్థ కమిషనర్ పర్యవేక్షణలో తేదీ 22-05-2025 న తనిఖీలు చేసి ఉన్నారు అందులో భాగంగా ఓల్డ్ టౌన్ నందు తాడపత్రి రోడ్ లో ఉన్న వివిధ షాపుల వారు చెత్తను బయట వేసిన వారిపై శానిటేషన్ సెక్రటరీ ద్వారా అపరాధ ౕసమును 73525/- విధించడమైనది. కావున అనంతపురంను మన అనంత సుందర అనంత గా తీర్చుదిద్దుకోవలసిన గాను నగరంలో ప్రజలు అందరు ప్రతి ఒక్కరు సహకరించవలెను.


## వ్యాధుల నివారణ యోగ తో సాధ్యం “డి యం హెచ్ ఓ డా ఈ బి దేవి







అనంతపురం (కదిలించే వార్త) మే 22: అంతర్జాతీయ యోగ దినోస్తావం “యోగాంధ్ర “కార్యక్రమంలో భాగంగా వివేకానంద యోగ కేంద్రము వారీ సహకారంతో ఆర్ట్స్ కాలేజ్ అనంతపురం నందు యోగ కార్యక్రమం ఉదయం 6 గంటల నుండి 7 గంటల వరకు నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగాజిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి , యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి ఐన డా ఈ బి దేవి మాట్లాడుతూ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వల ఆదేశాలు యోగ ఫర్ వన్ ఎర్త్ , వన్ హెల్త్ అన్న నినాదం తో ఈ నెల 21 తేదీ నుండి జూన్ 21 అంతర్జాతీయ యోగ దినోస్తావం వరకు జిల్లా యందు ప్రతి రోజు జిల్లా స్థాయి నుండి గ్రామస్థాయి వరకు యోగ తరగతులు వివిధ ప్రాంతాలలో నిర్వహించడం జరుగుతుందని అలాగే యోగ ద్వారా అనేక రకాల జబ్బులను ముందుగానే నివారించుకోవడం జరుగుతుందని ప్రతి ఒక్కరు ఉదయం పూట తప్పనిసరిగా ఒక గంట పాటు యోగ చేసుకోవాలని దీని వలన మానసిక మరియు శారీరక ఆరోగ్యం పొందడం జరుగుతుందని తెలిపారు . ఈ కార్యక్రమంలో ఆయుష్ జిల్లా అధికారి లాల్యా నాయక్, డా రామ్ కుమార్ , ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా పి. పద్మశ్రీ ,డి పి ఆర్ ఓ గురుస్వామి ,వివేకానంద యోగ కేంద్రం యోగ ఇన్స్ట్రక్టర్ ఆంజనేయులు , దివాకర్ ,డా లక్ష్మీనారాయణ , డెమో త్యాగరాజ్ , ఆరోగ్య బోధన అధికారి గంగాధర్ ,మొదలగువారు పాల్గొన్నారు.



# యోగా సాధనతో మానసిక ప్రశాంతత

## జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్



పుట్టపర్తి,(కదిలించే వార్త) మే 22: యోగ సాధన చేయడం వలన మానసిక,శారీరక ప్రశాంతత కలుగుతుందని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి గణేష్ సర్కిల్ సమీపంలో మైనార్టీ సాదిఖన నందు గురువారం రెండవ రోజు జిల్లా కలెక్టర్ యోగా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ప్రతిరోజు యోగ చేయడం వలన మనిషిలో అనేక లాభాలు కలుగుతాయన్నారు. మానసిక,శారీరక ప్రశాంతత కలిగి రోజంతా ఉత్సాహంగా గడపవచ్చునన్నారు. ప్రతి ఒక్కరు యోగ కార్యక్రమాలలో విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ నెల 22 నుంచి 27 వరకు మండల స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు, అవసరమైన శిక్షణ, మాసోత్సవాల ప్రాధాన్యతను వివరించాలన్నారు. 28 నుంచి జూన్ 3 వరకు మండల స్థాయిలో, 4 నుంచి 6 వరకు గ్రామ స్థాయిలో ప్రజలకు శిక్షణ ఇవ్వాలన్నారు. 18, 9 తేదీల్లో యోగాసన పోటీలు నిర్వహించి విజేతలకు ధ్రువీకరణ పత్రాలు ప్రదానం చేయాలని ప్రత్యేక ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్. యోగ గురువులు తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం పట్టణంలో ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

### బీజేపీ నేతల నాయకత్వంలో విశేష ఉత్సాహం.



(కదిలించే వార్త) మే 22: ధర్మవరం, మే 22: పవిత్ర హనుమాన్ జయంతి సందర్భంగా ధర్మవరం పట్టణంలో ఘనంగా హనుమాన్ శోభాయాత్ర నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఎన్డీఏ కార్యాలయం వద్ద నుండి పేదింటి ఆంజనేయస్వామి ఆలయం దాకా మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భక్తిశ్రద్ధలతో ర్యాలీగా పాల్గొన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని పట్టణ వ్యాప్తంగా ఆంజనేయుని జయజయకారాలతో మార్మోగింది. ర్యాలీ సందర్భంగా జాతీయ జెండాలతో పాటు భగవద్ధ్వజాలు, సంగీత బృందాలు, ధ్వజపత్రాలతో శోభాయాత్రకు ప్రత్యేక ఆకర్షణ కలిగించాయి. ఈ సందర్భంగా మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, మాట్లాడుతూ, హనుమంతుడు భక్తి, శక్తి, నిస్వార్థ సేవకు ప్రతీక. అటువంటి ఆదర్శాలను పాటిస్తూ ధర్మవరం ప్రజల కోసం మనం పని చేయాలని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసం, అనుసరణతో ధర్మవరం పట్టణాన్ని సాంస్కృతికంగా, అభివృద్ధి పరంగా ముందుకు తీసు కెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమం విజయ వంతం కావడంలో పాల్గొన్న ప్రతి కార్యకర్తకు, పోలీసు శాఖకు, ప్రజలకు బీజేపీ కృతజ్ఞతలు తెలుపుతుంది. శోభాయాత్రలో బీజేపీ పట్టణ అధ్యక్షులు చంద్ర, రూరల్ అధ్యక్షులు గొట్లూరు చంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబ్లేష్, బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, బిల్లే శ్రీనివాసులు, గిరిరాజ్ నగేష్, జింక రామాంజనేయులు, పోతుకుంట రాజు, బోయ పెద్ద లింగమయ్య బ్రదర్స్, పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, యువమోర్చా సభ్యులు, మహిళా మోర్చా కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## వివాహ మహెూత్సవానికి హాజరైన ఉమామహేశ్వర నాయుడు, తిప్పేస్వామి



కళ్యాణదుర్గం (కదిలించే వార్త) మే 22: అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండలం పిల్లలపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు రామయ్య ఆహ్వానం మేరకు వారి కుమారుడు నారాయణస్వామి వెడ్స్ హర్షిణి వివాహ మహెూత్సవానికి కన్యాదాత స్వగృహంలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన కళ్యాణదుర్గం నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మాదినేని ఉమామహేశ్వర నాయుడు, బోయ తిప్పేస్వామి ఈ కార్యక్రమంలో బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ తలారి గోవిందప్ప,ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు గంగాధర్, పంచాయతీరాజ్ జిల్లా కార్యదర్శి గోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడగట్ట నారాయణ,జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తలారి సత్తి, మాజీ ఎంపీపీ మహాదేవ్,మాజీ డీలర్ హనుమంతరెడ్డి, అంజి, ఆదిమూలం మంజు, వేలూరు అనిల్, తంజిల్ భాషా నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి రాతి దేవస్థానంలో హనుమజ్జయంతి



కసాపురం (కదిలించే వార్త) మే 22: కసాపురం దేవస్థానంలో శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ప్రసన్నాంజనేయ స్వామి వారికి పంచాఅమృతముతో అభిషేకం నాగవల్లి దళార్చన సింధూరార్చన పుష్పాలంకరణతో జరిగినది ఆలయ అర్చకులు చెన్నకేశవ స్వామి రాకేశ్ స్వామి ధర్మకర్తలు తలారి పరుశురాముడు శకుంతలమ్మ దంపతులు చేతుల మీదుగా మహా వైభవంగా పూజలు జరిగినవి అలాగే పెద్ద సంఖ్యలో భక్తులు రావడం ప్రభుత్వ అధికారులు గుంటకల్ ఎమ్మార్వో రమాదేవి వన్ టౌన్ సిఐ మనోహర్ రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ కసాపురం ఎస్సై వెంకటస్వామి గుత్తి ఎస్సై సురేష్ మరియు కానిస్టేబుల్స్ ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ స్వామివారి సేవకు రావడం భక్తిశ్రద్ధలతో ప్రజలు మహిళలు పాల్గొనడం జరిగింది అనంతరం ఆలయ ధర్మకర్త తలారి పరుశురాముడు మాట్లాడుతూ ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ హనుమంతుని జన్మదినోత్సవం వైశాఖ శుద్ధ దశమి నాడు జరుపు కుంటూ ఈ రోజున హనుమాన్ భక్తులు రోజంతా ఉపవాసం ఉండి హనుమాన్ చాలీసా పారాయణం రామనామ జపం చేస్తారు హనుమంతుని జన్మవృత్తాంతం శివమహాపురాణం రామాయణం మొదలైన గ్రంథాలలో అనేకానేక గాధలతో వివరించబడి ఉంది హిందూ పురాణా కథల ప్రకారం పుంజికస్థల అనే అప్సరస అంజన అనే వానర కాంతగా జన్మించెను కేసరి అనే వానరవీరుడు ఆమెను పెళ్లాడెను వారు సంతానం కొరకు భక్తితో శివుని ఆరాధించి అప్పుడు వాయుదేవుడు శివుని తేజమును పండురూపంలో అంజన్న కొసగెను అంజన్నకు జన్మనిచ్చిన సుతుడే ఆంజనేయుడు కేసరి నందనుడని వాయదేవుని అనుగ్రహంతో జన్మించినందున వాయు సుతుడని కూడా అంటారు ఆలయ అర్చకులు మాట్లాడుతూ ఈరోజు ప్రసన్నాంజనేయ స్వామి జయంతి కనుల పండుగ జరగడం చాలా సంతోషం ప్రతి నిత్యము దేవస్థానంలో విశేష విశిష్ట అయిన పూజా కార్యక్రమలు జరుగుతూ ఉండడం భక్తుల పెద్ద సంఖ్యలో దేవస్థానానికి వచ్చే స్వామి అమ్మ వారి ఆశీస్సులు పొందడం ప్రతిరోజు నిత్య అన్న ప్రసాద వితరణ ద్వారా భక్తులకు ప్రజలకు అన్న ప్రసాదం ఉండడం చాలా శుభ పరిణామంగా భావిస్తూ పెద్ద సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదం స్వీకరించడం జరిగినది మీరు కోరిన కోరికలు తీర్చే స్వామి అమ్మవారిని దర్శించి మీకు అనేక రకాలైన సమస్యలు బాధలను తొలగించుకోవాలని అష్ట ఆయురారోగ్యాలు పొందాలని సుఖ సంతోషాలు పొందాలని అన్నారు ఈ కార్యక్రమంలో పట్టణ పల్లెల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయ కమిటీ సభ్యులు శంకర్ విఆర్ఓ కృష్ణ వెంకటేష్ తలారి రామ్ చరణ్ తేజ సంజీవ రాయుడు మురళి శ్రావణి పాల్గొనడం జరిగినది.



## కాణిపాక వినాయక దేవస్థానంలో ఉమ్మడి అనంతపురము జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ కుటుంబం



కాణిపాకం (కదిలించే వార్త) మే 22: హనుమాన్ జయంతి పర్వదిన్నాన్ని పుర్కరించుకుని చిత్తూరు జిల్లా లోని, కాణిపాక వినాయక దేవస్థానంలో ఉమ్మడి అనంతపురము జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ కుటుంబ సమేతంగా స్వయంభు విఘ్నేశ్వరుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# నిత్యం యోగాసనాలు వేస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలి.

## డిఎం అండ్ హెచ్ ఓ డా.ఈ బి దేవి




అనంతపురం, (కదిలించే వార్త) మే 22: వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ నిత్యం యోగాసనాలు వేస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలనిడిఎం అండ్ హెచ్ ఓ డా.ఈ బి దేవి తెలిపారు. గురువారం ఉదయంఅనంతపురం నగరంలోని ఆర్ట్స్ కాలేజీ వివేకానంద యోగా సెంటర్లో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా డిఎం అండ్ హెచ్ ఓ డా. ఈ బి దేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్వో మాట్లాడుతూ వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ నిత్యం యోగాసనాలు వేస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 21న విశాఖపట్నంలో నిర్వహించే కార్యక్రమంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొంటారన్నారు.ఇందులో భాగంగా మే 21 నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర 2025 వరకు నెలరోజుల పాటు క్యాంపెయిన్ ను నిర్వహించడం జరుగుతోందన్నారు. యోగా కార్యక్రమాల్లో పాల్గొనేవారందరు యోగయాప్ లో పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యోగా గురువు వై.ఆంజనేయులు ఆసనాల ప్రాముఖ్యత వివరిస్తూ యోగ ఆసనాలు వేయించారు. వివేకానంద యోగ ఆర్ట్స్ కాలేజీ సెంటర్ లో ప్రతిరోజు ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నట్లు వై. ఆంజనేయులు తెలిపారు. ఆసక్తిగలవారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఐపిఆర్ఓ పి .గురుస్వామి శెట్టి, ఆయుష్ జిల్లా అధికారి డా. రామ్ కుమార్, డి ఆర్ డి ఏ పి డి శైలజ, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. పద్మ శ్రీ,, మెడికల్ సిబ్బంది, యోగ గురువులు దివాకర్, డా. శ్రీనివాసులు , వివేకానంద యోగ ఆర్ట్స్ కాలేజ్ సెంటర్ యోగ సాధకులు , జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్



అనంతపురం,(కదిలించే వార్త) మే 22: నగరంలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అనంతపురం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్.సి.ఎ.పి)పై సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం కింద పురోగతిలో ఉన్న పనులు వేగంగా చేపట్టాలన్నారు. నగరంలోని జిసిహెచ్ లో చేపడుతున్న మల్టీ లెవెల్ పార్కింగ్ ను పది రోజుల్లోపు పూర్తి చేయాలని, రాంనగర్ బ్రిడ్జి దగ్గర గ్రీనరీ అభివృద్ధి పనులు, ఇతర పనులను పెండింగ్ లేకుండా త్వరగా పూర్తి చేయడంపై అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ నుంచి నగర పాలక సంస్థ కమిషనర్ బాలరాజు, ఎస్ఈ చంద్రశేఖర్, డిటిసి వీర్రాజు, నగర పాలక సంస్థ ఈఈ షాకీర్ హుస్సేనీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అనలిస్ట్, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



అనంతపురం అర్బన్, (కదిలించే వార్త) మే 22: అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, శ్రీలక్ష్మి దంపతులకు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం ఎమ్మెల్యే పెళ్లి రోజు అయినప్పటికీ జిల్లా మహానాడు, హనుమజ్జయంతి ఇతర కార్యక్రమాల్లో బిజీ బిజీగా గడిపారు. ఆయన నివాసానికి పెద్ద ఎత్తున నాయకులు తరలివచ్చి పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. దీంతో సందడి వాతావరణం కనిపించింది. శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చిన నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే దగ్గుపాటి ధన్యవాదాలు తెలియజేశారు.

## ముస్లిం మైనార్టీల సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం

### ముస్లింల కోసం ఇప్పటికే బడ్జెట్ లో 4376 కోట్ల రూపాయలు కేటాయింపు

### జిల్లా మహానాడు కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ జిరాయితీ గౌస్ మోద్దిన్




అనంతపురం అర్బన్, (కదిలించే వార్త) మే 22: ముస్లింల సంక్షేమాని పెద్ద పీట వేస్తున్న ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అని టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిరాయితీ గౌస్ మోద్దిన్ తెలిపారు. అనంతపురం జరిగిన జిల్లా మహానాడు కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీ, టిడిపి నాయకులతో కలసి గౌస్ మోద్దిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌస్ మోద్దిన్ మాట్లాడుతూ దేశంలో ముస్లింల అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చిందన్నారు. వైసీపీ హయంలోనే మైనార్టీలకు తీవ్ర అన్యాయం చేసిందని, హామీల పేరుతో మోసం చేసిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ లు ఎప్పుడూ మైనార్టీల వెంట ఉన్నారని పేర్కొన్నారు.

## మనషుల ప్రాణాలతో రాజకీయాలు చేయవద్దు

### ఎమ్మెల్యే దగ్గుపాటి..వెంకటేష్ కు అన్ని విధాలుగా అండగా ఉన్నారు

### ఆర్థిక ఇబ్బందులతోనే టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటేష్ ఆత్మహత్యాయత్నం

### స్పష్టం చేసిన వెంకటేష్ సోదరుడు సాకే శేఖర్

### ఎవరి స్వార్థం కోసం మీరు వీడియోలు చేస్తున్నారని ఆగ్రహం



అనంతపురం అర్బన్, (కదిలించే వార్త) మే 22: మనుషుల ప్రాణాలతో రాజకీయ చేయవద్దని కొందరు నాయకులకు ఇటీవల ఆత్మహత్యాయత్నం చేసిన టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటేష్ సోదరుడు సాకే శేఖర్ చురక లంటించారు. మంగళవారం రోజు జరిగిన అనంతపురం మినీ మహానాడు కార్యక్రమంలో వెంకటేష్ విష ద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంటనే స్పందించి ఆయన్ని మొదటి అనంతపురం ప్రభుత్వాసుపత్రికి ఆ తర్వాత సవేరా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సల కోసం బెంగళూరులోని ఒక కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. ఇందుకు సంబంధించి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నీ దగ్గరుండి చూసుకుంటున్నారు. ఆసుపత్రి ఖర్చులన్నీ భరించడంతో పాటు కుటుంబ సభ్యులను ఎప్పటికప్పుడు పరామర్శిస్తున్నారు. అయితే వెంకటేష్ చావుబతుకుల్లో ఉన్నాడని ఆయన్ని ఎవరూ పట్టించుకోలేదని వైద్య ఖర్చులు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారని కొందరు సోషియల్ మీడియా వేదికగా దుష్ప్రచారాలు మొదలు పెట్టారు. దీనిపై వెంకటేష్ సోదరుడు సాకే శేఖర్ తీవ్రంగా స్పందించారు. ఇందుకు సంబంధించి వీడియోలు కూడా విడుదల చేశారు. తన సోదరుడు ఆర్థిక ఇబ్బందుల కారణంగానే ఆత్మహత్యాయత్నం చేశాడని.. ఎవర్నో ఇబ్బందులకు గురి చేయాలని కానీ.. పార్టీకి నష్టం చేయాలని కాదన్నారు. ఈ సంఘటన జరిగినప్పటి నుంచి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తమకు అండగా నిలిచారన్నారు. ఆసుపత్రికి ఖర్చులన్నీ భరించడంతో పాటు మాకు బెంగళూరులో తిండి, ఉండటానికి సౌకర్యాలు కల్పించారన్నారు. ఇప్పటికే ఇందుకు రెండున్నర లక్షల వరకు ఖర్చు చేశారన్నారు. కానీ కొందరు మాత్రం దీనికి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. మీరు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో నడుస్తున్న పార్టీకి చెడ్డ పేరు తీసుకురావాలని ఉంటే బయటకు వెళ్లిపోవచ్చు కానీ.. ఇలాంటి చేయడం తగదన్నారు. చివరకు మనుషుల ప్రాణాలతో కూడా రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాకు అన్ని విధాలుగా అండగా ఉన్నారని.. ఆయన రుణం ఎప్పటికీ తీర్చుకోలేమని సాకే శేఖర్ అన్నారు.

## హనుమజ్జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి

### ఆంజనేయస్వామి కృపాకటాక్షలు అర్బన్ ప్రజలపై ఉండాలని ఆకాంక్ష



అనంతపురం, (కదిలించే వార్త) మే 22: అనంతపురం నగరంలో జరిగిన హనుమజ్జయంతి వేడుకల్లో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ దంపతులు పాల్గొన్నారు. గురువారం నగరంలోని 2వ రోడ్డు, కోర్టు రోడ్డులలో గల అభయాంజనేయ స్వామి దేవాలయాలకు వెళ్లారు. ఆలయ నిర్వాహకులు, పండితులు ఎమ్మెల్యే దంపతులకు వేదమంత్రాలతో స్వాగతం పలికారు. అనంతరం వారు ఆలయాల్లో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం వేద పండితులు ఎమ్మెల్యే దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి నగర ప్రజలకు హనుమాన్ జయంతి శు భాకాంక్షలు తెలియజేశారు. అర్బన్ నియోజకవర్గ ప్రజలపై ఆంజనేయస్వామి కృపా కటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు.



## మీరు జుట్టుకు ఏ హెయిర్ ఆయిల్‌ను వాడుతున్నారు..? జుట్టు స్థితిని బట్టి ఎలాంటి ఆయిల్‌ను వాడితే మంచిది..?



శిరోజాల సంరక్షణకు ప్రస్తుతం అందరూ ప్రాధాన్యతను ఇస్తున్నారు. స్త్రీలే కాదు పురుషులు కూడా తమ కురులను అందంగా మార్చుకుంటున్నారు. అయితే అన్నీ బాగానే పాటిస్తుంటారు కానీ హెయిర్ ఆయిల్ విషయంలోనే సరైన జాగ్రత్తలు తీసుకోరు. దీంతో జుట్టు సమస్యలను ఎదుర్కొంటూ ఉంటారు. అలాగే ఈ ఆయిల్ వల్ల చర్మం కూడా జిడ్డుగా మారుతుంది. ఇక కొందరు ఎప్పుడు పడితే అప్పుడే హెయిర్ ఆయిల్‌ను అప్లై చేస్తుంటారు. కానీ హెయిర్ ఆయిల్ విషయంలోనూ జాగ్రత్తలను పాటించాలి. అప్పుడే శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి. మన జుట్టుకు అన్ని ఆయిల్స్ సరిపోవు. ఎలాంటి హెయిర్ ఆయిల్ ఎవరికి మేలు చేస్తుంది.. అన్న వివరాలను తెలుసుకుని అప్పుడు ఆయిల్‌ను ఉపయోగించాలి. దీంతో మంచి ఫలితాలు రాబట్టవచ్చని బ్యూటిషియన్లు చెబుతున్నారు. ఇక ఎలాంటి ఆయిల్‌ను జుట్టుకు వాడితే ఏం జరుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.

**కొబ్బరినూనె..**

సాధారణంగా కొబ్బరినూనెను అధిక శాతం మంది జుట్టుకు వాడుతుంటారు. ఇది జుట్టు కుదుళ్ల లోపలికి కూడా వెళ్లగలదు. దీంతో శిరోజాలకు పోషణ లభిస్తుంది. కొబ్బరినూనెలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉంటాయి. దీని వల్ల తలలో ఉండే ఇన్‌ఫెక్షన్లు కూడా తగ్గుతాయి. ఇన్‌ఫెక్షన్ కారణంగా చుండ్రు సమస్యతో బాధపడేవారు కొబ్బరినూనెను వాడితే మంచి ఫలితం ఉంటుంది. ఈ నూనెలో మన జుట్టుకు అవసరం అయ్యే ఎసెన్షియల్ ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. అలాగే విటమిన్లు ఇ, కెలతోపాటు ఐరన్ కూడా లభిస్తుంది. ఇవన్నీ జుట్టుకు పోషణను అందిస్తాయి. కొబ్బరినూనెను జుట్టుకు వాడుతుంటే శిరోజాలు సుతి మెత్తగా మారుతాయి. శిరోజాల ఎదుగుదలకు కొబ్బరినూనె ఎంతో సహాయం చేస్తుంది.

**జొజొబా ఆయిల్..**

మార్కెట్‌లో మనకు జొజొబా ఆయిల్ కూడా లభిస్తుంది. జొజొబా అనే మొక్కకు చెందిన గింజల నుంచి ఈ నూనెను తీస్తారు. ఈ మొక్కలు అమెరికాలోని ఎడారుల్లో పెరుగుతాయి. ఈ విత్తనాలను డీర్ నట్స్‌అని కూడా పిలుస్తారు. అమెరికన్లు తమ జుట్టుకు ఎక్కువగా జొజొబా ఆయిల్‌ను ఉపయోగిస్తుంటారు. జుట్టు బాగా పొడిగా మారిన వారు, తరచూ తలంతా పొడిగా మారుతున్న వారు ఈ నూనెను వాడాలి. జిడ్డు చర్మం అయ్యే వారు ఈ నూనెను వాడకూడదు. ఇక శిరోజాల సంరక్షణకు ఆలివ్ ఆయిల్ కూడా ఎంతో మేలు చేస్తుంది. ఇది జుట్టును మంచి కండిషనింగ్‌లో ఉంచుతుంది. గ్రీకులు ఆలివ్ ఆయిల్‌ను అధికంగా ఉపయోగిస్తారు. జుట్టు బాగా పలుచగా ఉన్నవారు, జుట్టు బాగా రాలిపోతున్న వారు ఆలివ్ ఆయిల్‌ను వాడితే మేలు జరుగుతుంది. ఇది శిరోజాల పెరుగుదలకు కావల్సిన పోషణను అందిస్తుంది.

**ఆముదం..**

మన పెద్దలు ఎంతో పూర్వం కాలం నుంచి ఆముదాన్ని జుట్టుకు ఉపయోగిస్తున్నారు. దీని వాసన కారణంగా చాలా మంది దీన్ని జుట్టుకు ఉపయోగించరు. కానీ దీన్ని తలకు మర్దనా చేసి 2 గంటల పాటు ఉండి తలస్నానం చేయాలి. ఇలా తరచూ చేస్తుంటే శిరోజాలు నల్లగా మారుతాయి. జుట్టు ఒత్తుగా పెరిగి దృఢంగా ఉంటుంది. ఆముదంతో ఇలా మసాజ్ చేస్తుంటే తలపై ఉండే ఇన్‌ఫెక్షన్లు కూడా తగ్గుతాయి. ఆముదం జుట్టుకు పెట్టడం ఇష్టం లేని వారు ఇలా మసాజ్ చేస్తే చాలు. ఎంతో ప్రయోజనం పొందవచ్చు. అలాగే బాదం నూనె కూడా జుట్టుకు ఎంతో మేలు చేస్తుంది. ఇది జిడ్డు లేని నూనె. జిడ్డు చర్మం ఉన్నవారు ఈ నూనెను తలకు వాడాలి. ఇది జుట్టుకు అవసరం అయిన పోషకాలను అందిస్తుంది. ఈ ఆయిల్‌ల ఓలిక్ యాసిడ్, లినోలిక్ యాసిడ్ ఉంటాయి. ఇవి శిరోజాలను సంరక్షిస్తాయి. జుట్టును ఇన్‌ఫెక్షన్ నుంచి రక్షిస్తాయి. ఇలా జుట్టు రకం, చర్మాన్ని బట్టి ఎవరికి తగిన హెయిర్ ఆయిల్‌ను వారు వాడితే అన్ని రకాలుగా ప్రయోజనాలను పొందవచ్చు.

# క్షయను జయిద్దాం

క్షయ అనుక్షణం భయపెట్టించే అంటువ్యాధి. నాలుగు వేల సంవత్సరాలుగా మానవ మనుగడను శాసిస్తున్న మహమ్మారి. భూమ్మీద క్షయ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నది భారతదేశంలోనే. ప్రపంచవ్యాప్తంగా సుమారు కోటి ఎనభై లక్షల మంది టీబీతో బాధపడుతుండగా, అందులో నాలుగో వంతు మనదేశంలోనే ఉండటం ఆందోళనకరం. ప్రతి మూడు నిమిషాలకు ఒక రోగి క్షయతో మరణిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఈ దుస్థితికి కారణం ఈ వ్యాధి గురించి ప్రజల్లో అవగాహన లేకపోవడం. నిర్లక్ష్యం. క్షయ ప్రధానంగా ఊపిరితిత్తులకు సోకినప్పటికీ, ఇతర అవయవాలకు కూడా ప్రమాదం పొంచి ఉంటుంది. కాబట్టి, రోగులను దీర్ఘకాలం పాటు పీడించే ఈ ప్రాణాంతకమైన వ్యాధి పూర్వాపరాలను తెలుసుకోవడం తప్పనిసరి. మనదేశంలో రోజుకు ఎంతోమంది క్షయతో మరణిస్తున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) లెక్కలు వెల్లడిస్తున్నాయి. అందులోనూ ముఖ్యంగా హెచ్ఐవీ, క్యాన్సర్ రోగులు, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడే రోగులు ఎక్కువగా ఉన్నట్టు తెలుస్తున్నది. ఇలా ఉంటే 1882 మార్చి 24న క్షయవ్యాధికి కారణమయ్యే సూక్ష్మజీవిని జర్మనీ శాస్త్రజ్ఞుడు రాబర్ట్ కోచ్ కనుక్కొన్నాడు. వ్యాధి నివారణకు శ్రీకారం చుట్టాడు. దీనికి గుర్తుగా వందేండ్ల తర్వాత నుంచి ఏటా మార్చి 24ను ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినంగా జరుపుకొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ వ్యాధి గురించి అవగాహన చేసుకుందాం.

**ఎలా వస్తుంది?**


ఈ వ్యాధి 'మైకోబ్యాక్టీరియం ట్యూబర్క్యులోసిస్' అనే బ్యాక్టీరియా వల్ల వస్తుంది. దీన్ని ట్యూబర్క్యులోసిస్ (టీబీ) అని కూడా పిలుస్తారు. ఈ వ్యాధిగ్రస్తులు మాట్లాడినప్పుడు, దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, ఉమ్మివేసిన సందర్భాల్లో గాలిలోకి విడుదల అయ్యే తుంపర్ల వల్ల చుట్టుపక్కల వారికి క్షయ సోకుతుంది. ఈ వ్యాధి రెండు రకాలు. మొదటిది ఊపిరితిత్తుల క్షయ, రెండోది ఇతర అవయవాల క్షయ. ఒకరి నుంచి మరొకరికి వ్యాపించేది ఊపిరితిత్తుల క్షయ.

**వ్యాధి లక్షణాలు**

2 వారాలు లేదా అంతకంటే ఎక్కువ రోజులు దగ్గు రావడం.
సాయంత్రం, రాత్రి సమయాల్లో జ్వరం, చెమటలు పట్టడం.
అవాంఛనీయంగా బరువు తగ్గడం.
ఆకలి మందగించడం.
ఆయాసం, నీరసించిపోవడం.
దగ్గుతోపాటు తెమడలో రక్తం పడటం.
ఎలా నిర్ధారిస్తారు?

తెమడ పరీక్ష ద్వారా వ్యాధిని గుర్తిస్తారు. ప్రత్యేక సందర్భాల్లో డీఎన్ఏ పరీక్ష ద్వారా కూడా బ్యాక్టీరియాను గుర్తిస్తారు.

**నివారణ సాధ్యమేనా?**




క్షయను వందశాతం నివారించవచ్చు. అయితే, వ్యాధిని సకాలంలో గుర్తిస్తేనే ఇది సాధ్యమవుతుంది. ఈ దిశగా ముందుగా క్షయ వ్యాధిపై ప్రజల్లో పూర్తి అవగాహన ఉండాలి. వ్యాధి లక్షణాలు కనిపించగానే, లేదంటే రెండు వారాల కంటే ఎక్కువ కాలం దగ్గు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. వ్యాధి ఉన్నట్టు తేలితే వెంటనే మందులు వాడటం మొదలుపెట్టాలి. వైద్యులు సూచించిన మందులను రోగి తు.చ. తప్పకుండా ఆరు నెలలు వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుంది. కానీ, కొంతమంది దగ్గు, జ్వరం తగ్గగానే నెల రోజుల్లోనే మందులు మానేస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం. దీనివల్ల రెండో రకం క్షయ, అంటే మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ ఎండీఆర్ టీబీ వస్తుంది. దీని చికిత్స కాలం 9 నెలల నుంచి ఏడాది కాలం దాక ఉంటుంది. ఈ రకం క్షయకు చికిత్స వ్యయం కూడా ఎక్కువే. పైగా దుష్ప్రభావాలూ అధికంగా ఉంటాయి. ఈ దశలో కూడా మందులు వాడటం నిర్లక్ష్యం చేస్తే వ్యాధి మరింత ముదురుతుంది. ఎక్స్‌టెన్సివ్‌లీ డ్రగ్ రెసిస్టెంట్ ఎక్స్‌డీఆర్ టీబీగా రూపాంతరం చెందుతుంది. ఈ దశలో చికిత్స అందించినా పెద్దగా ప్రయోజనం ఉండదు! ఈ మధ్యకాలంలో ఎండీఆర్, ఎక్స్‌డీఆర్ కేసుల సంఖ్య పెరుగుతుండటం బాధాకరం. కాబట్టి, క్షయ గురించి అవగాహన కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృత ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. ప్రజలు కూడా క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలి. దేశంలో 40 శాతం కన్నా ఎక్కువ మంది వరకు టీబీ ఇన్ఫెక్షన్‌కు లోనైన వాళ్లు ఉంటారు. అయితే, ఇన్ఫెక్షన్‌కు గురైన వాళ్లందరికీ క్షయ రాదు. వాళ్లలో రోగ నిరోధక శక్తి తగ్గడం, తగిన పోషకాహారం తీసుకోని సందర్భంలో ఇన్ఫెక్షన్ వ్యాధిగా మారే ప్రమాదం ఉంది. హ్యూమన్ ఇమ్యూనో వైరస్ (హెచ్ఐవీ), క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధి బాధితుల్లో టీబీ వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి. సకాలంలో వ్యాధిని నిర్ధారించి, కచ్చితమైన మోతాదులో, పూర్తికాలం మందులు వాడితే టీబీని 6 నెలల్లో వంద శాతం నివారించవచ్చు.

**డ్రగ్ రెసిస్టెంట్ కేసులకూ మందులు**

డ్రగ్ రెసిస్టెంట్ కేసులకు అంటే మందులు వాడిన తర్వాత, వివిధ కారణాల వల్ల రెండోసారి టీబీ బారినపడిన రోగులకు ప్రస్తుతం మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. గతంలో డ్రగ్ రెసిస్టెంట్ కేసుల్లో కేవలం 30 శాతం మాత్రమే ఫలితాలు ఉండేవి. ఇప్పుడు 60 నుంచి 65 శాతం వరకు ఫలితాలు కనిపిస్తున్నాయి.

# వంతారా ఎంతో వింతేరా..!

















చిన్న పిల్లలకి సహజంగానే జంతువులంటే ఆకర్షణ ఉంటుంది. వాటితో చాలా తొందరగా బంధాన్ని ఏర్పరచుకోగలుగుతారు. వాళ్ల కథల్లోనూ కార్టూన్లలోనూ కూడా ఎప్పుడూ అవే ఉంటాయి. వాటికి ఎలాంటి కష్టమొచ్చినా అయ్యో అని బాధపడిపోతుంటారు. అయితే, అలాంటి ఓ పిల్లాడి అనుబంధమే నేడు 200 ఏనుగులు సహా 2000 దాకా జంతువులను కాపాడే ఓ వన్యప్రాణి సంరక్షణా కేంద్రం ఏర్పాటుకు కారణమైంది. కొన్ని వందల మంది డాక్టర్లు, నిపుణులు వాటి బాగోగులు చూసుకునే బాటయింది. రిలయన్స్ సంస్థల అధినేత ముకేశ్ అంబానీ కుమారుడు అనంత్ అంబానీనే ఆ పిల్లవాడు. ఇక, వింతైన ఆ జంతు ప్రపంచమే గుజరాత్ రాష్ట్రపు జామ్ నగరలో ఉన్న 'వంతారా జూ'! అనంత్ అంబానీకి పన్నెండేండ్ల వయసులో తల్లి నీతాతో కలిసి ఓ ఊరికి వెళుతున్నాడు. అందమైన చెట్లు, పరిగెడుతున్నాయా అనిపించే ఊళ్లు చూస్తూ కూర్చున్నాడు అనంత్. అదే దారిలో ఓ ఏనుగు పిల్ల కనిపించిందతనికి. ఇంకేం, ఎగిరి గంతేసినంత పనిచేశాడు. కానీ పరిశీలించి చూస్తే పాపం అది ఎంతో ఇబ్బందిగా నడుస్తున్నది. మావటి వాడు దాన్ని ఎలాగోలా తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు. అది చూసిన అనంత్ మనసు చలించిపోయింది. 'పాపం కదా అమ్మా మనం పెంచుకుందామా దాన్ని' అని అడిగాడు. 'సరే నువ్వు జాగ్రత్తగా చూసుకుంటావా మరి'%ా%అని అడిగింది తల్లి. 'అవునమ్మా నేను దాన్ని బాగా చూసుకుంటాను' అని చెప్పాడా పిల్లవాడు. అలా ఆ ఏనుగు పిల్ల అనంత్ దగ్గరికి చేరింది. 'దాన్ని తీసుకున్నప్పటికి కనీసం అది ఏం తింటుందో కూడా తెలీదు' అని చెబుతాడు అనంత్. 'మావటి వాడు ఏం చెబితే అదే పెట్టేవాళ్లం. దానికి ఏమైనా అయితే చికిత్స చేయించడానికి కూడా పెద్దగా నిపుణులు అందుబాటులో లేరు. అయితే ఇన్నాళ్లలో మేం చాలా నేర్చుకున్నాం. ఆ ఒక్క ఏనుగే కాదు, ఎన్నో ఆపదలో ఉన్న జంతువులు మా దగ్గర వచ్చి చేరాయి. మరెన్నో గాయాల పాలై, ప్రాణాపాయంలో ఉన్న జీవులు ఇక్కడ కోలుకుని ఆనందంగా ఆడుకుంటున్నాయి. వాటికోసం ఎంతో పరిశోధనలు చేసి వందల సంఖ్యలో నిపుణుల్ని నియమించాం. విభిన్న జాతుల జంతువులు ఇక్కడి అడవిలో చక్కగా తిరుగుతూ ఉండటం చూస్తే ఎవరికైనా ఆనందం కలుగుతుంది' అని తన ఈ ముందడుగు గురించి చెబుతాడు అనంత్. ఇంతకీ వంతారా అంటే ఏమిటో చెప్పలేదు కదూ స్టార్ ఆఫ్ ద ఫారెస్ట్ అడవి చుక్క అని అర్థం! వంతారాలో మొత్తం 43 విభిన్న జాతులకు చెందిన 2000 దాకా జంతువులు ఉన్నాయి. అందులో 200 ఏనుగులు ఉన్నాయి. మంచు చిరుతలు, తెల్ల పులులతో పాటు విభిన్న రకాల చిరుతలు, పులులు, సింహాలు ఇక్కడ తిరుగుతుంటాయి. అనేక రకాల పాములు, మొసళ్లు, జిరాఫీలు, జీబ్రాలు, హిప్పోలు భారత్ సహ ప్రపంచంలోని విభిన్న ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి చేరాయి. అంతేకాదు, అంతరించిపోతున్న జాతులుగా ఉన్న దేవాంగ పిల్లి, బట్టమేక పిట్ట, రాబందు, ఒకాపి, కారకల్ లాంటి జంతు, పక్షుజాతులెన్నో ఇక్కడ తమ ఉనికిని పెంపొందించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. గుజరాత్ రాష్ట్రంలోని జామ్ నగర్‌లో మొత్తం 3000 ఎకరాల్లో ఉన్న దీనిలో ఈ జీవులన్నీ తమ కోసం కేటాయించిన విశాలమైన ప్రాంగణాల్లో సంచరిస్తుంటాయి. అడవుల నరికివేత వల్ల తమ స్థావరాలను కోల్పోవడం, వేట, స్మగ్లింగ్ లాంటి రకరకాల ప్రమాదాలకు గురయిన జంతువులే ఇవన్నీ. వేరువేరు ఆరోగ్య సమస్యలతో వచ్చే వాటిని ఇక్కడి నిపుణులైన వైద్యులు పరిశీలిస్తారు. ప్రపంచంలోనే అగ్రశ్రేణి వైద్యులు, జంతు సంరక్షణ నిపుణులతో పాటు న్యూట్రీషనిస్టులు, పాథాలజిస్టుల్లాంటి 500 మంది అంకిత భావం కలిగిన నిపుణుల బృందం వీటి జబ్బులు, గాయాలను నయం చేసేందుకు పనిచేస్తున్నది. క్రూర జంతువులా, సాధు జంతువులా, సరీసృపాలా అన్నదాన్ని బట్టి అన్ని జంతువులకూ స్వేచ్ఛగా సంచరించేందుకు సరిపడా స్థలాన్ని కేటాయిస్తారు. వీటి బాగోగులు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా చూసుకునేందుకు 2100 మంది దాకా ఉద్యోగులు ఉన్నారు. 75 యానిమల్ అంబులెన్సులు కూడా ఉన్నాయిక్కడ. వంతారాలో ప్రధాన ఆకర్షణ ఏనుగులే. ఇక్కడ ఉండే 200కు పైగా గజరాజుల సంరక్షణ కోసం 25000 చదరపు అడుగుల్లో ఆసుపత్రి కట్టారు. ఇది ప్రపంచంలోనే అతి పెద్దది. భారీగా ఉండే ఈ జంతువులకు ఆర్థరైటిస్‌లాంటి ఎముకల సమస్యలు ఏర్పడుతుంటాయి. దానికి హైడ్రోథెరపీ అని చేస్తారు. కాళ్ల సమస్యలు, కీళ్ల నొప్పులు ఉండే ఏనుగులు ఇక్కడి హైడ్రోథెరపీ పూల్స్‌లో కొన్ని గంటల పాటు సేదతీరి, సాంత్వన పొందుతుంటాయి. ఇవికాక, ముల్తానీ మట్టి మసాజ్, జకుజీ (బాత్ టబ్ థెరపీ)లాంటివీ వీటి కోసం ఏర్పాటు చేశారు. ఇక, ఇందులో నివసించే జంతువుల ఆరోగ్య పరీక్షల కోసం, శస్త్ర చికిత్సలు, ఇతర చికిత్సల కోసమూ ఏర్పాట్లున్నాయి. ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకువెళ్లగలిగే పోర్టబుల్ ఎక్స్-రే, లేజర్ మెషీన్‌లు, సీటీ, ఎంఆర్ఐ యంత్రాలు, ఐసీయూ, డయాలిసిస్ కేంద్రం, పాథాలజీ ల్యాబ్, ఆపరేషన్ థియేటర్లు, హైపర్ బారిక్ ఆక్సిజన్ ఛాంబర్లు ఉంటాయి. అల్ట్రాసౌండ్, ఎండోస్కోపీలాంటివి పరీక్షలు చేసే పరికరాలూ ఇక్కడ ఉన్నాయి. కేవలం జంతువులను కాపాడి ఆరోగ్యాన్ని బాగు చేయడమే కాదు, వాటి గురించిన పరిశోధనలు జరిపే ప్రత్యేక విభాగమూ వంతారాలో ఏర్పాటయింది. ఆపదలో ఉన్న జంతువుల సంరక్షణ కోసం ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్, వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫండ్ ఫర్ నేచర్ లతో కలిసి పనిచేస్తున్నది వంతారా. వివిధ దేశాల్లోని జంతు సంరక్షణ కేంద్రాలతో పాటు ముఖ్యంగా మెక్సికో, వెనెజుల్లాలో ఉన్న రెస్క్యూ సెంటర్ల భాగస్వామ్యమూ ఉంది. భారత్‌లోని నేషనల్ జూ అథారిటీతోనూ టై అప్ అయ్యింది వంతారా. దేశవ్యాప్తంగా జూ లను ఏర్పాటు చేసేందుకు మంతనాలు చేస్తున్నది. ఇటీవలే ప్రధాని అధికారికంగా ఓపెన్ చేసిన ఇది, త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది. 'ఆవులో మూడు కోట్ల దేవతలూ ఉంటారంటారు. నేను ప్రతి ప్రాణిలోనూ దేవుడిని చూస్తాను. వాటికి సేవ చేయడం నిజంగా అదృష్టంగా భావిస్తాను. ఎందుకంటే మనుషులకు సేవ చేసే వాళ్లు చాలామందే ఉంటారు. కానీ నోరులేని ఈ ప్రాణులకు సేవ చేసే వాళు చాలా తక్కువ. అందుకే అలాంటి జంతువుల కోసం ఈ నా ముందడుగు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను.' అంటూ ప్రేమ పూర్వక గొంతుకతో చెబుతాడు అనంత్.

# కలుపు మొక్కనెలా కలుపుకొని సాగడం?




'మన శత్రువులు వేర్వేరు రూపాలను తీసుకొని ఉండవచ్చు, కానీ మనం మారలేదు. మన పోరాటాలు మారలేదు. అదే డీఎంకే' అని కలైవానర్ అరంగంలో 2024, అక్టోబర్ 5న ఆ పార్టీ ఎంపీ తిరుచ్చి శివ రాసిన ఐదు పుస్తకాలను ఆవిష్కరించిన సందర్భంగా తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ సందేశమిచ్చారు. ప్రఖ్యాత వర్ధమాన సినీ నటుడు, ప్రగతిశీల వాది అయిన ప్రకాష్‌రాజ్ కూడా పాల్గొన్న ఆ సమావేశంలోనే చరిత్రను మార్చడానికి, పుకార్లను వ్యాప్తి చేయడానికి, అసత్యాల ఆయువు పెంచడానికి రాజకీయ శత్రువులు నిరంతరం చేసే ప్రయత్నాలను ఓడించడానికి సత్యాలను ఎప్పటికప్పుడు ప్రజల్లో ఉంచడమే పరిష్కారమని కూడా అన్నారు. నిజమే, సాంఘిక దురాచారాలు, ఆత్మగౌరవం, తమిళ అస్తిత్వం అంశాలపై ఎటువైపు నుంచి దాడి ఎదురైనా, ఏ శక్తులతో తలపడాల్సిన సందర్భం ఎదురైనా డీఎంకే నిర్మాతలైన అన్నాదురై నుంచి కరుణానిధి వరకు పెరియార్ మార్గాన్ని మదిలో ఉంచుకునే జనాన్ని నడిపించారు. జస్టిస్ పార్టీ, ద్రవిడార్ కళగం అనుభవాల నుంచి తమిళనాడు రాష్ట్ర రాజకీయ అస్తిత్వం కోసం ద్రవిడ మున్నేట్ర కళగం చాలా స్పష్టమైన కార్యాచరణనే సుదీర్ఘకాలం ఆచరణాత్మకంగా నమ్ముకున్నది. దానివల్లనే ఒక ప్రాంతీయ పార్టీ ఏడున్నర దశాబ్దాల పాటు క్రియాశీలకంగా మనుగడ సాగించడమే కాదు రాష్ట్ర, దేశ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకమైన అధ్యాయాన్ని సంపాదించగలిగింది. అయితే తాజాగా స్టాలిన్ నేతృత్వంలో ఆ పార్టీ ప్రారంభించిన డీలిమిటేషన్ వ్యతిరేక పోరాటంలో దక్షిణాది రాష్ట్రాల హక్కుల నినాదంతో పాటు ఎన్నికల రాజకీయాల్లో తమిళ ఏజెండాను భావోద్వేగ అంశంగా నిలబెట్టి, రాజకీయ విరోధులను నిలువరించాలనే డీఎంకే సహజమైన ఎత్తుగడ కూడా ఇమిడి ఉన్నదనేది ఎవరూ కాదనలేని వాస్తవం. అయితే ఆ పార్టీ ఎత్తుకున్న డీలిమిటేషన్ వ్యతిరేక పోరాటాన్ని, త్రిభాషా విధానానికి నిరసనగా వినిపిస్తున్న వాదనను యూజీసీ ప్రతిపాదనల వెనుక రాష్ట్రాల హక్కుల హననం వైఖరిని తేటతెల్లం చేయడాన్ని సమాఖ్య విధానాన్ని, రాజ్యాంగస్ఫూర్తిని విశ్వసించే వారెవరైనా సమర్థించి తీరవలిసిందే. అయితే, తమిళనాడు ప్రయోజనాలకు, ఆత్మ గౌరవానికి స్వాతంత్ర్యానికి పూర్వం, అనంతరం బలమైన విరోధిగా నిలబడిన కాంగ్రెస్ పార్టీని కూడా తాజాగా ప్రతిపాదిస్తున్న పోరాట జట్టులో కలుపుకొని సాగాలనే అంశంపైనే భిన్నాభిప్రాయాలు వ్యక్తం కాకుండా ఉండలేవు. ఆనాటి మద్రాస్ ప్రెసిడెన్సీలోని అన్యాయమైన విధానాల నుంచి ఇండిపెండెంట్ ఇండియాలో సుదీర్ఘకాలం తమిళనాడు రాష్ట్ర ప్రజలు ఎదుర్కొన్న దుఃఖపూరితమైన అనుభవాలకంటే ఎన్నో రెట్ల ఎక్కువ వేదనను తెలంగాణ రాష్ట్రం అనుభవించిందన్నది చరిత్ర చెప్తున్న సత్యం. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో తమిళనాడులో అమలవుతున్న రిజర్వేషన్లు చెల్లనేరవని న్యాయస్థానాలు తప్పుపట్టడంపైనే పెరియార్ నిప్పుల వర్షం కురిపించారు. కాంగ్రెస్ పార్టీ వైఖరి ఇప్పటికైనా మారిందా అంటే వెయ్యి జీవులను మింగిన రాబందు, మళ్లీ అవకాశం కోసం ఆవు మొహం పెట్టుకొని తిరుగుతున్న విధంగానే ఉన్నది. అందుకే మొన్నటికి మొన్న ఇండియా కూటమిలోనే ఉన్న ఢిల్లీ రాష్ట్ర హక్కుల కోసం పోరాడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీని ఓడించేందుకు పావులు కదిపి, బీజేపీ గెలుపునకు సహకరించింది. ఈ కుట్రను స్వయంగా రేవంత్ రెడ్డే బయటపెట్టాడు. ఢిల్లీ ఎన్నికల ఫలితాల అనంతరం కేజ్రీవాల్ పార్టీ ఓటమికి వ్యూహాలు పన్నిందే కాంగ్రెస్ పార్టీ అని బీరాలు పలికాడు. సిరా రాతలు ఆరకమునుపే దేశ రాజ్యాంగా న్ని బ్రాహ్మణ డాక్యుమెంట్‌గా వర్ణించి, ప్రత్యేక ద్రవిడనాడు దేశమే కావాలంటూ వేర్పాటు ఉద్యమాన్ని రగిలించాడు. దాంతో మొదటి ప్రధాని నెహ్రూ రాజీకి వొచ్చేలా, తొలి రాజ్యాంగ సవరణ జరిగేలా చేసి, స్వతంత్ర దేశంతో అడుగులు కలపడంలోనే హక్కుల పట్ల రాజీలేనితనాన్ని తమిళజాతి చూపించగలిగింది. అదే స్ఫూర్తితో 1949లో మొదలైన డీఎంకే, కాంగ్రెస్ పార్టీ అన్యాయమైన రాజకీయాలను ప్రజల్లో ఎండగడుతూ, ఎట్టకేలకు 1967 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి అధికారం హస్తగతం చేసుకున్న తొలి ప్రాంతీయ పార్టీగా చరిత్రలో నిలిచింది. ఇలా చాలా స్పష్టాతి స్పష్టంగా తొలి నాటనే తమ రాష్ట్ర ఆత్మగౌరవానికి రాజకీయ శత్రువు కాంగ్రెస్ పార్టీనే అనే కీలక అంశాన్ని సైద్ధాంతికంగా ద్రవిడియన్ భావజాలంలో మిళితం చేసి ప్రజలందరి హృదయాల్లో నాటగలిగింది. అయితే, 2014 నాటికే పూర్తిగా తమిళనాట కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా నిర్వీర్యం చేసి, డీఎంకే ఆశ్రిత సంస్థగా లొంగదీసుకోగలిగింది. అయితే డీఎంకే మూల సిద్ధాంతకర్తలైన పెరియార్, అన్నాదురై విశ్వసించిన ప్రజాస్వామ్యం, సామాజిక సమానత్వం, రాష్ట్రాల ఆత్మ గౌరవం తదితర మౌలికమైన రాజ్యాంగ అంశాల పట్ల అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ఒక తీరున, విపక్షంలో ఉన్న రాష్ట్రాల్లో మరో తీరున అపరిచితుడు సినిమాలో వలె భిన్న మొహాలతో ప్రవర్తిస్తున్న కాంగ్రెస్ పార్టీని కూడా రాష్ట్రాల హక్కుల సాధన పోరులో కలుపుకొని సాగాలనుకోవడంపై ఏకాభిప్రాయానికి రావడం కష్టం. కాంగ్రెస్ అనే కలుపు మొక్కను కూటమిలో పెట్టుకొని రాష్ట్రాల హక్కుల ఉద్యమాన్ని ప్రాంతీయ రాజకీయశక్తులు కొనసాగించడం ఏమిటనే ఆందోళన వ్యక్తమౌతున్నది. రాజ్యాంగానికి తూట్లు పొడవడంలో, సమాఖ్య స్ఫూర్తికి కళంకం తేవడంలో, కాంగ్రెసేతర గవర్నమెంట్‌లను కూలదోయడంలో, అంతెందుకు బడుగు వర్గాలకు అవకాశాలను దూరం చేయడంలో హస్తం పార్టీ అతి పెద్ద పాపాలపుట్టనే కదా? నంబుద్రీపాద్ నుంచి ఎన్టీఆర్ దాకా దక్షిణ భారతదేశంలో కాంగ్రేసేతర ప్రభుత్వాలను కూల్చివేసిందే కాంగ్రెస్ పార్టీ. డీలిమిటేషన్‌తో పాటు హిందీ భాష, యూజీసీ నిబంధనల వివాదంలో తొలి అడుగు వేసిందే కాంగ్రెస్ పార్టీ కేంద్ర సర్కార్లు. 1937లోనే నాటి మద్రాస్ ప్రెసిడెన్సీలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తే, మూడేండ్ల పాటు ఉధృతంగా వ్యతిరేక పోరాటం నడిచింది. దానివల్లనే హిందీ, ఇంగ్లీష్‌లను అధికార భాషలుగా గుర్తించారు. మళ్లీ 15 ఏండ్ల తర్వాత హిందీని ఇదే కాంగ్రెస్ పార్టీ సర్కార్ జాతీయ అధికార భాషగా ప్రకటించే ప్రయత్నం చేసింది. అయితే తమిళనాడు వ్యతిరేకతకు జడిసి 1963 అధికార భాషా చట్టంలో హిందీతో పాటు ఇంగ్లీష్ ను చేర్చారు. అలాగే, 2009, 2011లో రాష్ట్రాల విద్యాహక్కులు హరించే ప్రయత్నం కాంగ్రెస్ చేసిం ది. పశ్చిమబెంగాల్, తమిళనాడు నిరసించడంవల్లనే వెనక్కి తగ్గారు. ఇలాంటి ధోరణిలో బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందే. అంతెందుకు రిజర్వేషన్ల కోసమే ప్రత్యేక ద్రవిడనాడు పోరాటం చేసిన తమిళనాడు రాష్ట్ర మేధావులు, నేతలకు.. ప్రత్యేక దేశం గా, అనంతరం ప్రత్యేక రాష్ట్రంగా వర్ధిల్లిన తెలంగాణపై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎలా దాడి చేసి, ఐదున్నర దశాబ్దాలు ఎలా అడుగడుగునా వంచించిందో చరిత్ర సాక్షిగా తెలియకుండా ఉండదు. తమిళనాడు కంటే తెలంగాణ, డీఎంకే కంటే బీఆర్ఎస్ ఎన్నో రెట్లు ఎక్కువ నిర్బంధాన్ని, నష్టాన్ని, కష్టాలను కాంగ్రెస్, బీజేపీల వల్ల అనుభవించాయి. ఎంతో వైవిధ్యమైన ఉన్నతమైన చరిత్రనూ, త్యాగాలనూ తెలంగాణ ప్రజలు పండించారు. కానీ, తెలంగాణలో హస్తం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నామినేటెడ్ నుంచి మంత్రివర్గ విస్తరణ వరకు, ప్రతి పైసా ఖర్చుపెట్టడం కోసం 37 సార్లు ఢిల్లీ వెళ్లి, గాంధీల అనుమతి తీసుకునే పరిస్థి తి ఏర్పడింది. ఇది త్యాగాల తెలంగాణ ఆత్మగౌరవాన్ని ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దలు బలితీసుకోవడం కాదా? ఇలా ఇంకా మారని, మళ్లీ కేంద్రంలో అధికారంలోకి వస్తే ప్రాంతీయ రాజకీయ శక్తులను వేటాడుతామని కేజ్రీవాల్ ఉదాహరణతో తేటతెల్లం చేస్తున్న కాంగ్రెస్‌ను కలుపుకొని సాగడం వల్ల ప్రాం తీయ పార్టీలకు, రాష్ట్రాలకు ముప్పే. బీఆర్ఎస్, డీఎంకే తదితర పార్టీల పుట్టుక, సుదీర్ఘ పోరాటం, త్యాగాల వెనుక ప్రాంతీయ ఆకాంక్షలున్నాయి. కాబట్టి డీఎంకే తాజా పోరాట ఎజెండాలో ఎంత న్యాయమున్నదో, జట్టులో కపట కాంగ్రెస్‌ను కలుపుకొనిపోవడంలో అంతే నష్టమున్నది. పైగా అధికారంలో ఉన్నంత మాత్రాన తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి లాంటి ఢిల్లీ దళారీ పాలకుల నేతృత్వంలో రాష్ట్రాల హక్కుల సాధన పోరు రెండో సమావేశం జరపాలని నిర్ణయించడం ప్రజాస్వామ్యవాదులకు ఎబ్బెట్టుగా అనిపిస్తున్నది. డీఎంకే, బీఆర్ఎస్ తలపెట్టిన పోరాటాన్ని, కాంగ్రెస్ కలుపుమొక్కను తీసేసి కొనసాగించగలిగితే, ఈ జట్టులో అధికారంలో లేకపోయినా సరే మిగతా ప్రాంతీయ పార్టీలు, సంఘాలు, మేధావులను భాగస్వామ్యులుగా మార్చగలిగితే మంచిది.

Printed, Published, Owend by Neeruganti Shashikala& Printed at Sreenivasa Offset Printers D.No 12-73-A, Sai Nagar, Anantapur (Dt) APTEL/RNI NO/2021/81405 & Published at D. NO. 12-73-A, Sai Nagar. Anantapur. ANANTAPUR (Dt).(A.P) Editior Neeruganti Shashikala Cell: 6303427710